అపరాధ పరిశోధన

రు. 5.50 | జూన్ '83

Blank Page

సంపుటి: 36
సంచిక: 5

ఫోన్ నెం:
64643

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

జూన్, 1983

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

ఏప్రెల్ సంచిక నుంచి తిరిగి కార్టూన్లను మా కందిస్తున్నందుకు ధన్యవాదాలు. వసుంధరగారి 'ఆమె భయం', జొన్నలగడ్డగారి 'జీవుడు' కథలు ఫెంటాస్టిక్‌గా వున్నాయి. కథలకు ఒకే కార్టూనిస్ట్‌తో కాక వివిధ కార్టూనిస్టుల కవకాశం ఇవ్వండి

—విజేంద్రనాథ్ ప్రసాద్, ఆదోని.

ప్రతాప రవిశంకర్‌గారి 'పొరపాటు ఖరీదు నాలుగు లక్షలు', అజీజ్‌గారి 'మచ్చలేని చంద్రబింబం', వసుంధరగారి 'ఆమె భయం' కథలు ఈ అపనలో హైలెట్స్. రామలక్ష్మిగారి 'జీవుడు' కథ నాకు ఎంతమాత్రం నచ్చలేదు. 'సాగర లోయ'ను యీ నెల గొప్ప సస్పెన్స్‌లో పడవేశారు.

—తోట కేశవరావు, సమనస.

'సాగర లోయ' సీరియల్ మంచి సస్పెన్స్‌తో సాగుతున్నది. కథల కోసం మల్లిక్‌గారు వేసిన కార్టూన్ బొమ్మలు బాగున్నాయి. అపనలో నిజంగా జరిగిన క్రైమ్ కేసులకు కూడా స్థానమిస్తే బాగుంటుంది.

—యం.డి ఇ యస్. హఫ్, రైడా (సౌదీ అరేబియా).

ఏప్రెల్ నెలలో ఆమె భయం, వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజెన్సీ, అన్‌ఫిట్—కథలు వినోదభరితంగా వున్నాయి. అజీజ్‌గారి 'మచ్చలేని చంద్రబింబం' కథ చాలా బాగుంది. కార్టూన్ల సంఖ్య పెంచవలసిందిగా కోరుచున్నాము.

—కైపా కృష్ణమూర్తి, మదనపల్లి.

మే నెల అపనలో కాశీభట్ల భానుమూర్తిగారి 'ఆనంద తాండవం' కథ చాలా బాగుంది. బొమ్మిడి అచ్చారావుగారి 'ఆరడుగుల శవం', జొన్నలగడ్డ రామలక్ష్మిగారి 'పొదుపరి భర్తలు-గడుసరి భార్యలు' కథలు చాలా గమ్మత్తుగా ఉన్నాయి. 'సాగర లోయ' సీరియస్‌గా సాగిపోతోంది.

—రాళ్ళబండి రాజన్న, బెల్లంపల్లి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. మరో తప్పు— వసుంధర
26. కాటేసిన సర్పం—విశ్వమోహిని
35. రాక్షసి కోరిక—ప్రతాప రవిశంకర్
48. నేనే న్యాయమూర్తిని—బొమ్మిడి అచ్చారావు
60. శోభనం రాత్రి—ఎమ్. టి. చైతన్య
72. కాశ్మీరు బాబా—ఏ. వీ. మోహన్రావ్
90. కట్నం వచ్చిన కేసు—కాశీభట్ల భానుమూర్తి
98. కోహిమా కాజెల్—M. R. N. ప్రసాదరావ్
115. అర్హత—జె. రామలక్ష్మి
133. వృత్తి శత్రువులు—బి. రాజేశ్వరి
152. సాగర లోయ (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

నవలలు (సప్లిమెంట్)

3. అందాల భామ—వసుంధర
40. హత్య మీద హత్య—బొమ్మిడి అచ్చారావు
79. రాగద్వేషాలు—టెంపోరావ్
117. సినిమా గ్లామరు—వాణిశ్రీ
151. విషసర్పాలు (సీరియల్)—సికిందర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

మరో తప్పు

వసుంధర

ఉద్యోగం నాకు చాలా అర్జంటు. ఎంత అర్జంటంటే ఏం చేయడానికైనా సిద్ధంగా వున్నాను ఉద్యోగం కోసం.

అదే గోవిందరావుకు చెప్పాను.

గోవిందరావు ఆ కంపెనీలో చాలా పెద్ద హోదాలో

వున్నాడు. నేను ఆ కంపెనీలో ఉద్యోగానికి వచ్చాను. మంచి జీతం. నెలకు పన్నెండు వందలు. ఒక్కటే ఉద్యోగం. దానికి పాతిక మందిని పిలిచారు. వాళ్ళలో నేనొకడిని.

మొదట నన్ను ఇంటర్వ్యూ చేయటానికి అరుగుతున్నారు. అందులో నేను చెప్పిన జవాబులు నచ్చాయో ఏమో-నన్ను చివరివరకూ వుండమన్నారు. అంతా వెళ్ళిపోయాక నన్ను మళ్ళీ పిలిచారు. అప్పుడు గదిలో గోవిందరావు ఒక్కడే వున్నాడు.

"వెరీగుడ్ —నువ్వు నాకు నచ్చావు. నీకు ఇంచుమించు ఉద్యోగం వచ్చినట్లే! ఒకే ఒక్క ప్రశ్నకు నువ్వియ్య బోయే జవాబుమీద నా నిర్ణయం ఆధారపడి వుంటుంది—" అన్నాడు గోవిందరావు.

ఊపిరి బిగబట్టాను. అడగండి—అందామనుకున్నాను. నోట మాటరాలేదు. నిజంగా నా కుద్యోగం వస్తుందా— అంత అదృష్టమా?

"ఉద్యోగం కోసం నువ్వు ఏమైనా చేస్తాననీ చేయగలననీ అంటున్నావు. ఇప్పుడు కూడా అదే మాటమీద నిలబడి ఉంటావా?" అన్నాడు గోవిందరావు.

నేను మాట్లాడలేదు. నా భావి జీవితానికి పునాది కాగల జవాబు అది. ఏం చెప్పాలి? అవునంటే అది నా వ్యక్తిత్వానికి దెబ్బకావచ్చు కాదంటే నాకీ ఉద్యోగం రాకపోవచ్చు. నా వ్యక్తిత్వం దెబ్బ తింటుందన్న బాధ నాకు లేదు. నాక్కావలసింది ఉద్యోగం అవునంటే వస్తుందా, కాదంటే వస్తుందా అన్న విషయం నాకు తెలియాలి. ఎలా తెలుస్తుంది?

"నువ్వు మాట్లాడడం లేదు—" అన్నాడు గోవింద

రావు.

ఒక్క క్షణం ఆలోచించి — "నాకుద్యోగం కావాలి. మీకే సమాధానం కావాలో అది మీరే నిర్ణయించుకోండి-" అన్నాను.

గోవిందరావు ముఖంలో సంతృప్తి కనబడింది-"సరే-అయితే నాక్కావలసిన సమాధానం—"అవును" నీ సమాధానం కూడా అదే కదా!"

"ఊఁ" అన్నాను.

"మరోసారి ఆలోచించుకో—ఉద్యోగం కోసం ఏమైనా సరే చేస్తానని అంటున్నావు"—అని రెట్టించాడు గోవిందరావు.

ఆయనలా రెట్టించగానే నాకు భయం వేసింది. ఏమైనా అన్న పదాన్ని ఒత్తి మరీ పలుకుతున్నాడు. భయపడుతూనే "ఊఁ" అన్నాను మళ్ళీ.

"ఊఁ అంటే సరిపోదు. చెప్పిన పని చేశాకనే ఉద్యోగం...."

"ఏమిటా పని—చెప్పండి...." అన్నాను.

"ఏమైనా చేస్తానన్నావు. ఓ హత్య చేయగలవా?"

"హత్యా?" అన్నాను. ఆపైన నా నోట మాటరాలేదు.

గోవిందరావుకు జవాబు నా కళ్ళలో కనిపించి వుండాలి-"నిన్ను నిజంగా హత్య చేయమని అన్నాననుకో—అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాను. నువ్వు పట్టుబడవు అన్న గ్యారంటీ వుంటుంది. ఆపైన నీకు ఉద్యోగం దొరుకుతుంది. బాగా ఆలోచించుకో...."

ఆలోచిస్తున్నాను. నాకు డబ్బు బాగా అవసరం. అసలు దొంగతనం చేయాలని కూడా అనుకున్నాను. కానీ పట్టుబడతానని భయంవేసింది. పట్టుబడనన్న ధైర్యముంటే

దొంగతనం చేయాలనే అనుకుంటున్నాను. కానీ హత్య గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. హత్యంటే ఓ నిండు ప్రాణాన్ని తీయడం....

"నేను పట్టుబడనన్న గ్యారంటీ ఏమిటి?" అన్నాను.

"నువ్వు హత్య చేస్తానంటే ఈరోజే నీకు పాతికవేలు అందుతాయి. ఆ డబ్బు నీ యిష్టం వచ్చినట్లు వాడుకొనవచ్చు. కానీ సరిగ్గా ఈ వేళకి వారం రోజులు పూర్తికాగానే నేను చెప్పిన పని పూర్తిచేయాలి. లేని పక్షంలో నువ్వుండవు. నేను చెప్పిన పని పూర్తిచేస్తే—నా పాతికవేలూ నాకు తిరిగి ఇస్తే నీకుద్యోగం వస్తుంది. అదీ ఒప్పందం. ఎలాగుంది," అన్నాడు గోవిందరావు.

పాతికవేలు చేతిలోకి ముందు వస్తాయనగానే నాకు ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. మిగతా విషయాలు తర్వాత చూసుకోవచ్చు. ఊఁ అంటే పాతికవేలు వస్తాయి. ఆ డబ్బు అందుకోవడమే మంచిది.

"మీ షరతులకు అంగీకరిస్తున్నాను" అన్నాను.

"బాగా ఆలోచించుకున్నావు కదూ—" అన్నాడు గోవిందరావు.

"ఊఁ"

"అయితే—నేను చెప్పేది శ్రద్ధగా విను. ఉద్యోగం కోసం నువ్వు హత్య చేయనవసరం లేదు. ఏం చేయాలంటే...."

ఆయన చెప్పడం ప్రారంభించాడు.

నేను ఆశ్చర్యంగా వింటున్నాను.

2

సముద్రపుటొడ్డున సరిగ్గా ఆమె ముందు ఆగాను.

పచ్చని ఇసుక....ఆ తిన్నెపై పచ్చని ఛాయలో ఆమె.

అప్రయత్నంగా ఆగి—"నమస్తే!" అన్నాను.

ఆమె ఇబ్బందిగా నా వంక చూసి—"నమస్తే!" అంది.

"మిమ్మల్ని....మిమ్మల్ని....నేనెక్కడో చూశాను..." అన్నాను.

"కానీ నేను మిమ్మల్ని ఇదే చూడడం" అన్నదామె మొహమాటంగా.

"ఆఁ గుర్తుకు వచ్చింది"—అన్నాను—"సుకుమార్ ఇండస్ట్రీస్‌లో కాబోలు మిమల్ని చూశాను—"

"ఎస్—మీకెలా తెలుసు — నేనందులోనే పని చేస్తున్నాను" అన్నదామె.

"విత్ యువర్ పర్మిషన్...." అంటూ ఆమె ఎదుట కూర్చున్నాను.

"చెప్పండి...." అన్నదామె.

"మీ పేరు నీలిమ కదూ!" అన్నాను.

"కాదు—మంజుల" అన్నదామె.

"అయితే మీరు కాదేమో" నిరుత్సాహంగా అన్నాను.

"విషయమేమిటో చెప్పండి" అన్నదామె.

"నేను సుకుమార్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగానికి అప్లై చేశాను. ఆ కంపెనీలో నీలిమ అనే అమ్మాయికి చాలా పలుకుబడి వున్నదనీ ఆమె రికమెండ్ చేస్తే నాకుద్యోగం రావచ్చుననీ ఓ స్నేహితుడు చెప్పాడు. మీ పేరు నీలిమ కాదన్నారుగా...."

"నా పేరు నీలిమ కాదు. నేనే నీలిమనని మీరెలాగనుకున్నారు?" అన్నదామె.

"నీలిమ చాలా అందంగా వుంటుందన్నారు. ఆ కంపెనీకి ఇంటర్వ్యూకి వచ్చినపుడు కొందరు ఆడవాళ్ళని చూశాను. వారిలో అందంగా మీ రొక్కరే నాకు అగుపిం

చారు. మళ్ళీ ఇప్పుడు అనుకోకుండా ఇక్కడ అగుపించారు...."

ఆమె అందంగా సిగ్గుపడింది. నెమ్మదిగా—"అందం సంగతి అటుంచండి. నీలిమ పేరులో మా కంపెనీలో ఆడ పిల్ల లెవ్వరూ లేరు" అంది.

"అయ్‌సీ...." అన్నాను నిరుత్సాహంగా.

"కానీ...." అన్నదామె—"నేను మీకు సాయపడగల ననుకుంటాను ..."

ఉత్సాహంగా—"నిజంగా?" అన్నాను.

"నిజమే—కానీ అందుకు మీనుంచి నేను ప్రతిఫలం ఆశిస్తాను...."

"తప్పకుండా ఇచ్చుకుంటాను...."

"నే నడిగే ప్రతిఫలమేమిటో తెలుసుకోకుండా ఇస్తాననేస్తున్నారే—అసలు ఇచ్చే ఉద్దేశ్యం మీకుందా?" అన్నదామె.

నేను తడబడుతూ — "ఉద్యోగం కోసం ఏమైనా చేస్తాను...." అన్నాను.

"ఏమైనా చేస్తారా?" — ఏమైనా అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ అన్నదామె.

"అవును—ఏమైనా చేస్తాను!" అన్నాను.

"అయితే నన్ను పెళ్ళి చేసుకుంటారా?" అన్నది మంజుల.

"ఇదా—మీరు కోరే ప్రతిఫలం?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇది సామాన్యమైన ప్రతిఫలంగా మీరు భావిస్తున్నారా?"

"ఇది నేను మీకు ప్రతిఫలంగా కాక నాకు వరంగా

భావిస్తున్నాను....."

ఆమె ఆశ్చర్యంగా — "నేను మీకు వరంలా కనబడుతున్నానా?" అంది.

"ఊఁ" అన్నాను.

ఆమె కళ్ళ నీళ్ళు తుడుచుకుని—"నెలకు ఎనిమిది వందలు నా జీతం. కానీ నన్ను పెళ్ళాడాలంటే పదిహేను వేలు కట్నమడుగుతున్నారు చాలామంది. అబద్ధమెందుకూ-చాలామంది నా శీలాన్ని శంకిస్తున్నారు. ఆ కంపెనీలో ఆడ వాళ్ళకు మంచి పేరు లేదు. అయితే నేనేం చేయను? మంచి జీతం.....నా జీవితం బాగానే వుంది. ఎవరూ నా జోలికి రావడంలేదు. అంతా ఇది నమ్మరు.....నేను మీకు వరంలా కనిపించడం నా అదృష్టం....." అన్నదామె.

"నాకైతే ఉద్యోగానికి సంబంధించిన షరతులేమీ లేకుండా మిమ్మల్ని వివాహం చేసుకోవాలని ఉంది. మీ సౌందర్యం అపురూపం. ఆరాధించవలసిన ఆ సౌందర్యాన్ని ముందుంచుకుని గత చరిత్రలను తవ్వుకొనడం నా వల్ల కాదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నాకు ఉద్యోగం అర్జంటు....." అన్నాను.

ఆమె నవ్వి—"మీ ఉద్యోగంకోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తాను....ధైర్యంగా వుండండి" అన్నది.

ఆ రోజుకలా విడిపోయాము. మర్నాడు మళ్ళీ బీచివద్ద ఇద్దరం కలుసుకున్నాము. ఆమె కాస్త నిరుత్సాహంగా వుంది—ప్రయత్నాలు ఫలించేలా లేవుట!

"ఉద్యోగం దొరకలేదన్న బాధకు మించి మిమ్మల్ని వివాహం చేసుకునే అవకాశం పోతున్నదన్న బాధ ఎక్కువగా వుంది నాకు....." అన్నాను.

ఆమె కళ్ళలో మెరుపు కనిపించింది — "మీకు డబ్బు

అవసరమని కదూ అన్నారు—ఎంత?" అంది.

"పదివేలు ...."

"ఆ పదివేలూ నేనిస్తాను ఉత్తినే కాదు. కట్నంగా..."

"మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటూ కట్నం తీసుకోవడం నావల్ల కాదు. అంతగా అయితే ఆ డబ్బు అప్పుగా తీసుకుంటాను. కానీ నా సమస్య అంతటితో తీరిపోదు. నేను ప్రతినెలా నా తండ్రికి కనీసం రెండు వందల రూపాయలు పంపవలసి వుంటుంది" అన్నాను.

ఆమె కొద్దిసేపు ఆలోచించింది—"ఓ పని చేద్దాం—మీకు ద్యోగం వచ్చేవరకూ నా జీతంలోంచి మీ వాళ్ళకు డబ్బు పంపిద్దాం—"

నేను ఆశ్చర్యపడ్డాను. ఆమె ఇలాగంటుందని నేననుకో లేదు ఆశ్చర్యంగా — "మీరు పెళ్ళికోసం తొందరపడుతున్నారని అనిపిస్తుంది....ఇది నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది" అన్నాను.

"ఇందులో ఆశ్చర్యమేమీలేదు...." అంటూ ఆమె తన కథను చెప్పింది.

మంజుల తండ్రికి ఆరుగురు సంతానం. మొదటిది ఆడపిల్ల. పెళ్ళై కాపురానికి వెళ్ళి మళ్ళీ మళ్ళీ పుట్టింటికి వస్తూంటుంది. రెండోవాడు మగ పిల్లవాడు. పెళ్ళి చేసుకుని వేరుపడి పోయాడు. మూడు మంజుల. నాలుగేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నది. తన పెళ్ళికోసమని ఇంతవరకూ పదిహేను వేలు దాచుకుంది.

కానీ ఇంట్లో ఎవ్వరూ ఆమె పెళ్ళిపైన ఆసక్తి చూపడం లేదు. తండ్రి సంపాదన జతపడడంవల్ల ఆ సంసారం సుఖంగా నడిచిపోతున్నది. తండ్రి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ ఆయన షరతులు పెళ్ళివారికి

నచ్చడంలేదు. పెళ్ళికి కట్నం ఇవ్వడట. పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసేస్తాడట. పెళ్ళయినాక కూడా కూతురు తనకు సాయపడాలిట.

"నీకేమమ్మా — అందముంది. ఉద్యోగముంది. ఏ షరతుకైనా ఒప్పుకుని నిన్ను పెళ్ళి చేసుకునే వారు కోకొల్లలుంటారు" అని ఆమె తండ్రి అంటున్నాడు.

మంజులకు పెళ్ళి గురించి తొందరలేదు. తండ్రి ఆమె పద్దెమినిదో ఏట పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు. మూడేళ్ళయింది. ఒక్క సంబంధం కుదరలేదు. తండ్రికి తనకు పెళ్ళిచేసే ఉద్దేశ్యంలేదనీ — తనకు త్వరలో పెళ్ళి కాకుండా వుండడం కోసమే ఆయనిలాంటి షరతులు పెట్టాడనీ ఆమెకు అనిపించింది. తనకు వచ్చే ఎనిమిది వందల్లోనూ మూడువందలామె ఇంట్లో ఇస్తుంది. మిగతా డబ్బులో ఆమె స్వంత ఖర్చులకు పోనూ మిగిలినది బ్యాంకులో వేస్తుంది. అలా నాలుగేళ్ళలో ఇప్పటికి పదిహేను వేలు దాచింది.

పెళ్ళి కావడం వల్ల ఆమెకు మరో ప్రయోజనమున్నది. కంపెనీలో బాస్ ఆమెపైన కన్నేశాడు. ఆయన పెళ్ళైన వారి జోలికి వెళ్ళడు. ఎలాగో అలా పెళ్ళి అయిపోతే ఆ బాస్ బాధ కూడా తప్పిపోతుందని ఆమె ఆశిస్తున్నది.

"ఎన్ని కష్టాలు మీకు?" అన్నాను సానుభూతిగా.

"ఈ దేశంలో ప్రతి ఆడపిల్లకూ ఇలాంటి కష్టాలున్నాయి....నా కష్టాలలో తలిదండ్రుల స్వార్థం కూడా వున్నది.... అంతే!" అన్నది మంజుల.

"మంజులా—మనం వివాహం చేసుకుందాం—" అన్నాను.

మర్యాదామెను నా యింటికి తీసుకుని వెళ్లాను. అక్కడ నా తలిదండ్రుల్ని పరిచయం చేశాను. కాబోయే కోడల్ని చూసి వారు ఎంతో సంతోషించారు. మంజుల ఆశ్చర్య పడింది. నా తలిదండ్రులంత సులభంగా మా వివాహానికి అంగీకరించినందుకు.

"చూడమ్మా — వివాహమంటే రెండు మనసుల కలయిక. మీ రిద్దరూ ఎప్పుడై తే ఒకరినొకరు ప్రేమించు కున్నారో అప్పుడే మీ వివాహం జరిగిపోయింది రేపు మధ్యాహ్నం ఆఫీసుకు సెలవుపెట్టి ఇక్కడికే రా! సింపుల్‌గా నీ పెళ్ళికి ఏర్పాట్లు జరుగుతాయి. నీ పెళ్ళికి మేమే సాక్షుల మవుతాం" అన్నాడు నా తండ్రి.

మంజుల సంతోషానికి అంతులేదు.

మర్యాదామె ఉత్సాహంగా మా యింటికి వచ్చింది.

ఉపరికార్దరులో సన్నాయి ఓ పురోహితుడు. మా ఇద్దరికీ పెళ్ళి జరిగిపోయింది. నేను మంజుల మెళ్ళో మూడు ముళ్ళు వేశాను.

"చూడమ్మా! మీరిద్దరూ ఓ యింటివారయ్యారు. నీ గురించి మావాడంతా చెప్పాడు. నీ మంచి మనసును అర్థం చేసుకున్నాను. అయితే ఒక్క మాట. నీ డబ్బు మాకు వద్దు. మావాడికి ఉద్యోగం దొరికే వరకూ వాడి నుంచి మేము ఏమీ ఆశించం. నీ డబ్బు నువ్వు నీ తలిదండ్రులకే ఇచ్చుకుంటావో—ఏం చేసుకుంటావో—అంతా నీ యిష్టం. కేవలం నీ పెళ్ళికోసం మే మిక్కడకు వచ్చాం. ఈరోజే వెళ్ళిపోతున్నాం. మీ శోభనానికయ్యే ఖర్చులు నావే! ఇక్కడ బాగుండదని అందమైన హోటలు గది ఏర్పాటు చేశాం" అని నా తల్లి ఆమెకు చెప్పింది.

3

ఆ రాత్రికి అశోకా హోటల్లో మాకు రూమ్ బుక్కయి వుంది.

కొన్నాళ్ళపాటు మా వివాహాన్ని రహస్యంగా వుంచాలని నేను మంజులను కోరడంవల్ల ఆమె ఇంకా ఇంట్లో ఈ విషయం చెప్పనంది. రాత్రికి మొదటి ఆటపేరు చెప్పి ఆమె హోటలు గదికి వచ్చింది.

నిజానికి అంతా నా అదృష్టం!

ఎంత అందంగా వున్నదామె!

హొటల్లో ఏర్పాట్లన్నీ చక్కగా వున్నాయి. ఆమె తన అత్త మామల్నీ—తన అదృష్టాన్నీ అభినందించుకున్నది. నేనూ నా అదృష్టాన్నభినందించుకుంటున్నాను. కానీ మనసులో ఏదో మూల కలుక్కుమంటున్నది.

మేమిద్దరం రెండు విధాలుగా ఆలోచిస్తున్నాం. నా ఆలోచనలు వేరు. ఆమె ఆలోచనలు వేరు. ఆమె మా గురించి ఆలోచిస్తున్నది. నేను నా గురించి ఆలోచిస్తున్నాను.

ఉన్నట్లుండి ఎవరో తలుపు తట్టారు.

అప్పటికి నా భార్య కోరికపైన నేను పెళ్ళి బట్టలు ధరించి వున్నాను. ఆమె కూడా పెళ్ళిబట్టలు ధరించి వున్నది. ఇద్దరం మాలలు ధరించి వున్నాం.

తలుపు తట్టిన దెవరై వుంటారు?

నేనే లేచి వెళ్ళి తలుపు తీశాను.

ఓ యువకుడు. అతడి భుజాన కెమేరా వ్రేలాడుతోంది. అతడు నన్ను చూసి—"అరే—ఇది రూంనంబర్ పన్నెండు కాదా?" అన్నాడు.

"కాదు—పదమూడు" అన్నాను.

"అయాం సారీ—" అని అతడు చటుక్కున మంజులను చూశాడు—"ఓహో—కొత్త దంపతుల్లా వున్నారే ..." అన్నాడు.

"ఊఁ" అన్నాను.

"వాట్ ఎ బ్యూటిఫుల్ పెయిర్ ... ఇఫ్ యూ డోంట్ మైండ్ .... ఒక్క స్నాప్ ...." అన్నాడతను.

"నా కిష్టం లేదు" అన్నాను.

అప్పుడు మంజుల ముందుకు వచ్చింది. నెమ్మదిగా నా చెవిలో—"మన పెళ్ళికి ఎలాగూ ఫోటోలు లేవు. ఈరోజు అనుకోకుండా లభించిన అవకాశం వదులుకోవద్దు. ఇలాంటి ఫోటో మళ్ళీ దొరకదు. ప్లీజ్!" అన్నదామె.

నేను కాదనలేక పోయాను. మదిలో గోవిందరావు మెదిలాడు. అన్నింటికీ ఆయనే వున్నాడు. కాదనడ మెందుకు?

మేమిద్దరం చేయీ చేయీ కలిపి నిలబడి ఫోటో తీయించుకున్నాం. ఆ యువకుడు వెళ్ళిపోతూ — "నాపేరు సీతాపతి—గుర్తుంచుకోండి" అన్నాడు.

గుర్తుంచుకోవాల్సిన అవసరం నాకు లేదు. మంజుల నాతో అన్నది—"అతణ్ణి నేనే ఏర్పాటు చేశాను—"

"ఎందుకు?"

"ఎందుకేమిటండీ పెళ్ళినాటికి మనిద్దరికీ కనీసం ఒక్క ఫోటో అయినా లేకుంటే ఎలా?" అంది మంజుల.

"అతడు నీకు తెలుసా?" అనడిగాను.

"తెలియదు. కానీ అతడు ఊళ్ళో చాలా ప్రాంతాల కెమేరాతో తిరుగుతూ కనిపిస్తాడు. నే నీ రోజు విషయం చెప్పి ఫోటో తీయమని నా అడ్రసిచ్చాను. అది అతడి వృత్తి. నా అడ్రసుకు ఫోటో వస్తుంది" అన్నది మంజుల.

"చచ్చాను...." అనుకున్నాను. కానీ ఆ ఆలోచనలతో మనసును భయపెట్టదల్చుకోలేదు. ఎదురుగా అమృతభాండం లాగున మంజుల.

మంజుల నాదయింది. అది అపూర్వానుభవం నాకు.

అయితే నేనామెను మోసం చేస్తున్నానని నాకు తెలుసు. ఆమె చూసిన తలిదండ్రులు నా తలిదండ్రులు కారు. ఆమెకు జరిగిన పెళ్ళి నిజం పెళ్ళికాదు. ఆమెను నేను ఈ రోజే వదిలిపెట్టబోతున్నాను.

ఆమె నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి మనసారా తన్ను తాను నాకు అర్పించుకున్నది. ఆమె పరిస్థితులను అవకాశంగా తీసుకుని నేనామెను మోసం చేశాను. ఇంత కంటే ఆమెను రేప్ చేసివుండినా బాగుండేది!

"టైము తొమ్మిదయింది—నేనింక వెడతాను" అంది మంజుల.

"అలాగే కానీ నిన్నింకా వదలాలని లేదు" అన్నాను.

"ఎందుకంత ఆత్రుత-నేను ఎప్పటికీ మీదాన్నేగా?"

ఆమె ఈ గది వెదిలి వెళ్ళిన క్షణంనుంచీ నాకూ ఆమెకూ ఏమీ సంబంధముండదని నాకు తెలుసు. అందుకే ఆమెను వదలాలనిపించడంలేదు.

మరో అర్ధగంట తర్వాత ఆమెను వదిలాను.

"రేపు ఎక్కడ కలుద్దాం?" అంది మంజుల.

పిచ్చి మంజుల.... రేపు గురించి ఆలోచిస్తున్నది....

"బీచీవద్ద కలుద్దాం...." అన్నాను.

"మనమిద్దరం కలిసి మా యింటికి వెళ్ళి మా అమ్మా నాన్నల ఆశీర్వాదం పొందాలని నేనాత్రపడుతున్నాను. అదెప్పుడో చెప్పు!" అంది మంజుల.

"అత్యవసర పరిస్థితి వస్తేతప్ప అసలు విషయం బైట

పెట్టవద్దు ఇప్పుడు మీ వాళ్ళ ముందుకు వెడితే నీ డబ్బు కోసం ఆశపడ్డానని గేలిచేస్తారు. నా కుద్యోగం వచ్చేవరకూ మన వివాహం నాకు అవమానంగా వుంటుంది" అన్నాను.

"పోనీ మా ఆఫీసులో చెప్పుకోవచ్చా?"

"అది నీ యిష్టం" అన్నాను.

మంజుల వెళ్ళిపోయింది.

ఇలా వెళ్ళగానే అలా వచ్చాడు ఫోటోగ్రాఫర్.

"సార్! ఈ హోటల్ నంబర్ పదమూడు గురించి నాకు బాగా తెలుసు. ఇందులో జంటగా చూసిన వాళ్ళెవ్వరూ నాకు బయట జంటగా కనబడలేదు" అన్నాడు.

"ఏమిటంటావ్!" అన్నాను.

"ఆ అమ్మాయి ఫోటో తన అడ్రసుకి పంపమంది సార్-అంటే ఇది నిజం పెళ్ళి అయివుండాలి....మిమ్మల్ని అభినందిస్తున్నాను సార్" అన్నాడు సీతాపతి.

"నన్నభినందించక్కర్లేదు. మాదీ నిజం పెళ్ళి కాదు. ఆ అమ్మాయలాగనుకున్నది" అన్నాను.

"అయితే నా ఫోటో...."

"ఆ డబ్బులు నే నిస్తాను. రేపుదయం ఇదే రూంకి వచ్చి ఫోటో నాకిచ్చేసేయ్" అన్నాను.

"అడ్వాన్సామె ముందే యిచ్చేసింది సార్...." అన్నాడతను.

"అలాగా. తర్వాతెప్పుడైనా ఆమె కనిపిస్తే ఆ ఫోటో రాలేదని చెప్పు. రేపు మాత్రం నాకు తెచ్చి ఆ ఫోటో యిచ్చేసేయ్" అన్నాను.

"ఇస్తాను సార్....కానీ అది మామూలు ఫోటో కాదు సార్....అందులోనూ నేను డబ్బు అవసరంలో వున్నాను.

ఆ ఫోటోకి కనీసం...." అని ఆగిపోయాడతను.

"ఊఁ కనీసం...." అన్నాను చిరాగ్గా.

"అయిదు వేలు" నీళ్ళు నమిలాడతను.

"అయిదు వేలా-టూమచ్...."

"ఏమోసార్....నేను బేరం చెప్పను. మీ కిష్టం లేక పోతే ఇవ్వనులెండి!"

నేను ఆలోచించసాగాను. పొరపాటు నా వల్ల జరిగింది. ఫోటో గురించి ఒప్పుకోకుండా ఉండాల్సింది. విషయం గోవిందరావుకు తెలిస్తే ఆ అయిదువేలూ వీడి ముఖాన్నయినా కొడతాడు-లేదా వీడి పని సఫా చేస్తాడు. కానీ ... నా వ్యవహారంలో నేను తెలివితేటలు చూపలేదన్న విషయం ఆయనకు బాగా గుర్తుండిపోతుంది. అది నా కిష్టంలేదు

ఈ సీతాపతి వ్యవహారం గోవిందరావుకు తెలియకుండా జరిగింది. అలా తెలియకుండానే వుండడం మంచిది. కానీ నా వద్ద అంత డబ్బెక్కడిది. గోవిందరా విచ్చిన పాతిక వేలలో ప్రతి పైసకూ నేను ఆకౌంట్ యివ్వవలసి వున్నది.

"నీకు డబ్బు యివ్వడానికి నేను రెడీ-కానీ నా వద్ద రెడీగా లేదు."

"దానికేముంది సార్....కొన్నాళ్ళు ఆగమంటే ఆగుతాను. ఇది తాకట్టు వ్యవహారం గదా. ఫరవాలేదు. మీరు ఈ రోజు నుంచీ నాకు ఐదువేలు బాకీపడ్డాననుకోండి. బ్యాంకు రేటున వడ్డీకట్టి యెప్పుడు కావాలంటే అప్పుడు బాకీ తీర్చండి. కానీ నేను ఆర్నెల్లకు మించి ఆగలేను...." అన్నాడు సీతాపతి.

"సరే" అన్నాను.

"సార్ .... ఒక్కమాట అడగనా ...." అన్నాడు

సీతాపతి.

"ఊఁ"

"ఆ ఫోటో కోసం ఐదు వేలివ్వడానికి సిద్ధపడ్డారంటే నిజంగానే మీరా అమ్మాయిని మోసం చేస్తున్నారనుకో వాలి. పాపం-ఆ అమ్మాయిని చూస్తే జాలివేస్తోంది. ఆమె నిజంగా మిమ్మల్ని నమ్మింది సార్" అన్నాడు సీతాపతి.

నేనతడి వంక తీవ్రంగా చూసి "నీకు కాని విషయాల్లో నువ్వు జోక్యం చేసుకొనడం మంచిది కాదు. అయితే ఓ విషయం గుర్తుంచుకో. నాకూ ఆమెపైన జాలి వున్నది. ఈ విషయంలో నేను అసహాయుణ్ణి. నా భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని మరొకరి కోరికపైన నేనిందుకు తలపడ్డాను. జీవితంలో నేను చేసిన మొదటి తప్పు యిది. బహుశా యిదే ఆఖరి తప్పు కూడా కావచ్చు" అన్నాను.

"మరైతే ఆ నం మళ్ళీ యెలా కలుసుకుంటాం సార్" అన్నాడతను.

"నీ అడ్రసు నా కివ్వు" అన్నాను.

4

నా కుద్యోగం దొరికింది. ఒక నెలరోజులపాటు మంజుల గురించిన ఆలోచనలు నన్ను బాధించాయి.

ఆ కంపెనీ మంజుల అందాన్నుపయోగించదల్చుకుంది. కంపెనీలోని అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చినపుడు ప్రభుత్వం కొందరు అధికారుల్ని నియమిస్తే-వారిని ప్రసన్నుల్ని చేసుకొనడానికి మంజుల సౌందర్యం అద్భుతంగా పని చేస్తుంది. అయితే మంజుల అందుకు అంగీకరించలేదు.

గోవిందరావామెకు నయానా భయానా చెప్పి చూశాడు.

ఆమె లొంగలేదు. ఒక్కసారి ఎలాగో ఆమె శీలం పాడు చేయాలనుకున్నాడు. నన్ను ప్రయోగించాడు. మంజుల మోసపోయింది.

మరునాడు మంజుల ఉత్సాహంగా ఆఫీసుకు వెళ్ళి తన వివాహం గురించి గోవిందరావుకు చెప్పబోయిందట. గోవిందరావు నవ్వి—"అది వివాహం కాదు. నేను వేసిన పథకం. అతడు మళ్ళీ నీకు కనిపించడు" అన్నాడట.

ఆ తర్వాత నేను మంజుల కళ్ళపడలేదు.

మానసికంగా దెబ్బతిన్న మంజుల గోవిందరావు అభీష్టానికి లొంగిపోయింది. కంపెనీకి కొన్ని సమస్యలు తొలగిపోయాయి.

గోవిందరావు నన్ను రాజమండ్రిలో పోస్టు చేశాడు. ఇక్కడికి వచ్చినప్పుడల్లా నన్నోసారి అభినందిస్తూంటాడు.

ఇక్కడ కంపెనీలో కూడా నాకు మంచిపేరు వచ్చింది. సమర్థుడినని చెప్పుకుంటున్నారు. అయితే కాగితాలు చూడడమూ, ఇతర కంపెనీలలో వ్యవహారాలు నడపడమూ తప్ప నేను చేసే ఉద్యోగంలో నేరం లేదు.

ఉద్యోగంలో చేరిన కొత్తలో నేను చాలా జాగ్రత్తగా వుండి ఆరునెలల్లో ఐదువేలూ పోగుచేయగలిగాను. వడ్డీతో సహా సీతాపతి బాకీ తీర్చి ఫొటోని నెగెటివ్‌తోసహా తీసుకున్నాను. ఆ ఫోటోలో మేమిద్దరమూ ఎంత బాగున్నామో చెప్పలేను. ఎందుకో నాకు ఆ నెగెటివ్‌నిగానీ, ఫొటోనిగానీ నాశనం చేయడానికి మనసొప్పలేదు. భద్రంగా, రహస్యంగా దాచాను.

నేను ఉద్యోగంలో చేరి మూడు సంవత్సరాలు గడిచాయి.

ఒకరోజు మళ్ళీ నాకు గోవిందరావు నుంచి పిలుపు వచ్చింది. వెళ్ళి ఆయన యెదుట కూర్చోగానే "నువ్వు సమర్థవంతంగానే నీ ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నావు. అయితే ఒక్క ప్రశ్న వేయదల్చుకున్నాను. నీ ఉద్యోగం నిలబెట్టుకునేందుకు నువ్వేమైనా చేయగలవా?" అన్నాడు.

"ఊఁ" అన్నాను.

"ఏమైనా చేయగలవా?" ఆయన ఏమైనా అన్న పదాన్ని రెట్టించాడు

"ఏమైనా చేయగలను" అన్నాను. కానీ మనసులో భయం ప్రారంభమైంది.

"ఏమైనా అంటే అది హత్య కూడా కావచ్చు...."

నేను ఇంటర్వ్యూకు వెళ్ళినపుడు యిలాగే జరిగింది సంభాషణ. అది మంజులను మోసం చేయడానికి దారి తీసింది. ఇప్పుడు ...

"చెప్పండి" అన్నాను బింకంగా.

"చెప్పడానికేమీ లేదు. అన్నీ ఏర్పాట్లూ చేస్తాము. నీకే విధమైన ప్రమాదమూ వుండదు. మంజులను నువ్వు హత్య చేయాలి" అన్నాడాయన.

"మంజులనా?"" తెల్లబోయాను.

"అవును. ఆమె యిప్పుడు కంపెనీకి ప్రమాదకరంగా పరిణమించింది. తనకు తెలిసిన కొన్ని రహస్యాలను ఆమె ఒక ప్రభుత్వోద్యోగికి చెప్పింది. అతడామెను అప్రూవర్‌గా వాడుకోబోతున్నాడు" అన్నాడు గోవిందరావు.

"అయితే — ఆమెను నేనే ఎందుకు చంపాలి?" అన్నాను.

"అది నీ వల్లనే సాధ్యపడుతుంది. మనసు మారిన

వ్యక్తిగా నీ వామె ముందు నిలబడు. ఆమె నీతో ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేస్తుంది.

అది నిజం కావచ్చు....మంజులను మరోసారి ...

"ఇది కంపెనీ సమస్యే కాదు. నీ ఉద్యోగాని క్కూడా సంబంధించిన సమస్య. బాగా ఆలోచించుకో "

"మీకు మంజుల ప్రమాదం తొలగించడానికి నేనే దొరికానా? ఆమె ఇప్పుడు నన్నెంతగా ద్వేషిస్తూంటుందో నేనే ఊహించలేకుండా వున్నాను" అన్నాను.

"ఆడదాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు నువ్వు" అని గోవిందరావు నవ్వాడు.

నేను ఎంతోసేపు ఆలోచేంచలేదు-"సరే!" అన్నాను.

5

"నమస్కారం సార్!" అన్నాడు సీతాపతి.

"అరే నువ్వా" అన్నాను తడబడుతూ "మళ్ళీ ఎందు కొచ్చావ్!"

"క్షమించండి సార్—నాకు చాలా డబ్బు అవసరంగా వున్నది...."

"అయితే నేనేం చేయను. ఓసారి ఐదువేలూ వడ్డీతో సహా ఇచ్చుకున్నానుగా" అన్నాను.

"అవును సారు....మిమ్మల్ని నేను తప్పుపట్టడంలేదు. అవసరం నాది. మీరే ఏదైనా ఉపాయం చెప్పండి."

"ఆ ఐయిదువేలూ తీసుకుని వదిలిపెడతావనుకున్నాను. ఇది చాలా అన్యాయం. అంటే ఆ ఫోటో కాపీలు మరి కొన్ని తీసి నీ వద్ద వుంచుకున్నావన్న మాట!"

"నేనలాంటివాణ్ణి కాదు సార్! ఆ బేరం అంతటితో పైసలయిపోయింది. అయితే మీ లాంటి వాళ్ళు ఇలా ఊరు

కుంటే ఎలా సార్....ఒక్కసారితో వదిలిపెడితే సరి పోతుందా సార్ ...మళ్ళీ ఇంకో తప్పు చెయ్యండి సార్. నా లాంటి వాళ్ళు బ్రతుకుతారు ..."

సీతాపతి వెళ్ళిపోయాడు.

"మళ్ళీ యింకో తప్పు చెయ్యండి సార్" అంటున్నా డతడు. బహుశా అది అభ్యర్ధన కాకపోవచ్చు. వేళాకోళం కావచ్చు. మళ్ళీ నేను తప్పు చేయనందుకు అభినందన కావచ్చు. కానీ నాకు మాత్రం అందులో హెచ్చరిక కన బడింది. ఎందుకంటే ఈ రోజే నేను విశాఖపట్నం బయ ల్దేరుతున్నాను. నా జేబులో గోవిందరావు యిచ్చిన కత్తి వున్నది.

నేనేం చేయాలి?

నన్ను నమ్మిన ఆడదాన్ని మోసంచేసి శీలం దోచు కున్నాను. మరోసారి ఆమెను నమ్మించి ప్రాణాలే తీసుకో దల్చుకున్నాను.

"మళ్ళీ యింకో తప్పు చేయండి సార్" ఓ బ్లాక్ మెయిలర్ కోరిక.

ట్రెయిన్లో కూడా ఇవే ఆలోచనలు.

ఆ తర్వాత బీచివద్ద కూడా ఇవే ఆలోచనలు....

బీచివద్ద నాకు మంజుల కనబడింది. ఆమె ఆ అలవాటు మార్చుకోలేదన్న మాట. ఆమె అందం చెక్కు చెదరలేదు. వయసామెలో ఎటువంటి మార్పూ తీసుకుని రాలేదు.

ఆమె నన్ను చూసింది. చలించలేదు ఓ అపరిచితుణ్ణి చూసినట్లు చూసింది. నేను మాత్రం ఆమె ఎదుట వెళ్ళి కూర్చున్నాను.

"నన్ను గుర్తుపట్టావా?" అన్నాను.

"అశోకా హోటల్లో రూం నెంబరు పదమూడు బుక్ చేసి వచ్చారా?" అంది మంజుల శాంతంగా.

నేను మాట్లాడలేదు....

"మీ జేబులో నా ప్రాణాలు తీయడానికి కత్తి ఉన్నదా?" అంది మంజుల.

ఆమెకెలా తెలుసు నేను ఆశ్చర్యపడ్డాను.

"నాకెలా తెలుసునని ఆశ్చర్యపడకండి. నీ ప్రియుడి చేతనే నిన్ను చంపించగలనని గోవిందరావు బెదిరించాడు. ఆయన, మీరు అంతటివారని నాకు తెలుసు. అయితే ఏ ముహూర్తాన మనమిద్దరమూ ఒకటయ్యామో కానీ—నాకు అప్పట్నించీ మీ చేతుల్లో చావాలన్న కోరిక పెరుగుతోంది. ఈ దేశంలో భర్త భార్యకు తీర్చగల ఏకైక కోరిక ఇదే నని నాకు తెలుసు" అంది మంజుల.

ఆమె తన యింటికి నన్ను తీసుకుని వెళ్ళింది. ఇంట్లో యింకెవ్వరూ లేరు.

"ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకోమంటారా?" అన్న దామె.

"ఏమిటిదంతా?" అన్నాను.

"మిమ్మల్నొక్కసారి చూసి చనిపోదామని, ఆ కంపెనీ వాళ్ళని బెదిరించాను. నా కోరిక తీరింది. నా కింకే కోరిక లేదు. జేబులోని కత్తితీసి నా చేతికివ్వండి. మీకే యిబ్బందీ లేకుండా నన్ను నేను చంపుకుంటాను" మంజుల దుఃఖాన్ని బిగబడుతోంది.

నేను జేబులో చేయి పెట్టాను.

ఆమె నా వంకనే చూస్తున్నది.

"ఒకనాడు సరదాగా అన్నమాట ఈ రోజు నిజంగా

అంటున్నాను. నాకు నీ గత చరిత్రతో నిమిత్తంలేదు. నీ అందం, నీ మనసు ....నువ్వు....అన్నీ నావి....” అంటూ ఆమె చేతికి నా జేబులోంచి తీసిన ఫోటో అందించాను.

ఆ ఫోటోవంక ఆమె తెల్లబోయి చూస్తున్నది.

గోవిందరావు కింక మంజుల అవసరంలేదు. ఆమె నుంచి ప్రమాదం తప్పితే చాలు. కానీ నాకు మంజుల అవసరం వున్నది. అలాంటి ప్రేమమూర్తి నాకు దొరకదు. ఆమెను నా జీవితంలోకి ఆహ్వానించడం ద్వారా-నేను మరో తప్పు చేయాల్సిన అవసరం తప్పిపోతుంది.

మంజుల ఫోటో వంకనే చూస్తున్నది.

నేను మాత్రం మనసులో “సారీ సీతాపతీ!” అనుకున్నాను. □

“అద్దె కివ్వబడును!”



కాటేసిన సర్పం

విశ్వమోహిని

''యువరానర్! ఆ ముద్దాయి పేరు నాగరాజు. సార్థక నామధేయుడితను. తన సహోద్యోగి కమలను దారుణంగా కాటువేసాడు. తన కామదాహానికి బలిచేసాడు'' ఏకధాటిగా చెప్పుకుపోయాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

న్యాయమూర్తి శ్రద్ధగా ఆలకిస్తూ ముఖ్యమయిన విషయాలను రికార్డు చేసుకుంటున్నారు.

కోర్టు హాలంతా నిశ్శబ్దంగా వుంది. అంతా శ్రద్ధాసక్తులతో ప్రాసిక్యూషన్ కధనాన్ని ఆలకించసాగారు.

ముద్దాయి నాగరాజుకు ముచ్చెమటలు పోయాయి. బోనులో తల వంచుకుని నిలుచున్నాడతను.

"యువరానర్! కమల ఇతని కొలీగ్. నాగరాజు, కమల ఇద్దరూ అవివాహితులే. ఇరవై ఏళ్ళ కమల అందం చూసి ఆమెను తన వలలో వేసుకోవడానికి ప్రయత్నించాడు ముద్దాయి. ఆమె లొంగకపోవడంతో దారుణంగా రేప్ చేసాడు. ఆ అవమానం భరించలేక కమల ఆత్మహత్య చేసుకుంది....అందుకు ఈ ఉత్తరమే నిదర్శనం" అని, ఓ కాగితాన్ని న్యాయమూర్తికి అందించాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

అది—కమల చనిపోతూ రాసిపెట్టిన ఉత్తరం—సూయిసైడ్ నోట్.

అందులో—నాగరాజు తనను రేప్ చేసినట్టూ, అవమానం భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టూ రాసింది కమల.

ఆ ఉత్తరం చాలు నాగరాజు నేరాన్ని రుజువు చేసేందుకు!

కోర్టులోని జనమంతా నాగరాజు వంక అసహ్యంగా, ఆగ్రహంతో చూసారు.

"దట్సాల్ యువరానర్! ముద్దాయి నేరాన్ని నిరూపించడానికి ఇంతకంటె బలమైన సాక్ష్యం ఇంకేం కావాలి? ఇటువంటి నీచుడి మూలంగా మరే యువతీ అన్యాయం కాకుండా ఇతనికి పడే శిక్షను చూసి ఇతరులెవరూ ఇటువంటి దారుణానికి వొడిగట్టకుండేలా ముద్దాయికి తగిన శిక్ష విధించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను" అని చెప్పి

ఓసారి సగర్వంగా కోర్టంతా కలయజూసి తన సీట్లో కూర్చున్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

ప్రాసిక్యూషన్ వాదన ముగియడంతో డిఫెన్స్ లాయర్ విశాల లేచి నిలుచుంది.

ఆమె ముద్దాయి తరపున వాదించబోతున్నట్టు తెలియడంతో కోర్టులో కలకలం రేగింది.

అందుకు రెండు కారణాలున్నాయి.

మొదటిది—లాయర్ విశాలకు క్రిమినల్ లాయర్‌గా మంచి పేరుంది. అటువంటిది, ముద్దాయికి వ్యతిరేకంగా బలమయిన సాక్ష్యం వున్న ఆ కేసులో ఆమె ధైర్యంగా ముద్దాయి కేసు చేపట్టడం!

రెండవది—తాను స్త్రీ అయివుండీ మరో స్త్రీకి జరిగిన అన్యాయాన్ని రక్షించడానికి ఆమె పూనుకోవడం!

డిఫెన్స్ తరపున తన వాదనను ఆరంభించింది విశాల—

"యువరానర్! ముద్దాయిపట్ల ప్రాసిక్యూషన్ చేపిన ఆరోపణలన్నీ అసత్యాలని సవినయంగా మనవి చేసుకుంటున్నాను... నాగరాజు బ్రహ్మచారి. కమల ఇతన్ని ఆకర్షించుకోవాలనీ, ఇతనికి చేరువ కావాలనీ ప్రయత్నించేది. తనను పెళ్ళి చేసుకొమ్మని అతన్ని వేధించేది.

కారణం—కమల ఓ పేద కుటుంబంలోంచి వచ్చింది. బోలెడు కట్నాలు పోసి ఆమెకు వివాహం చేసే శక్తి ఆమె తల్లిదండ్రులకు లేదు. అందుకే ఆమె దృష్టి నాగరాజు పైన పడింది. తన అందంతో అతన్ని ఆకర్షించుకుని వివాహానికి దారి తీయాలనుకుంది.

కాని, నాగరాజు అందుకు విముఖత చూపడంతో నిరాశ చెందిందామె. నిస్పృహతో ఒక బలహీన క్షణంలో తన

ప్రాణాలను బలవంతంగా తీసుకుంది. తనను నిరాకరించా దన్న పగతో ఇతనిపైన తీవ్రమైన నిందమోపి మరీ చని పోయింది—"

అంతవరకు నిశ్శబ్దంగా వున్న ఆ కోర్టు హాల్లో కలకలం రేగింది!

"నో. నో!" అంటూ అరిచారు కొందరు.

న్యాయమూర్తి, "ఆర్డర్! ఆర్డర్!" అంటూ టేబిల్ మీద బాదారు.

"యువరానర్!" ప్రేక్షకుల రియాక్షన్‌ని పట్టించుకో కుండా చెప్పుకుపోయింది విశాల.

"ప్రాసిక్యూషన్ సాక్షులు ముద్దాయి నేరాన్ని సరిగా నిరూపించలేకపోయారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో కమల రేప్ విషయంలో కొన్ని అనుమానాలు మిగిలిపోయాయి. ఉత్తరంలోని దస్తూరీ ఆమెదేనని ఖచ్చితంగా చెప్పలేక పోయారు....ముఖ్యంగా ప్రాసిక్యూషన్ కమల రాసిన ఉత్తరం మీదే ఆధారపడిందే తప్ప, ముద్దాయిని మెడికల్ ఎగ్జామినేషన్‌కి గురి చేయాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించింది...."

ఆమె వాదనకు ఆశ్చర్యపోయారంతా. వైద్యపరీక్ష వల్ల ముద్దాయికి నష్టమేకాని లాభముండదని తెలిసివుండీ ఆమె ఆ విషయం యెందుకు ఎత్తుతున్నదో బోధపడక ప్రాసిక్యూషన్‌తోపాటు న్యాయమూర్తి కూడా ఆశ్చర్య పోయారు. కాని, విశాల తెలివితేటలు, సామర్థ్యమూ ఎరి గున్నవారు కావడంతో ఆమె ఏదో మెలిక పెట్టబోతున్నట్టు గ్రహించారు న్యాయమూర్తి.

"యువరానర్! ప్రాసిక్యూషన్ కేసంతా అబద్ధమనీ, ముద్దాయి నిర్దోషి అనీ నిరూపించడానికి ఈ ఒక్క ఆధా

రమే చాలు....” అంటూ తన ట్రంప్ కార్డ్‌ని బయట పెట్టింది.

“యువరానర్! ముద్దాయి ఇన్నేళ్ళొచ్చినా పెళ్ళి చేసుకోకపోవడానికీ, కమల కోరికను నిరాకరించడానికీ హేతువేమిటో దీన్ని చూస్తే తెలుస్తుంది. ముద్దాయి జీవిత డిక్షనరీలో రేప్ అన్న పదానికి తావే లేదన్న సంగతి యిది నిరూపిస్తుంది. ఇదిగో, ముద్దాయికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్....” అంటూ ఓ కాగితం తీసి న్యాయమూర్తికి అందించింది.

“ముద్దాయి నాగరాజు నపుంసకుడనీ, దాంపత్య సుఖానికి అనర్హుడనీ మెడికల్ స్పెషలిస్ట్ యిచ్చిన రిపోర్ట్ యిది!” అని న్యాయమూర్తి ప్రకటించడంతో కోర్టు వులిక్కిపడింది.

ముద్దాయి తలి వంచుకున్నాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెల్లబోయాడు అంతలోనే తేరుకుని, “యువరానర్! యిందులో ఏదో మోసముంది” అంటూ న్యాయమూర్తి వద్ద నుండి సర్టిఫికేట్ తీసుకుని పరిశీలించాడు ఏడాది క్రితం ఇష్యూ చేయబడిన సర్టిఫికేట్ అది! మతిపోయింది అతనికి.

కోర్టులో కలకలం ఎక్కువయింది. 'ఆర్డర్! ఆర్డర్!' అంటూ అరిచాడు న్యాయమూర్తి, బల్లమీద వాయిస్తూ.

సద్దుమణగడంతో, విశాల ఓసారి సగర్వంగా అందరినీ కలయజూచింది.

“యువరానర్! ఇక్కడ కోర్టువారు రెండు విషయాలు గమనించాలి. మొదటిది—స్పెషలిస్ట్ సర్టిఫికేట్ యిప్పటిది కాదు, ఏడాది క్రితం ముద్దాయికి యివ్వబడినది. రెండవది - అసలైన ఏ మగాడూ శిక్ష అనుభవించడానికైనా సిద్ధపడ

తాడే కాని, తాను నపుంసకుడనని లేని విషయాన్ని నిండు కోర్టులో చెప్పుకోడు. అంతటి అవమానం మరొక టుండదు....''

లాయర్ విశాల వాదన ఫలించింది. కేసు కొట్టివేయ బడింది. నాగరాజు విడుదలయ్యాడు.

2

సాయంకాలం కోర్టునుండి యింటికి చేరుకున్న విశాల హుషారుగా వుంది.

అసాధ్యాన్ని సాధ్యం చేసింది తను.

నాగరాజు దోషి అని తెలిసివుండీ అతని కేసును చేపట్టినందుకు విశాల స్నేహితురాళ్ళు ఆమెను తీవ్రంగా విమర్శించారు. స్త్రీ జాతికే తలవంపు అంటూ నిరసించారు. ఆమె ఓడిపోయి తీరుతుందని సవాల్ చేసారు.

మొదట అయిష్టంగా చేపట్టిన ఆ కేసుపైన ఆ తరువాత పట్టుదల పెంచుకుంది విశాల. అంతవరకు తాను పరాజయం ఎరగదు. ఆ కేసులో కూడా విజయం సాధించి తీరాలనుకుంది.

ఇరవై ఎనిమిదేళ్ళ విశాల అందగత్తె తల్లి పెళ్ళి చేసుకోమంటే వినిపించుకోకుండా 'లా' చదివి ఒంటరిగా పట్నంలో ప్రాక్టీసు పెట్టింది

విశాల చిన్ననాటి స్నేహితురాలు సుమిత్ర అన్న నాగరాజు. అతడు నేరస్తుడని తెలిసివుండీ, స్నేహితురాలి కోసం తప్పనిసరిగా ఆ కేసును చేపట్టవలసి వచ్చింది ఆమె. కేసు బలంగా వుండడంతో, ఏడాది క్రితపు తేదీలో దొంగ సర్టిఫికేట్ సంపాదించి నాగరాజును గట్టెక్కించింది.

'మరణించిన ఓ అమాయకురాలికి అన్యాయం చేస్తు

న్నావు, విశాలా! కమల ఆత్మ నిన్ను శపిస్తుంది!' అన్న తన స్నేహితురాళ్ళ మాటను 'సిల్లీ సెంటిమెంట్స్' అంటూ కొట్టిపడేసింది విశాల. 'చచ్చిన పిల్ల ఎలాగూ తిరిగిరాదు. నాగరాజు జైలుకు వెళితే నా స్నేహితురాలి కుటుంబం అనాధ అయి వీధిన పడుతుంది' అని జవాబిచ్చింది.

స్నానంచేసి కాసేపు బయట చల్లగాలిలో తిరిగిరావాలనుకుంది. పనిపిల్ల యింకా రాలేదు. ఒంటరితనం ఒక్కోసారి విసుగనిపించినా, ఆడపిల్లకు పెళ్ళే ముఖ్యం కాదనీ, అది లేకుండా దర్జాగా బ్రతకగలదనీ నిరూపించాలన్న ఆశయం ఆమెది. పల్లెలో పొలాలను విడిచి పట్నం రాదు తల్లి. నెలకోసారి విశాలే వెళ్ళి తల్లిని చూసి వస్తూంటుంది.

ఓ అరగంటసేపు షవర్ క్రింద నాని బయటకొచ్చింది విశాల.

టవల్‌తో వొళ్ళు తుడుచుకుంటూ, నిలువుటద్దంలో చూసుకుంది....కడిగిన ముత్యంలా వున్నదామె. సడలని సౌందర్యం సమ్మోహనంగా వుంది....అందంగా, పిగ్గుగా నవ్వుకుంది.

లంగా కట్టుకుని, బ్రాసరీ తొడుక్కుంది. జాకెట్ తొడుక్కోబోయేసరికి డోర్ బెల్ మ్రోగింది.

'పనిపిల్ల వచ్చుంటుంది' అనుకుంటూ జాకెట్ స్టాండ్ మీద పడేసి, చీరె వొంటికి చుట్టబెట్టుకుని వెళ్ళి తలుపు తెరిచింది.

గుమ్మంలో నిలుచున్న నాగరాజును చూసి వులిక్కిపడిందామె. చీరె మరింత సర్దుకుంది అప్రయత్నంగా.

ఆ సమయంలో అతన్ని ఎదురు చూడలేదామె.

చిరునవ్వుతో ఆమె వంక చూశాడతను.

"కూర్చో" అని ముక్తసరిగా అనేసి, గబగబా బెడ్

రూమ్‌లోకి వెళ్ళిపోయింది విశాల.

చీరె విప్పి సరిగా కట్టుకో నారంభించింది—నాగరాజు బహుశా థాంక్స్ చెప్పుకుని, మిగతా ఫీజు చెల్లించడానికి వచ్చుంటాడని ఆలోచిస్తూ....చీరె కుచ్చిళ్ళు దోపుకుంటూ వుంటే అప్రయత్నంగా ఆమె చూపులు అద్దంమీద పడ్డాయి.

అందులో కనుపించిన రూపాన్ని చూపి పక్కలో పామును చూసినదానిలా త్రుళ్ళిపడి కంగారుగా వెనక్కి తిరిగిందామె.

వెకిలిగా నవ్వుతూ గుమ్మంలో నిలుచున్నాడు నాగరాజు!

చటుక్కున చెంగు వొళ్ళంతా కప్పుకుంది విశాల.

"ఇక్కడి కెందుకొచ్చావ్?" అంది తీక్షణంగా.

"నీ అందాలు చూడాలని!" అన్నాడతను తొణక్కుండా.

అదిరి పడిందామె. "షటప్!" అంది అదురుతూన్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ పెదవులు వొణుకుతూంటే. "గెటౌటాఫ్ హియర్!" అని అరిచింది.

నిలుచున్న చోటునుండి కదిలాడతను—ఆక్కడినుండి వెళ్ళడానిక్కాదు, ఆమెను సమీపించేందుకు.

"ఆగు!" పిచ్చిదానిలా అరిచింది విశాల. "ముందిక్కడినుండి వెళతావా, లేదా?"

"విశాలా! నీ యవ్వనాన్ని ఎందుకలా వృధా చేసుకుంటావ్? లెటజ్ ఎంజాయ్" అంటూ ఒక్కో అడుగే తన వైపు వేస్తూన్న నాగరాజు వంక అసహ్యంగా చూపిందామె.

"నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలనే వచ్చాను. కాని, నీ సౌందర్యం చూసాక పిచ్చివాణ్నయి, నా కృతజ్ఞతలను

ఎలా తెలుపుకోవాలో తెలుసుకున్నాను."

—అంటూ చటుక్కున విశాలను కావలించుకున్నాడు నాగరాజు. పెనుగులాడిందామె. అతన్ని తిట్టింది, కొట్టింది, శాపనార్థాలు పెట్టింది. మరింతగా ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడతను.

భయాందోళనలతో విశాల డెందం ఝల్లడిల్లిపోయింది. శరీరం అదరసాగింది. పెదవులు వొణికాయి. దుఃఖం ముంచుకొస్తోంది.

పెనుగులాటలో చీరె నేలకు జారిపోయింది. లంగా, బాడీలతో మిగిలిందామె.

ఆమె అర్థ నగ్న సౌందర్యం అతన్ని మరింత పిచ్చి వాణ్ణి చేసింది.

"నీచుడా! దీని పర్యవసానం ఏమిటో ఆలోచించావా? ఈసారి నువ్వు తప్పించుకోవడం కల్ల!" అంది వొణికే కంఠంతో.

నాగరాజు ఫకాలున నవ్వాడు. "నేను నపుంసకుడినని కోర్టులో నువ్వే నిరూపించావు. ఇప్పుడు నువ్వు కాదన్నా ఎవరూ వినరు. నిన్ను రేప్ చేసానంటే ఎవరూ నమ్మరు" అన్నాడు ఆమెను ఎత్తి బెడ్ మీద పడవేస్తూ.

ఆ కఠిన సత్యం వినడంతో హతాశురాలయిందామె.

పాముకు పోసిన పాలలా, ఆ నీచుడికి చేసిన వుపకారం తనపట్ల విషంగా మారుతున్నందుకు విలవిలలాడి పోయిందామె.

కమల ఆత్మ తనను శపిస్తున్నట్టు అనిపించింది.

తన వ్రేలితో తన కన్నే పొడుచుకున్నదన్న నగ్న సత్యాన్ని గ్రహించేసరికే, ఆ కృతఘ్నుడి విషపు కాటుకు బలయిపోయింది లాయర్ విశాల. □

ప్రతాప రవిశంకర్

రాక్షసి కోరిక



రాత్రి—

చంద్రుడు వెన్నెల వెలుగును విరజిమ్ముతున్నాడు.

చుట్టూ అంతగా ఎత్తులేని గోడలు వున్న డాబామీద కూర్చుని వున్నారు. జయంతి—రాజారావు.

అతను ఆమె భుజంమీద చేతిని వేసి చిన్నగా

నొక్కుతూ "మైగాడ్.... ఎన్ని ట్యూబ్ లైట్లు వెలిగితే ఇంత వెలుతురు వస్తుంది" అన్నాడు అంతటా పరుచుకున్న వెన్నెల వెలుగును చూస్తూ

"మీరు కథలు రాయకూడదూ?" అన్నది జయంతి నవ్వి.

"ఎందుకు?" అన్నాడు రాజారావు.

"మీలో స్పందన బాగా వున్నది."

"నీలో లేదూ?"

జయంతి మాట్లాడలేదు. ఆమెకు హఠాత్తుగా రెండేళ్ళ క్రితం తను కాలేజిలో చదువుతున్నప్పుడు పత్రికలకు కథలు రాసే రాజశేఖర్ గుర్తుకు వచ్చాడు. అతన్ని చూసి అతని కథలు చదివి తనుకూడా కథలు రాయాలని ప్రయత్నం చేసింది. కానీ ఒక్క కథ కూడా అచ్చు కాలేదు.

"ఏమిటి డియర్ ఆలోచనలో పడిపోయావ్" అన్నాడు రాజారావు.

ఉలిక్కిపడింది ఆమె.

ఈ మధ్య జయంతి బాగా పరధ్యానంగా వుంటోంది. అయితే ఆమెలో వస్తున్న మార్పును రాజారావు గ్రహించ లేదు.

రాజారావు నిల్చున్నాడు.

సిగరెట్టు ప్యాక్ తీసి సిగరెట్టు ముట్టించాడు.

జయంతి నిల్చుంది.

రోడ్డుమీద జనం తిరుగుతున్నారు.

అతను పొగను బయటకు వదిలి "పొగ కనపడుతోందా జయంతీ" అన్నాడు భార్యను.

"లేదు" అన్నది.

రాజారావు నవ్వాడు. తర్వాత "నాకు కనపడుతోంది" అన్నాడు. అలా అంటూనే రెండు చేతులూ డాబా గోడ మీదికి వుంచి కిందికి చూశాడు.

కింద కుండీల్లో వున్న మొక్కలు గాలికి అటూ ఇటూ కదులుతున్నాయి.

అతన్నలా చూడగానే జయంతిలో అలజడి కలిగింది.

'వొంగి చూస్తున్న భర్త కాళ్ళను పైకెత్తి కిందికి వదిలితే ఎలా వుంటుంది?'

ఈ ఆలోచన రాగానే జయంతి వులిక్కిపడింది. తర్వాత అలాంటి ఆలోచన వచ్చినందుకు ఆమె తనని తిట్టుకున్నది.

ఐతే—గత ఐదు రోజులుగా జయంతి మెదడులో ఈ ఆలోచన తరచు వస్తూనే వున్నది. రాజారావు గురించే కాదు. ఎవరో ఒకర్ని—

'హత్యచేస్తే ఎలా వుంటుంది?'

ఇప్పుడు ఈ ప్రశ్న ఆమెను నీడలా వెంటాడుతోంది.

ఆమెలో ఎవర్నయినా హత్య చెయ్యాలనే కోరిక రోజు రోజుకీ పెరిగిపోతోన్నది.

ఏమిటి చెయ్యటం?

ఈ కోరిక గురించే జయంతి అనుక్షణం ఆలోచిస్తోంది.

తన కోరిక ఎవర్ని బలితీసుకుంటుంది?

ఎవరిని??

రాజారావు వెనక్కి తిరిగి వాచీ కేసి చూసుకున్నాడు.

ఎనిమిది గంటలు దాటుతోన్నది.

"కిందికి వెళదామా?" అన్నాడు.

ఆమె మవునంగా మెట్లవైపు నడిచింది.

రాజారావు ముందు మెట్లు దిగుతున్నాడు.

జయంతి వెనుకనే దిగుతోంది.

మళ్ళీ ఆమెలో తలెత్తిన రాక్షస ఆలోచన....

"అతన్ని ముందుకు నెడితే...."

ఈ ఆలోచన రాగానే జయంతి చేతులు వాటంతట అవే ముందుకు కదిలినట్లు అనిపించాయి. ఆమె బలవంతంగా చేతుల్ని వెనక్కి తీసుకునింది.

'దేవుడూ....నన్నీ రాక్షసి కోరికనించి తప్పించు' అనుకున్నది జయంతి చిన్నగా.

2

ఉదయం—

గోడనున్న గడియారం పది గంటలు కొట్టింది.

రాజారావు అప్పటికి పది నిముషాలు క్రితమే ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఓ సైకలాజికల్ మేగజైన్ చదువుతూ బెడ్ మీద పడుకున్నది జయంతి.

ప్రతి మనిషిలోనూ నేర ప్రవృత్తి దాగి వుంటుందనీ—కొందరిలో ఎక్కువగానూ—మరికొంత మందిలో తక్కువగానూ వుంటుందని ఆ మేగజైన్‌లో రాసి వున్నది. నేర ప్రవృత్తి ఎక్కువగా వున్న వాళ్ళు తగిన కారణం లేకుండానే నేరం చెయ్యటానికి ప్రయత్నిస్తారని కూడా అందులో వుంది.

ఐదు నిముషాల తర్వాత ఆ పుస్తకాన్ని పక్కనే వుంచి ఆలోచనల్లోకి జారుకున్నది జయంతి.

వారం రోజుల క్రితం తను భర్తతో కలిపి చూసిన ఇంగ్లీషు సినిమా ఆమె కళ్ళముందు కదిలింది.

ఆ సినిమాలో కూడా ఇంతే—

ఓ పదేళ్ళ అమ్మాయి చిన్నతనం నించే తన వయసు వున్న పిల్లలను ఏ కారణం లేకుండానే కొట్టి, మేకులు,

సూదులు గుచ్చి హింసిస్తూ వుంటుంది. ఆ అమ్మాయి పెద్దదవుతుంది. ఆమెలో నేర ప్రవృత్తికూడా బాగానే పెరిగిపోతుంది. ఒకసారి వాళ్ళ ఇంట్లో ఓ గదిలో అద్దెకు వుంటున్న యువకుడు మెయిన్ స్విచ్ ఆఫ్‌చేసి గదిలోని ఎలక్ట్రిక్ స్విచ్‌బోర్డు బాగు చేస్తూ వుంటాడు. ఆ సమయంలో అతన్ని చూసిన ఆ అమ్మాయి అతనికి తెలియకుండా మెయిన్ స్విచ్ ఆన్‌చేస్తుంది. షాక్‌కొట్టి ఆ యువకుడు మాడిపోతాడు. ఐతే ఈ విషయం ఎవరికీ తెలీదు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు ఆ అమ్మాయికి పెళ్ళవుతుంది. ఓసారి ఆమె భర్తతో కలిసి ఎలక్ట్రిక్ ట్రెయిన్లో వెళుతూ వుంటుంది. భర్త ఎంట్రెన్స్ దగ్గిర నిల్చుని బయటకు చూస్తూ వుంటాడు. అప్పుడామె వెనగ్గా వెళ్ళి అతన్ని ముందుకు నెడుతుంది. అవతలి పట్టాలమీద నించి వస్తున్న రైలు కిందపడి అతను చచ్చిపోతాడు. భర్త ముక్కలు ముక్కలయి చనిపోవటాన్ని చూసిన ఆమె పిచ్చిదయిపోతుంది.

తలుపుమీద చప్పుడయింది.

ఉలిక్కిపడి ఆలోచనల నించి బయటపడి బెడ్‌మీద నించి లేచింది జయంతి.

తలుపు తెరిచింది.

ఎదురుగా ఇందిర నిల్చున్నది.

"నిద్రపోతున్నావా?" అడిగిందామె.

"లేదు. ఓ మేగజైన్ చదువుతున్నాను" చెప్పింది జయంతి.

"షాపింగ్‌కు వెళుతున్నాను. నువ్వుకూడా వచ్చెయ్యి" అన్నది ఇందిర. ఆమె ఎదురింట్లో వుంటోంది.

"ఇప్పుడే వెళదామా?"

"అవును. నువ్వు పావుగంటలో తయారయితే ఇప్పుడు మనకు లోకల్ ట్రెయిన్ వుంది."

"కూర్చో. ఐదు నిముషాల్లో రెడీ అవుతాను" అని బాత్‌రూమ్‌లోకి నడిచింది జయంతి.

పది నిముషాల తర్వాత ఇద్దరూ రోడ్ మీదకు వచ్చారు.

రైలు స్టేషన్ అక్కడికి బాగా దగ్గరగా వుంది.

రైలు వచ్చింది.

ఇద్దరు ఎక్కారు.

ట్రెయిన్ కదిలింది.

ఇందిర ఏదో మాట్లాడుతోంది. కాని జయంతి ఆ మాటలు వినడం లేదు. డోర్ దగ్గర నిల్చుని సిగరెట్లు తాగుతూ మాట్లాడుకుంటున్న ఇద్దరు యువకుల మీద ఆమె దృష్టి నిల్చిపోయింది.

వంతెన మీదుగా వెళుతోంది రైలు.

'గబగబా వెళ్ళి ఆ ఇద్దరినీ కిందికి తోసేస్తే.'

ఈ ఆలోచన ఆమెను ముందుకు నెడుతోంది.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్?" జయంతి భుజం పట్టుకుని కుదుపుతూ అడిగింది ఇందిర.

"ఏమీ లేదు" అన్నది జయంతి.

"కాదు. ఏదో దాచిపెడుతున్నావ్."

"నిజం. ఏమీ లేదు. ఎప్పుడో చూసిన సినిమా గుర్తు వచ్చింది. అంతే" అన్నది.

ట్రెయిన్ ఆగింది.

రెండు నిముషాల తర్వాత ఇద్దరూ స్టేషన్లో నించి బయటకు వచ్చారు.

రోడ్డుమీద నడుస్తున్నారు.

ముందు ఇందిర నడుస్తోంది. వెనుక జయంతి నడు

స్తోంది.

ఎదురు నించి వేగంగా బస్సు వస్తోంది.

కబుర్లు చెబుతూ గబగబా నడుస్తోంది ఇందిర.

'దయ్యంలా వస్తున్న ఆ బస్సు కిందకు ఇందిరను నెడితే.'

దూసుకుని వచ్చింది ఆలోచన జయంతి మెదడులోకి—

బస్సు దగ్గరకు వచ్చింది.

ఆమె ఇందిర భుజంమీద చేతులు వేసింది. మనసు వెనక్కి లాగుతోంది. చేతులు వణుకుతున్నాయి. బస్సు కిందికి ఆమెను నెట్టబోయింది. ఇంతలో ఇందిర గబుక్కున పక్కకు తప్పుకుని వెనక్కి తిరక్కుండానే "చంపుదామనుకున్నావా? ఏమిటీ?" అన్నది నవ్వుతూ.

తల దించుక్కునది జయంతి.

*

"మైగాడ్. దిసీజ్ డేంజరస్" అన్నది ఇందిర భయంగా అంతా విని.

"అవును. ఇది ఎంత ప్రమాదకరమయిన కోరికో నాకు తెలుసు. అందుకే భయపడుతున్నాను" అన్నది జయంతి.

"నీతో ప్రమాదం. ఇప్పుడు నాకు భయంగా వుంది."

"ప్లీజ్. నన్ను ద్వేషించకు. సానుభూతితో నన్ను అర్థం చేసుకో. ఈ పరిస్థితుల్లో నేనేం చెయ్యాలి? ఎవరికి చెప్పుకునేది? ఆయనతో చెబుదామనుకున్నాను. కాని నన్ను వెంటనే ఇంట్లోనించి బయటకు నెట్టేస్తాడనే భయం వల్ల చెప్పలేదు. అందుకే నువ్వు నాకు మంచి ఫ్రెండ్‌వని నీకు చెప్పాను. నన్నీ ప్రమాదంనించి నువ్వే కాపాడాలి" అన్నది జయంతి దీనంగా.

ఇందిర వెంటనే మాట్లాడలేదు. ఆమె జయంతి మానసిక స్థితిని బాగా అర్థం చేసుకుంది. అవును. కొంత మందిలో ఇలాంటి వింత కోరికలు కలుగుతూ వుంటాయి.

జయంతి సమస్యకు పరిష్కారం యేమిటి?

ఆటోలో ఇంటికి బయల్దేరారు.

దారిలో అన్నది ఇందిర—"నాకో ఆలోచన వచ్చింది. నువ్వు సరిగ్గా ఒంటి గంటకు మా ఇంటికి వచ్చెయ్యి. నీలో ఈ రాక్షసి కోరిక పోయే ఆలోచన చెబుతాను."

"థాంక్యూ ఇందిరా" అన్నది జయంతి.

4

సరిగ్గా ఒంటి గంట.

"ఇప్పుడు చెప్పు?" అన్నది ఇందిర.

తనలో చోటుచేసుకున్న తనని వెంటాడుతున్న రాక్షసి కోరిక గురించి చెప్పడం మొదలుపెట్టింది జయంతి.

అంతా నిశ్శబ్దం.

తలుపులను మూసింది ఇందిర.

మధ్యలో ఆమెను ప్రశ్నలు అడుగుతోంది ఆమె.

"ఎక్కువగా ఎవరెవర్ని చంపాలని అనిపిస్తుంది?"

"ఒకరని లేదు. అవకాశం దొరికితే ఎవర్నయినా సరే హత్య చెయ్యాలని అనిపిస్తుంది. నా భర్తని, నిన్ను, నీ మొగుడినీ ఇంకా...."

"ఏమిటీ మా ఆయన్నా!"

"అవును మీ ఆయన్ని కూడా చంపాలని అనిపిస్తుంది. నా ఈ కోరికకు తారతమ్యాలు లేవు" చెప్పింది జయంతి.

పదిహేను నిముషాలు గడిచాయి.

"ఇక నువ్వు హత్య చెయ్యలేవు" అన్నది ఇందిర.

"ఎలా?" అడిగింది జయంతి.

"ఇలా" అని అప్పటివరకు టేబిల్ సొరుగులో వున్న టేప్ రికార్డర్ ని బయటకు తీసింది. అందులోనించి కేసెట్ ని తీస్తూ "నువ్వు నీ కోరిక గురించి చెప్పినదంతా యిందులో రికార్డు చేశాను. నీలో మళ్ళీ ఆ కోరిక కలిగి ఎవర్నయినా హత్య చేయాలని అనుకుంటే నీకు ఈ కేసెట్ గురించి గుర్తువస్తుంది. అప్పుడు నీలో ఆ కోరిక అణిగిపోతుంది. నువ్వు యెవర్నయినా హత్య చేస్తే నేను ఈ కేసెట్ ని పోలీసులకు యిచ్చేస్తాను. అప్పుడు నీకు యావజ్జీవ జైలు శిక్ష పడవచ్చు. ఈ భయంతోనైనా నువ్వు నీ కోరికను తరిమివేస్తావు. నిజమేనంటావా?" అన్నది ఇందిర.

"రియల్లీ వండర్. నీ ఆలోచన చాలా గొప్పది. నిజం. నాకు హత్య చెయ్యాలనే ఆలోచన వచ్చినప్పుడల్లా ఈ కేసెట్ గురించి కూడా గుర్తువస్తుంది. అందువల్ల నా ప్రాణభయం గురించి ఆలోచన మరొకర్ని చంపాలనే ఆలోచనను అణిచివేస్తుంది. థాంక్ యూ ఇందిరా" అన్నది జయంతి

నవ్వింది ఇందిర.

"ఒకవేళ ఈ కేసెట్ కోసం నిన్నే హత్యచేస్తే" అన్నది జయంతి వున్నట్టుండి.

"నిజమే. కాని నా జాగ్రత్తలో నేను వుంటాను. నీకా అవకాశం యివ్వను" అన్నది ఇందిర.

5

మధ్యాహ్నం—

"సినిమాకు వెళుతున్నాను వస్తావా?" అనడిగింది ఇందిర పావుతక్కువ రెండు గంటలు అవుతున్నప్పుడు వచ్చి.

"సారీ. నేను రాను. నాకు యింట్రస్టు లేదు" అన్నది

జయంతి.

"ఒక్కదానివే వున్నావుగా."

"అవును. ఆయన కార్డ్స్ ఆడటానికి వెళ్ళాడు. మీ ఆయన కూడా ఎక్కడికయినా వెళ్ళాడా...."

"డల్‌గా వుందిట. అందుకే యింట్లోనే పడుకున్నాడు. నిద్రవుంటే చాలు. సర్లే. నే నొక్కదాన్నే వెళతాను" అని వెళ్ళిపోయింది ఇందిర.

చాలాసేపు జయింతి ఇందిర గురించి - ఆమె భర్త గురించి ఆలోచిస్తూ వుండిపోయింది. ఇద్దరికీ యెంతో భేదం వుంది. ఆయన కొంచెం డల్.

ఎందుకో తనకు సినిమాకు వెళ్ళాలని అనిపించలేదు అనుకున్నదామె.

సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నప్పుడు ఇందిర యింటికి వచ్చి తలుపులను తెరిచి కెవ్వున అరిచి కింద పడి పోయింది.

ఎదురుగా ఆమె భర్త దామోదరం నెత్తుటి మడుగులో పడివున్నాడు. గుండెల్లో సగం పైగా దిగిపోయిన కత్తిపిడి బయటకు కనపడుతోంది.

పదినిముషాల్లో ఆ యింట్లో జనం పోగైనారు.

జయంతి కూడా వెళ్ళింది.

అప్పటికే యెవరో పోలీసులకు ఫోన్ చేశారు ఆ హత్య గురించి.

పోలీసులు వచ్చారు.

ఎవరో ఇందిర మొహంమీద నీళ్ళు చల్లి స్పృహ తెప్పించారు.

స్పృహలోకి వచ్చిన తర్వాత ఎదురుగా కనిపించిన జయంతిని చూసి "ఛీ. నీచురాలా. అమానుషంగా నా

భర్తను హత్యచేశావు. నిన్ను ఉరికంబం ఎక్కిస్తాను" అన్నది ఇందిర పిచ్చిపట్టిన దానిలా.

దామోదరం శరీరంలోనించి కారిన రక్తంతో అతని బట్టలు తడిసిపోయాయి.

"ఏమిటి మీరంటున్నది? మీ భర్తను ఈమె హత్య చేసిందా?" అనడిగాడు యిన్‌స్పెక్టర్ కృష్ణమహేంద్ర.

"అవును. ఆ రాక్షసే హత్యచేసింది. రుజువు కూడా నా దగ్గర వుంది" అని ఆమె లోపలకు వెళ్ళి టేప్ రికార్డర్ తీసుకు వచ్చి ఓ కేసెట్‌ను అందులో వుంచి ఆన్ చేసింది.

క్షణం పాటు నిశ్శబ్దం.

టేపు తిరుగుతోంది.

జయంతి మాటలు వినపడుతున్నాయి.

తనమీద వరుసగా పిడుగులు పడుతున్నట్టు ఫీలయ్యింది జయంతి.

"మైగాడ్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అంతా విని.

తర్వాత "ముందు ఆమెను కస్టడీలోకి తీసుకోండి" అన్నాడు తన సిబ్బందితో—

"నో. నా కేమీ తెలీదు. నేనీ హత్య చెయ్యలేదు. మధ్యాహ్నం రెండు గంటలనించీ ఇప్పటివరకూ నేను యింట్లోనించి బయటకు రాలేదు. నేను నిర్దోషిని. నన్ను వదిలెయ్యండి" అన్నది జయ్యంతి.

ఇన్‌స్పెక్టర్ ఆమె మాటలు వినిపించుకోలేదు.

కొంతటైము తీసుకున్న తర్వాత మిగిలిన అన్ని పనులూ పూర్తి అయినాయి. కత్తిమీద వేలిముద్రలు లేవు.

శవాన్ని పరీక్షకు పంపించే యేర్పాడు కూడా అయిపోయింది.

ఇందిర పెద్దగా—చిన్నగా ఏడుస్తోంది.

మధ్యలో జయంతిని కసిదీరా తిడుతోంది.

జీపు బయల్దేరింది.

ఇన్‌స్పెక్టర్ తన మోటార్ సైకిల్‌ని స్టార్టు చేశాడు.

సరిగ్గా అప్పుడే ఓ యువకుడు, అతని దగ్గరకు వచ్చి "నే నీ ఎదురుగా వుండే మేడమీది గదిలో వుంటున్నాను. మీకో విషయం చెప్పాలి" అని అతను ఆ విషయాన్ని ఇన్‌స్పెక్టర్‌తో చెప్పాడు.

"థాంక్ యూ యంగ్ మేన్" అని అతని భుజంతట్టి మోటార్ సైకిల్‌కి స్టాండువేసి—ఇందిర యింటి వెనుక వున్న యింటి వెనుకవైపు వెళ్ళాడు.

* * *

"అవును. ఆ దుర్మార్గుడిని నేనే చంపాను" అన్నది రాజేశ్వరి కసిగా. ఆమె ఇందిర ఇంటి వెనుక ఉన్న ఇంట్లో ఒంటరిగా వుండేది.

"ఓ రోజు ఇందిరకోసం వెళ్ళిన నన్ను వాడు బలాత్కరించాడు. వాడి జంతు బలం ముందు నేను ఓడిపోయాను. వాడు నన్ను అనుభవించాడు. అంతా జరిగాక ఈ విషయాన్ని నలుగురికీ చెప్పి అల్లరి కాదల్చుకోలేదు.

వాడు చేసిన ఆ దారుణం కారణంగా నాకు నెల తప్పింది. వాడితో నన్ను కూడా పెళ్ళి చేసుకొమ్మని అడిగాను. వాడు విన్లేదు. ఎబార్షన్ చేయించుకోమన్నాడు. వా డెంత నీచుడో, దుర్మార్గుడో అర్థమయింది. ఆ రోజున కూడా వాడు నన్ను మళ్ళీ బలవంతం చేశాడు. అప్పుడే ఆ రోగ్‌ని అంతం చెయ్యాలని అనుకున్నాను.

మూడు రోజుల క్రితం ఇందిర నాకో రహస్యం చెప్పింది. జయంతిలో నేరప్రవృత్తి వుందనీ, దాని గురించి జయంతి మాటలను తను టేప్ చేశాననీ చెప్పి నాకు విని

పించింది. అప్పుడు నాకు అనిపించింది — దామోదరాన్ని నేను హత్యచేస్తే ఆ నేరం జయంతి మీదకు వెళుతుందని. అవకాశం కోసం చూస్తున్నాను.

ఈ రోజు ఆ అవకాశం వచ్చింది. ఇందిర తను పిని మాకు వెళుతున్నానని నన్ను కూడా రమ్మన్నది. కాని వాడు యింట్లో ఒంటరిగా వున్నాడని తెల్సి నేను రానన్నాను. జయంతి కూడా ఒంటిరిగానే ఇంట్లో వున్నదని తెల్సుకున్నాను. కత్తి తీసుకుని వెళ్ళాను. దామోదరాన్ని పొడిచి చంపాను. కత్తిమీది వేలిముద్రలు తుడిచి జాగ్రత్తగా బయటకు వచ్చాను.

కాని ఓ మనిషి నన్ను గమనిస్తున్నాడని నేను గ్రహించలేకపోయాను. అందుకే దొరికిపోయాను. నిజానికి నేరప్రవృత్తి నాలోనూ వుంది. లేకపోతే కథ ఇంకో విధంగా వుండేది'' అన్నది రాజేశ్వరి చివరగా— □

మచ్చలేని నాయకుడు?



నేనే న్యాయమూర్తిని

బొమ్మిడి అచ్చారావు



నా నరనరం ఆవేశంతో పొంగిపోతోంది. పళ్ళు, దవడలు బిగుసుకుంటున్నాయి. గుప్పిళ్లు మూసుకుంటున్నాయి. నా కంత అన్యాయం చేసిన ఆ రాస్కెల్‌ని ప్రాణాలతో వదలకూడదు. ఈ రోజే అందుకు ముహూర్తం!

మార్కెట్ దగ్గర ఆగాను. పొడవాటి కత్తి ఒకటి కొన్నాను. పదును బాగానే వున్నది. మొనమీద వేలుపెడితే

తెగిపోయేలాగా వుంది.

టైం చూసుకున్నాను. రాత్రి తొమ్మిది గంటలు సూచిస్తోంది. అప్పుడే వెళ్ళకూడదు. బాగా సద్దు మణగాలి!

ఈ సరికి ఆ రాఘవగాడు వచ్చివుంటాడు. పెళ్ళాంతో కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా నవ్వుకుంటూ వుంటాడు. నాకు చేసిన అన్యాయం యీ సమయంలో వాడికి గుర్తుండదు! కాసేపటికి సుఖంగా నిద్రపోయాడు. ఆ నిద్రే వాడికి శాశ్వత నిద్ర కావాలి! అవును, అంతే!

కాసేపు నాలుగురోడ్లు పిచ్చికుక్కలా తిరిగాను. బొడ్లో దోపిన కత్తి నన్ను తొందరపెడుతోంది. నేను వేసిన ప్లాన్ ప్రకారం నా శత్రువు లిద్దరూ ఒకేసారి—ఒకడు పరలోకానికి, ఒకడు జైలుకి పోవాలి! దానికంతా పథకం సిద్ధం చేశాను.

కృష్ణమోహన్‌ని ఓ సారి తలుచుకున్నాడు.

వాడు నేను యెంత ఆత్మీయంగా మెలిగాం! నేను వాడంటే ప్రాణం పెట్టేవాడిని. అలాంటి నాకు వెన్నుమీద దెబ్బ కొట్టాడు వాడు. నాకు రావలసిన ప్రమోషన్ కొట్టేశాడు. నేను సీనియర్ని. ముందు ఆ ప్రమోషన్ నాకే రావాలి.

అయితే నా కాన్ఫిడెన్షియల్స్ పాడుచేయించాడు ఆఫీసరుకి చెప్పి. లంచం పట్టానని లేని నేరాన్ని నా మీద రుద్దాడు. కిరాయి మనుషులచేత నా ఇంట్లో నా పడక కింద రూపాయి నోట్ల కట్టలు పెట్టించాడు, నంబర్లు నోట్‌చేసి. ఏంటీకరప్షన్ వాళ్ళకు ఫోన్‌చేసి రప్పించాడు.

ఆధారాలు సరిపోవటంతో నన్ను దోషిగా నిర్ణయించారు. సస్పెండ్ చేశారు ఉద్యోగం నించి. అరెస్టుచేసి బెయిల్

మీద విడుదల చేశారు.

చెయ్యని నేరానికి శిక్ష! అవమానం, ఉక్రోషం, క్రోధం నా నరనరాన్ని పిండేస్తున్నాయి. ఒకసారి పోలీసుల దృష్టిలో పడ్డాక యిక నేను యెందుకు ఉపేక్షించాలి! ఎందుకు జంకాలి?

అందుకే యీ పథకం వేశాను. నన్ను జైలుకి పంపిన కృష్ణమోహన్‌ని నేనూ జెయిలుకి పంపాలి! వాడు యెలా ప్లాన్‌చేసి నన్ను అరెస్టు చేయించాడో, నేనూ అలాగే ప్లాన్‌చేసి కథ నడిపి వాడు అరెస్టు అయ్యేలాగా చూడాలి! అప్పుడే నాకు మనశ్శాంతి! కుక్క కాటుకు చెప్పుదెబ్బే సరైన మార్గం.

రాఘవ నాకు ఆగర్భ శత్రువు! దేవుడు మేలుచేస్తే నాకు బావ కావలసినవాడు. నా చెల్లెలు రమ వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. తల్లిలేని పిల్ల కావటంతో గారాబంగా పెంచాను. ఈ లోకంలో నాకు మిగిలిన ఒకే ఒక ఆత్మబంధువు రక్తసంబంధీకురాలు రమ ఒక్కతే! ఘనంగా పెళ్ళిచేసి అత్తారింటికి పంపించాలని ఎన్నో కలలు కనేవాడిని.

అకస్మాత్తుగా రమ చెప్పింది—తను రాఘవ అనబడే తన కొలీగ్‌ని ప్రేమించినట్టు. అతను డిగ్రీలో రమ క్లాసు మేటు. ఓ సారి తీసుకొచ్చి పరిచయం చేసింది కూడా! కుర్రాడు బావుంటాడు! తెలివి కొట్టవచ్చినట్టు ముఖంలో వెలిగిపోతోంది!

ఆ వేసవిలో ముహూర్తాలు పెట్టేవాళ్ళమే!

కాని ఆ రాఘవగాడు మేకవన్నె పులి! నిలకడ లేని దౌర్భాగ్యుడు. ప్రేమించిన పిల్లని గాలికి వదిలేసి లక్ష రూపాయల కట్నంతో వచ్చిన ఓ పల్లెటూరి మొద్దుకి తాళి

కట్టేశాడు. ఇదేమని అడిగితే. తనా పెళ్ళి చేసుకోకపోతే తన తల్లి నూతిలో దూకుతానని బెదిరించిందనీ గత్యంతరం లేక తాళి కట్టాననీ కథలు చెప్పాడు. వాడి పెళ్ళిరోజునే నా చెల్లి యీ లోకంతో భవబంధాలు తెంపుకుని వెళ్ళిపోయింది.

నాలో ప్రతీకారవాంఛ మొలకెత్తి మానయ్యింది. నా చెల్లికి ద్రోహం చేసి నాకు మనోక్షోభ కలిగించిన ఆ రాఘవగాడిని ప్రాణాలతో వదలకూడదు కొత్తగా పెళ్ళయిన ఆ పిల్ల విధవ అయితే కానియ్యి. నా చెల్లిస్థానం ఆక్రమించిన ఆ పిల్ల సంగతేమయితే నా కేం? నా కసి తీరాలి!

రాఘవగాడి యిల్లు వివేక్ నగర్లో వుంది. కాలినడకన వెళ్ళితే నలుగురి దృష్టిలో పడతాను. ఆటో పిలిచాను, ఎక్కాను. కమ్యూనిటీ హాలు దగ్గర దిగి ఆటోని పంపేశాను. అక్కడికి ఓ ఫర్లాంగు దూరంలో వాడి యిల్లుంది!

బొడ్లోదోపిన కత్తి నన్ను తొందరపెడుతోంది. వాచీ చూసుకున్నాను. పదకొండు కావస్తోంది. వీధంతా నిర్మానుష్యంగా వుంది.

రాఘవ యింటికి పెద్దగేటుంది దాన్ని తోసుకు వెళ్ళాను. ఇదివరకు ఆ యింటికో కుక్క వుండాలి. కాని అది రోడ్ దాటబోతూ లారీకింద పడి చచ్చిపోయింది. ఆ తర్వాత మళ్ళీ కుక్కని పెంచలేదు. గేటుమీద బోర్డు మాత్రం 'బి వేర్ ఆఫ్ డాగ్' అని బెదరగొడుతూనే వున్నది!

రాఘవ గది నాకు గుర్తే! ఓ సారి ఈ యింటికి రమతో వచ్చాను. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గదిని సమీపించాను. నేనూహించినట్టే రాఘవ మంచం

మీద పెళ్ళాన్ని కావలించుకుని పడుకుని వున్నాడు. ఆమె అలా వుండగా హత్య చెయ్యటం తేలికాక్కాదు.

నా వెంట తెచ్చిన క్లోరోఫాం అద్దిన కాటన్ స్వాబ్స్‌తో పని వచ్చింది. బయటి నుంచి కత్తిసాయంతో గడలు లేపేశాను. తలుపులు తెరిచాను. అదే యింట్లో యింకా రెండు గదులున్నాయి. రాఘవ తల్లిదండ్రి అన్న వదిన కూడా ఆ యింట్లోనే వుంటున్నారు

రాఘవ పెళ్ళాం ముక్కువద్ద కాటన్ స్వాబ్ పెట్టాను. కొద్ది క్షణాల్లోనే ఆమె తల పక్కకి వాల్చేసింది. ఆమెని రెండు చేతుల్తోనూ లేపి బాత్‌రూంలో పడుకోబెట్టి వచ్చాను.

రాఘవని ఏ విషమో సిరంజిలోకి ఎక్కించి తేలిగ్గా చంపేయవచ్చు! కాని నాకు అలా చేయటం యిష్టంలేదు. వాడ్ని ఘాతుకంగా తూట్లు తూట్లుగా శరీరాన్ని పొడిచి పొడిచి చంపాలి. నేనే చంపుతున్నట్టు వాడికి చెప్పి మరీ చంపాలి! అందుకే వాడు కదుల్తున్నా క్లోరోఫాం వాసన చూపించలేదు.

కర్టెన్ చించాను పీలికలుగా. రాఘవ గాఢ నిద్రలో వున్నాడు. పీలికలతో మంచానికి అడ్డంగా కట్టేశాను. నోరు పెకలించి గుడ్డ పీలికలు కుక్కాను.

వాడికి మెలకువ వచ్చేసింది గుడ్లు యింత చేసుకుని చూస్తున్నాడు. కదలబోయాడు. అరవబోయాడు. రెండూ జరగలేదు. నావైపు జాలిగా నిస్సహాయంగా చూస్తున్నాడు. పక్కమీద అటూ యిటూ పెళ్ళాం కోసం వెతుక్కున్నాడు. నేనేమీ నోరు మెదపలేదు.

చేతులెత్తాడు నమస్కారం పెట్టాలని—వదిలెయ్యమని అడగాలనీ. అదీ వీలుపడలేదు.

నేను బొడ్లోనించి కత్తి తీశాను. చేతులకి గ్లవుస్ వేసుకోవటం మర్చిపోలేదు. రాఘవ బెదిరిపోయాడు. దీనంగా చూస్తున్నాడు. చంపవద్దని తల అటుయిటు తిప్పాడు. నేను క్రూరంగా నవ్వాను.

వాడి గొంతుమీద కత్తిమొన ఆనించాను. రాఘవ మౌనంగా ఏడ్చేస్తున్నాడు. గోలుగోలున ఏడ్చేస్తున్నాడు. శబ్దం బయటికి రావటంలేదు. పక్కమీద అటు యిటు కదిలిపోతున్నాడు.

నేను మెల్లగా వాడి చెవిలో అన్నాను: "నా చెల్లిని అన్యాయం చేశావు. అది నీకు న్యాయంగా అనిపించిందా? నిన్ను చంపటం మాత్రం నాకు న్యాయంగానే అనిపిస్తోంది. నిన్ను చిత్రవధ చేసి చంపుతాను" అని.

కత్తితో రాఘవ కుడికంటి మీదుగా గడ్డం చివరి వరకు గీత పెట్టాను. బాధతో మూలిగాడు. నెత్తురు కాల్వ కట్టింది.

ఈసారి రెండో కంటిమీదుగా గీత పెట్టాను. రాఘవ పక్కమీద ఎగిరెగిరి పడుతున్నాడు. గిలగిల కొట్టుకుంటున్నాడు.

కర్కశంగా నవ్వుకున్నాను.

ఈసారి ఛాతిమీది షర్టు తొలిగించి గుండెల పొడవునా కత్తితో చీరాను.

హృదయవిదారకంగా ఏడుస్తున్నాడు రాఘవ. ఏడవనియ్యి! ఎంత ఏడిస్తే నా చెల్లెలి ఆత్మకు అంత శాంతి.

ఎక్కడో అలికిడి అయినట్టనిపించి చటుక్కున వెను తిరిగి చూశాను. ఎవరో నడవాలో నడుస్తున్న అలికిడి.

ఇక ఆలస్యం చెయ్యకూడదు!

చటుక్కున రాఘవగుండెల్లో కత్తి దింపేశాను, గట్టిగా

నోరు నొక్కేసి. ఎలాంటి చప్పుడు చెయ్యకుండా తల పక్కకి వాల్చేశాడు—మరో రెండు పోట్లు కడుపులో పొడిచాను.

జేబులో నుంచి నశ్యం డబ్బా పైకి తీశాను. అది కృష్ణ మోహన్ దని మా ఆఫీసులోను, బయట కూడా చాలా మందికి తెలుసు!

దాన్ని మంచం పక్కనే పడేశాను. నాలుగు రోజుల క్రితం దేవాలయం దగ్గిర కృష్ణమోహన్ చెప్పులు కాజేశాను. అవి మంచానికి దూరంగా గుమ్మం పక్కన పెట్టాను.

అతను కాల్చే సిగరెట్లు నాకు తెలుసు. సగం కాల్చిన సిగరెట్లు నాలుగుపీకలు—నేనే తయారుచేశాను—అక్కడ క్కడ పడేశాను. కృష్ణమోహన్ సిగర్‌లైటర్ మంచం కిందికి దొర్లించాను. దానిమీద అతని పేరును పొడి అక్ష రాల్లో 'కె.ఎమ్' అని చెక్కుకున్నాడు. ఆ సంగతి కూడా నాకు బాగా తెలుసు.

ఈ ఆధారాలు చాలు కృష్ణమోహన్ హంతకుడని నిరూ పించటానికి. నా ఆధారాలేవీ వదలకుండా మొదట్నించీ జాగ్రత్త తీసుకుంటున్నాను కాబట్టి, ఆ విషయంలో నాకు చింతలేదు.

పని అయిపోయింది. వెను తిరిగాను. కెవ్వున అరవ బోయి ఆగిపోయిందో స్త్రీమూర్తి. నన్ను చూసేసింది.

అంతే, ఏ మాత్రం ఆలోచించకుండా మెరుపులా ఆమె మీద దూకాను. కత్తి ఆమె గుండెల్లో దించేశాను. ఒక్క పోటుకే కిందపడిపోయింది. ప్రాణంపోయి వుండాలి! కాని ఆమె చేసిన ఆర్తనాదాన్ని ఆపలేక పోయాను! లైట్లు టపటప మంటూ వెలిగాయి.

అందరూ లేచినట్టున్నారు.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా గేటువైపు ఉరికాను. కాంపౌండ్ వాల్ మీదుగా దూకి క్షణంలో రోడ్ మీదికి చేరిపోయాను.

దూరంగా ఆటో వస్తోంది. ఆపాను.

ఆ చీకట్లో కూడా ఆటో డ్రైవరు నా వంక చిత్రంగా చూడటం గమనించాను. వాడికి ఎక్కడికి వెళ్ళాల్సిందీ చెప్పాను.

ఆటో బయల్దేరింది.

నా గుండె దడ యింకా తగ్గలేదు. ఒక హత్య చెయ్యాలనుకున్న వాడ్ని రెండు చేశాను. అదీ ముక్కూ మొహం తెలీని ఓ ఆడదాన్ని. ఆమె బహుశా కృష్ణమోహన్ వదిన కావచ్చును. వయసుని బట్టి అలా ఊహిస్తున్నాను. ఆమెని యిదివరలో నేను చూడలేదు. నన్నామె చూసి వుండదు. కాని హత్య చేసిన గదిలో నన్ను చూపింది. చక్కగా, గుర్తుపట్టేంత దూరంలో నిలబడి చూపింది. అదే ఆమె ప్రాణాల్ని తీసింది.

ఆలోచనల మధ్య ఎటు పోతున్నదీ గుర్తించలేదు. గమనించేసరికి పోలీసు స్టేషన్‌కి ఫర్లాంగు దూరంలో వుంది ఆటో. డ్రైవర్ మీద అనుమానం వచ్చింది. నేను వెళ్ళాల్సిన రూట్ అదికాదు. ఎప్పుడో మధ్యలో దారి తప్పించేసి పోలీస్‌స్టేషన్‌కి తీసుకుపోతున్నాడు ఆటోవాడు.

ఇక ఆలస్యం చెయ్యలేదు. కత్తి నాతోనే వుంది. ఎడం చేత్తో డ్రైవరు నోరు నొక్కేసి వీపులో కత్తి దించేశాను. సీట్లో వాలిపోయాడు.

ఆటో కంట్రోల్ తప్పే లోపల ముందుకి ఉరికి బ్రేక్

కొట్టేశాను. జర్క్‌తో ఆగి పక్కకి పల్టీ వేసేసింది ఆటో. అసలే బ్యాలెన్స్ తక్కువ ఆటోకి. షడన్ బ్రేక్‌వల్ల తిరగబడిపోయింది.

నేను పక్కకి గంతేశాను. పోలీస్ స్టేషన్‌కి పదిగజాల దూరంలో జరిగిందీ సంఘటన! అదురుకి ఓ జవాను బయటికి తొంగి చూశాడు.

నేను చటుక్కున పక్కనే వున్న సైడు కాలవలోకి గంతేశాను. నీళ్ళ బురద ఒంటి నిండా చిమ్మింది.

చేతికి బురద కాబోలు తగిలింది. చూసుకుని ఉలిక్కిపడ్డాను. ఎర్రగా వుంది!" నెత్తురు.

అందుకే ఆటోవాడు నన్ను దారి తప్పించాడు. నేను హంతకుడ్నని గుర్తు పట్టేశాడు, నా అవతారం చూడగానే.

ఆటో తిరగబడ్డ ప్రదేశంలో కలకలం చెలరేగింది. పోలీసులు ముసురుతున్నారు.

కాలవలో అలాగే కొంత దూరం నడిచాను. ముక్కులు పగిలిపోయే దుర్గంధం! కాని గత్యంతరం లేదు. పైకి గట్టు మీదికొస్తే దొరికి పోతాను. అలాగే నడుస్తున్నాను.

కాలవ మలుపు తిరిగినచోటు నిర్మానుష్యంగా వుంది.

గట్టుమీది కెక్కాను. నా అవతారం చూసుకుంటే నాకే అసహ్యం వేస్తోంది. మూడు నిండు ప్రాణాల్ని అవలీలగా తీసేసిన నరరూప రాక్షసుడ్ని నేను!

ఇక వాహనం ఏదీ ఎక్కకూడదు! ఎక్కగలిగిన పరిస్థితి కూడా కాదు. జేబులో నించి కత్తి తీశాను. మురుగు కాల్వలో విసిరేశాను. ఎవరికీ దొరకదిక!

నేను ఏ రోడ్‌న వున్నానో పరిశీలించి చూశాను. నాలుగు వీధులు దాటితే చాలు యిల్లు చేరిపోతాను. ఫరవా లేదు, అరగంటలో చేరుకోవచ్చు.

గబగబ అంగలువేస్తూ పరుగులాంటి నడకతో యిల్లు చేరాను. బాత్‌రూంలో దూరి ఓ అరగంట సేపటి కరకు స్నానం చేస్తూనే వున్నాను.

బురద, రక్తం కడుక్కోగలిగాను. కాని నా మనసుని అంటిన మలినం యెలా కడుక్కోగలను? ఏ సముద్రపు నీళ్ళు నా మలినాన్ని పూర్తిగా క్షాళనం చెయ్యగలవు? మేక్‌బెత్ నాటకంలోని హీరో పడే మనోవేదన గుర్తొచ్చింది. తన రాజుని చంపానని మేక్బెత్ యిలాగే ఆలోచిస్తాడు.

ఓ అధ్యాయం ముగిసింది. రెండో అధ్యాయం కృష్ణ మోహన్ అరెస్టుతో మొదలు కావాలి.

నా గుడ్డల్ని కూడా రక్తం అంటింది. వాటిని కిర్సనాయిలు పోసి తగలబెట్టేశాను. లేవెట్రీలో నుసి పడేసి ఫ్లష్ అవుట్ చేశాను. ఇక నా దగ్గర హత్యకు ఆధారాలేమీ లేవు.

హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

మంచంమీద పడుకుని ఫ్యాన్ ఫుల్‌స్పీడ్‌లో పెట్టుకున్నాను. ఎంతకీ నిద్రపట్టలేదు. మనసు నిండా తేనెటీగల్లాంటి ఆలోచనలు ముసురుస్తున్నాయి.

నా మీద కోర్టులో కేసు నడుస్తోంది. నాకు వ్యతిరేకంగానే తీర్పు వచ్చేలా వుంది. దేశంలో ఎంతో మంది లక్షలకు లక్షలు లంచాలు మింగి దొరక్కుండా తప్పించుకో తిరుగుతున్నారు. ఘరానా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారు. కాని నేను ఏ పాపం ఎరగని నేను లంచగొండినని ముద్రవేయించుకుని చెయ్యని నేరానికి ఉద్యోగం నుంచి సస్పెండు చెయ్యబడ్డాను. త్వరలో డిస్మిస్ చెయ్యబడబోతున్నాను. ఎక్కడుంది న్యాయం? అందుకే న్యాయాన్ని. చట్టాన్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. నేనే న్యాయమూర్తిని!

కృష్ణమోహన్ మీదికి పోయాయి ఆలోచనలు. నేను చెయ్యగలిగిన ఉద్యోగ హోదాలో తనున్నాడిప్పుడు. అన్యాయం చేసి సంపాదించిన ప్రమోషన్! రేపు ఉదయం కటకటాల వెనుక సరికొత్త హోదాలో వుంటాడు. నవ్వుకున్నాను.

చివరి సారిగా హత్య చెయ్యటానికి ముందు తొమ్మిది గంటల ప్రాంతంలో కృష్ణమోహన్ని వాడింట్లో పెళ్ళాం పిల్లలతో కబుర్లాడుతుండగా చూశాను. అతను ఊళ్ళోనే వున్నట్టు రుజువు కావాలి కదా! అందుకే అతని యింటి మీద వెళ్తూ అతను ఊళ్ళోనే వున్న విషయం నిర్ధారణ చేసుకొన్నాను.

ఎప్పుడో తెల్లవార్తుండగా నిద్రపట్టింది.

ఉదయం నే నింకా లేవకముందే నన్నెవరో తలుపు తట్టి లేపారు.

చటుక్కున నిద్రలేచాను. అలారం టైమ్‌పీసు ఎనిమిది గంటలు చూపిస్తోంది. రాత్రి బాగా పొద్దుపోయి నిద్రపోవటంవల్ల మెలకువ రాలేదు.

ఎవరబ్బా అనుకుంటూ తలుపు తీశాను.

ఎదురుగా పోలీసులు!

ఒక్క అడుగు వెనక్కి వేశాను.

"మూడు హత్యలు చేసిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాం. ఆటో తిరగబడినప్పుడు నీ మనీపర్సు జారి పోవటం బహుశా నువ్వు గమనించివుండవు. అందులో నీ పాస్‌పోర్టుసైజు ఫోటో పెట్టుకుని వుండటం నీ దుర దృష్టం!

'ఆటో డ్రైవరు చచ్చిపోతూ నిన్ను ఎక్కడ్నించి

తెచ్చాడో చెప్పాడు. మరో రెండు హత్యలు మా కళ్ళ బడ్డాయి. కృష్ణమోహన్ అనబడే వ్యక్తిని దోషిగా నిరూపించటానికి నువ్వు అక్కడ పడేసిన ఆధారాలు కూడా మాకు కనిపించాయి.

మొదట్లో ఆ రెండు హత్యలకు కారణం నువ్వు కాదేమోననుకున్నాం కాని కృష్ణమోహన్ యింటికి వెళ్ళి చూసేసరికి అతను నిన్న రాత్రి వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం రావటంతో యింటిల్లిపాదీ బెజవాడ వెళ్ళారు" అంటున్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు. ఇక నా కేం వినిపించటంలేదు. □

శోభనం రాత్రి

ఎమ్.డి. చైతన్య



లావణ్య పేరుకు తగినట్లే లావణ్యంగా వుంటుంది.

ఎం.ఏ., పి.హెచ్ డి. చేసి ఎకనామిక్స్ లెక్చరర్‌గా నగరంలోని ఒక కాలేజీలో ఆమె పని చేస్తోంది. చాలా తెలివిగల అమ్మాయి.

ద్రవ్యోల్బణం, ధరల పెరుగుగల మొదలైన అంశాల

గురించి ప్రపంచ ఆర్థికవేత్తలు ఆశ్చర్యపోయేటట్టు పరిశోధనా పత్రాలు రాసింది. ఆమె సూచనలను పాటిస్తే— ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రహ్మాండమైన మార్పు రావచ్చని ఎందరో ఆర్థికవేత్తలు వక్కాణించారు.

ఆమె లెక్కల్లో కూడా జీనియస్. కంప్యూటర్ కన్నా వేగంగా—కాగితం, కలం అవసరం లేకుండా సమాధానాలు చెప్పగలదు. ఆమె మేధాశక్తిని చూసి యెందరో ఆశ్చర్యపోయి—అసాధారణ స్త్రీ అని గౌరవంగా చెప్పుకుంటూ ఉంటారు.

లావణ్య ఒక దినపత్రికలో ఉపసంపాదకుడుగా పని చేస్తున్న నవీన్ అనే అతన్ని ప్రేమిస్తోంది. నవీన్ కూడా ఆమెను యెంతో గాఢంగా ప్రేమిస్తోన్నాడు. ఆమెను పెళ్ళి చేసుకోవడము ఒక అదృష్టంగా భావిస్తాడు అతను.

ఆ రోజు ఆదివారం.

లావణ్య దినపత్రిక చదువుతూ కూర్చుంది.

ఫోన్ మ్రోగింది.

లావణ్య రిసీవర్ అందుకున్నది.

"హలో, లావణ్య స్పీకింగ్ ప్లీజ్...."

"హలో, గుడ్ మార్నింగ్! నేను నవీన్‌ను మాట్లాడుతున్నాను ఏం చేస్తున్నావు? బిజియా?"

"లేదు ఖాళీగానే వున్నాను. ఏదైనా ప్రోగ్రాం ఫిక్స్ చేసావా?"

"ఔను....సినిమాకెళ్దాం. సంతోష్‌లో 'నిఖా' సినిమా ఆడుతోంది. ఆ సినిమా మీద నాకు రివ్యూ వ్రాయాల్సి వుంది. నువ్వు ఓకే అంటే—మార్నింగ్ షోకి వెళ్దాం."

"ఓ కే. నేను రెడీగా వుంటాను. వచ్చెయ్!"

ఫోను పెట్టేసింది.

పది నిముషాల్లో నవీన్ స్కూటర్ మీద ఖైరతాబాదులో వున్న లావణ్య ఇంటికొచ్చాడు.

లావణ్య ఇంకా దినపత్రిక చదువుతూ కూర్చుంది.

"ఏమిటీ ఇంకా నువ్వు తయారవలేదా?"

"అరె, అప్పుడే వచ్చేసావా? నువ్వు రాసిన ఆర్టికల్ "వై ది సౌత్ రిజెక్టెడ్ మిసర్స్ గాంధీ" చదువుతూ కూర్చున్నాను. చాలా బావుంది."

"థ్యాంక్యూ"

"కూర్చో. ఇప్పుడే బట్టలు మార్చుకొని వస్తాను" అంటూ లావణ్య లోనికి వెళ్ళింది.

ఈలోగా పనిమనిషి అతనికి ఒక చిక్కటి "టీ" ఇచ్చి వెళ్ళింది.

కొద్ది నిముషాల్లోనే చక్కగా డ్రెస్ చేసుకొని వచ్చింది లావణ్య.

వాళ్ళిద్దరూ స్కూటర్ మీద ఆబిడ్స్‌లో వున్న సంతోష్ 70 యం.యం. థియేటరు చేరుకున్నారు. నవీన్ స్కూటర్ పార్కు చేసి వచ్చాడు. ఈలోగా లావణ్య రెండు టికట్లు తీసుకున్నది.

వాళ్ళకు ఆ సినిమా బాగా నచ్చింది. ముస్లిం పెళ్ళి సాంప్రదాయం, విడాకుల గురించి చర్చించిందా సినిమా.

"తల్లాక్....తల్లాక్....తల్లాక్...." అని మూడుసార్లు ఏ భర్త అయినా భార్య ముందు అంటే చాలు. ఆ దంపతులు విడిపోయినట్లే లెక్క. వాళ్ళ దాంపత్య జీవితం ఆ తర్వాత కొనసాగదు. ఒకవేళ ఆ భర్త మళ్ళీ ఆమెనే పెళ్ళి చేసుకోవాలన్నా సాంప్రదాయం అందుకు అంగీకరించదు. అంతగా ఆమెనే అతను కోరుకుంటే—ఆ స్త్రీ పరాయివాడిని... పరొకతన్ని పెళ్ళి చేసుకొని—అతనితో కనీసం ఒక రాత్రి అయినా

గడిపి—తర్వాత రెండవ భర్తతో విడాకులు తీసుకొని మళ్ళీ మొదటి భర్తతో "నిఖా" (పెళ్ళి) జరుపవలసి వుంటుంది.

ముస్లీం యిళ్ళలో వున్న "తల్లాక్" సాంప్రదాయం యొక్క ఇంపార్టెన్స్‌ను దర్శకుడు చక్కగా చిత్రీకరించాడు.

సినిమా చూసి వాళ్ళిద్దరు ఒక ఏ సి. హోటల్లో భోజనం చేసారు. భోజనం అయిన కొద్ది నిముషాలకే లావణ్య కడుపులో ఏదో వికారం మొదలైనది. ఆమె గబగబా వెళ్ళి వాష్‌బేసిన్‌లో వాంతి చేసుకున్నది. తిన్న భోజనమంతా వెళ్ళిపోయింది.

హోటల్లో భోంచేసే వాళ్ళు ఆమె వంక వింతగా చూశారు కొందరికి భోజనములో ఏదైనా విషపదార్థమున్నదేమోనని—అనుమానమేసి—తినడం మానేసారు.

లావణ్య వున్నట్టుండి వాంతి చేసుకున్నందుకు నవీన్‌కు భయమేసింది.

ఆమె వాష్‌బేసిన్ దగ్గరి నుండి టేబుల్ దగ్గరికి తిరిగి వచ్చేసింది.

"ఏమైంది? ఎందుకలా వాంతి చేసుకున్నావు!" నవీన్ కంగారుగా అడిగాడు

"అదే, నాకూ అర్థం కావడంలేదు."

నవీన్ ఠకీమని లేచి—"పద! మనం వెంటనే డాక్టర్ దగ్గరి కెళ్దాం" అని ఆమెను నడిపించుకుంటూ వెళ్ళి స్కూటర్‌మీద కూర్చో పెట్టాడు.

స్కూటర్ ముందు కురికింది.

వాళ్ళు కొద్ది నిముషాల్లోనే అక్కడికి దగ్గరగా వున్న రాధా క్లినిక్ చేరుకున్నారు.

లావణ్య గురించి విని వున్న డాక్టర్ రాధగారు ఆమెను సాదరంగా ఆహ్వానించి — అన్ని పరీక్షలు జరిపి—

"మీరు ఇప్పుడు గర్భంతో వున్నారు. మూడు నెలలు" అన్నారు.

లావణ్య తన నెత్తిమీద పిడుగుపడినట్లు ఫీలయింది.

ఆమె ముఖం కళావిహీనమైంది.

"డాక్టర్, ఇదెలా సాధ్యం! మీరేదో పొరపడి వుంటారు. సరిగ్గా చూడండి!" కంగారుగా అన్నది.

"నో నో! నేను ఖచ్చితంగా చెప్పగలను. ఇందులో ఎలాంటి సందేహం లేదు" ఆత్మవిశ్వాసంతో పలికింది డాక్టర్ రాధ.

నవీన్ ముఖం వెలవెలా పోయింది.

తనను ప్రేమిస్తున్నట్లు నటిస్తూ—ఈవిడ మరొకరితో శారీరక సంబంధం పెట్టుకున్న దన్నమాట. ఇది మేధావి కాదు. ఒక్తి నరరూప రాక్షసి. ఆతని అంతరంగంలో మథనం.

"డాక్టర్, నేనింతవరకు పురుషుని మోహం చూసి ఎరుగను. నేను ఏ పురుషుడితోనూ ఎటువంటి సంబంధాలు పెట్టుకోలేదు. సెక్సు సంబంధాలు లేకుండా నేను గర్భవతిని ఎలా కాగలుగుతాను" అయోమయంగా అంది లావణ్య.

"మీరు కొంచెం స్థిమితపడండి! నిజమే, సెక్సు సంబంధాలు లేకుండా గర్భవతి కావడం ముమ్మాటికి అసాధ్యం కానీ—మీరిప్పుడు గర్భవతి అయినమాట వాస్తవం!"

లావణ్య ఏమీ మాట్లాడలేక—నవీన్ వైపు చూసింది. అతను కోపంతో ధుమధుమలాడుతున్నాడు.

ఆమె తన బ్యాగులోనుంచి డాక్టరుగారి ఫీజు డబ్బులు తీసి ఇచ్చింది.

"పద వెళ్దాం!" అంటూ దారి తీసింది లావణ్య.

నవీన్ చేసేది లేక ఆమె వెంట నడిచాడు.

అతని హృదయం అగ్నిగోళంలా మాడుతోంది.

"లావణ్యా నిన్నెవరో మోసం చేసారు?"

"నో! నన్నెవరూ మోసం చేయడానికి వీల్లేదు."

"నిద్రమాత్రలు కానీ....క్లోరోఫాం గానీ యిచ్చి.... నిన్నెవరైనా మోసం చెసి వుంటారు" మళ్ళీ అన్నాడు అతను.

"లేదు....నాకు అలాంటి సంఘటనలు ఎప్పుడూ ఎదురు కాలేదు...." ఆమె ఆత్మవిశ్వాసంతో పలికింది.

"అయితే—మీ ఇంట్లో కామినీ పిశాచం ఏదైనా తిరుగుతూ వుంటుంది."

కామినీ పిశాచం అనగానే—ఆమెకు తన ఇంట్లో పని మనిషి మల్లమ్మ చెప్పిన కథనం గుర్తొచ్చింది.

"అమ్మగారు....మీ ఇంట్లో దయ్యం తిరుగుతున్నది. మొన్నటి నుంచి అది నా గదిలోకి వచ్చి — 'వల్లమ్మా, నే నొక కోరికలు తీరని దయ్యాన్ని. అరిస్తే నీ ప్రాణాలు తీస్తాను. నేను ఏమి చేసినా నువ్వు కాదనకూడదు. నీకు కావల్సినంత డబ్బు నేను బ్యాంకుల్లో నుండి మాయంచేసి తీసికొని వచ్చి నీ పాదాలముందు పడేసి వెళ్ళగలను. ఒక వేళ నువ్వు తెగించి అరిచినా ప్రయోజనం వుండదు. నీ పీక తెంపి—రక్తం తాగి మాయమైపోగలను" అని బెదిరించి తన ఇష్టం వచ్చినట్టు అనుభవించి పారిపోతున్నది. గత రెండు రోజులనుండే ఇలా జరుగుతోంది. నేను ఈ ఇంట్లో పని చేయలేను. వెళ్ళిపోతాను" అని తనకు రావల్సిన డబ్బులు తీసుకొని వెళ్ళిపోయింది.

తనెంత బ్రతిమాలినా ఇంట్లో ససేమిరా వుండనన్నది. చాలా మంచి పనిమనిషి. పాతిక సంవత్సరాల వయస్సులో పిటపిటలాడుతున్నది. దాన్నెవరో మోసం చేసారు. ఆ మిస్టరీ ఏమిటో కనుక్కుంటాను వుండవే అంటే—అస్సలు వుండలేదు.

కానీ—వల్లమ్మలాగా తను మోసపోయే అవకాశం లేదు.

ప్రతిరోజూ తను రాత్రి పన్నెండు గంటల వరకూ చదువుకుంటూ వుంటుంది. చీమ చిటుక్కుమన్నా తను లేచి కూర్చునేంత సెన్సిటివ్. అదీగాక తన పడక గదిలోకి మానవ మాత్రుడెవ్వడూ ప్రవేశించలేడు. డోర్ లాక్ పిస్టం. పైగా బోల్టులు పెట్టి మరీ తను పడుకుంటూ వుంటుంది.

క్షణంపాటు మెదిలిన ఆలోచనలను ప్రక్కకు నెట్టి—"నో! ఈ పిశాచాల మీద నాకు నమ్మకం లేదు. ఇంత తెలిసిన నువ్వుకూడా దయ్యాలు, పిశాచాలు అంటుంటే—ఆశ్చర్యమేస్తుంది!" అన్నది.

"నాకూ నమ్మకం లేదు. కానీ-నీకు జరిగిన అన్యాయం చూస్తుంటే—నాకు అంతా అయోమయంగా వుంది బై ది బై—నాకు ప్రెస్‌కు వెళ్ళాల్సిన పనివుంది. నువ్వు బస్సులో వెళ్ళు!" సమాధానం కొరకు ఎదురు చూడకుండా నవీన్ స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

లావణ్య ఖిన్నురాలైంది తనను ఇంటి వరకూ డ్రాప్ చేయకుండా అలా వెళ్ళిపోయాడేమిటి? నవీన్ ప్రవర్తన ఆమెకు వింతగా తోచింది.

2

ఏ.జి. లో పనిచేస్తున్న లావణ్య తండ్రి రామారావు గారు—గాంధీ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న

ఆమె తమ్ముడు మోహన్—వాళ్ళ అమ్మ రాధాదేవి గారికి-పురుష సంపర్కం లేకుండా తనకు వచ్చిన గర్భం గురించి లావణ్య నిర్భయంగా తెలియజేసింది

విషయం తెలుసుకున్న ఆ కుటుంబ సభ్యులు స్థంభించి పోయారు.

రాధాదేవిగారి మెదడు పనిచేయడం మానేసింది కూతురి నిజాయితీమీద—సత్ప్రవర్తన మీద నమ్మకమున్న ఆమెకు-కూతురు చెప్పినదాంట్లో లేశమంతైనా అబద్ధం లేదనిపించింది. కూతురు చెప్పిన మాటలు ఆమెకు నమ్మక తప్ప లేదు.

కానీ — పురుష సంపర్కం లేకుండా స్త్రీ గర్భం దాల్చడం ఆమె ఎక్కడా కనీ వినీ ఎరగలేదు. ఇదెలా సంభవం!

రాధాదేవి గారికే కాదు. ఆ ఇంట్లో సభ్యులందరికీ తమ పాత పనిమనిషి మల్లమ్మ తనకు కలిగిన భయంకర అనుభవాన్ని వివరించటం గొర్తొచ్చింది. మల్లమ్మ చెప్పిన కామినీ పిశాచం పనైతే కాదుగదా—అని వారికి అనుమానమేసింది.

అందరూ విద్యావంతులైన ఆ ఇంటిల్లిపాదికి దయ్యాల మీద భూతాల మీద నమ్మకం లేదు. కానీ, జరిగిన వాస్తవం అలాంటిది. నమ్మక తప్పడం లేదు.

మోహన్ మాత్రం కోపావేశుడై పోలీసు రిపోర్టు ఇవ్వాలి అన్నాడు.

తమ పరువు బజారుపాలు అవడమే కాకుండా లావణ్య వివాహం ఈ జన్మకు కాదేమోనన్న భయాందోళనలు వారిని పీడించాయి. పోలీసులు ఇన్వెస్టిగేషన్ అంటూ తమ ఇంటి చుట్టూ తిరగడం-పెక్యూలియర్ కేసు అని పత్రికల వాళ్ళు పోలీసుల నుండి సమాచారాన్ని రాబట్టి ప్రముఖంగా ప్రచు

రించడం— తద్వారా లావణ్య పేరు ప్రతి నోటా నలిగి, ఆమెకున్న పేరు ప్రఖ్యాతులు మంట కలవడమే కాకుండా-ఇంతవరకూ ఆమెకున్న ఇమేజ్ దెబ్బతినే అవకాశముంది

అంచేత వాళ్ళు పోలీసు రిపోర్టు ఇవ్వడం అంత తెలివి గల పనికాదనే నిర్ణయాని కొచ్చారు ఎందుకైనా మంచిదని వాళ్ళకు తెలిసిన డాక్టరుతో లావణ్యను మరోసారి పరీక్ష చేయించారు. ఆమె కూడా లావణ్యకు మూడవనెలనే నిర్ధారణ చేసింది.

రామారావుగారు ఒక నిశ్చయానికి వచ్చి, డిటెక్టివ్ ప్రభాకరన్‌కు ఫోన్‌చేసి — ఆయనను రహస్యంగా తమ ఇంటికి ఆహ్వానించారు.

3

"నేను మీ గదిని చూడాలి" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకరన్. అప్పటి వరకూ లావణ్య చెప్పినదంతా సావధానంగా విన్నాడాయన.

"పదండి!" అంటూ మేడమెట్లవైపు దారితీసింది లావణ్య.

వాళ్ళిద్దరు మేడపైకి వెళ్ళారు.

"ఇదే నా పడకగది" తలుపులు తెరిచి చూపించింది.

అది చాలా అందంగా, నీట్‌గా వుంది.

డిటెక్టివ్ ప్రభాకరన్ ఆ గదిని నిశితంగా పరికించి ఆశ్చర్యపోయాడు. ఆమె చెప్పినట్లే—పరాయివాళ్ళు గదిలోకి రావడం అంత సులభం కాదు.

"లావణ్యగారూ దయచేసి మీరు కిందికి వెళ్ళి మోహన్‌ని పంపిస్తారా?"

మోహన్‌ను ఎందుకు పిలవాలో ఆమెకు అర్థం కాకపోయినా, తను క్రిందికి వెళ్ళి మోహన్‌ను పైకి పంపిం

చింది.

"మిస్టర్ మోహన్, ఈ కేసును త్వరగా తేల్చాలంటే-మీ సహకారం అవసరం. నేనడిగిన ఒక ప్రశ్నకు మీరు నిజాయితీతో సమాధానం ఇవ్వాలి. ఇస్తారుకదూ...."

మోహన్‌కు భయం వేసింది. ఏం ప్రశ్న అడుగుతాడో నని. అయినా — "తప్పకుండా! అడగండి చెప్తాను" అన్నాడు.

"పనిమనిషి మల్లమ్మను భయపెట్టి రేప్ చేసిందివరు?" బుల్లెట్‌లా వున్న ఆ ప్రశ్న విని మోహన్ ఖంగుతిన్నాడు.

"అదేమిటి? ఈ ప్రశ్న నన్నడుగుతారు. నాకెలా తెలుస్తుంది. మల్లమ్మకే తెలియాలి. అదిమాత్రం కామినీ పిశాచం ఏదో వచ్చి రేప్‌చేసి పోయేది అని చెప్పింది."

"మీరు యం.బి.బి.యస్.సి. చదువుతున్నారు కదా, మీకు కూడా దయ్యాలు, పిశాచాల మీద నమ్మకం వున్నదా."

"అస్సలు లేదు."

"ఔను కదా! మరి మల్లమ్మను ఒక మనిషే రేప్ చేసాడనేది పరమ సత్యం. అ మనిషి మీరే కదూ! మీరేం భయపడకండి! నేనెవ్వరికి చెప్పను. దయచేసి నిజం చెప్పండి. జెస్ట్ ఇటీజ్ ఫర్ ఇన్‌ఫర్‌మేషన్."

"మీరు వూహించింది కరక్టే! మల్లమ్మ మా వంట గదిలో పడుకునేది. దానికి తలుపు లేదు. కాబట్టి తేలిగ్గా నేనాగదిలోకి వెళ్ళగలిగే వాడిని. తనను అనుభవించింది దయ్యం కాదు—మనిషే, అది నేనేనని మల్లమ్మకూ తెలుసునని నా అనుమానం. ఎందుకంటే—అది దయ్యంతో స్వేచ్ఛగా మాట్లాడ్డానికి ప్రయత్నించేది. కానీ—దయ్యానికే భయమేసి — మాట్లాడకుండా వూరుకునేది దానికెక్కడో మంచి గిరాకీ తగిలి వెళ్ళిపోయింది. లేకపోతే—

అది మా ఇంట్లోనే వుండేదేమో? కానీ—మా అక్కయ్య విషయంలో యిలా జరగడానికి ఎంతమాత్రం వీల్లేదు సార్!" అన్నాడు మోహన్.

డిటెక్టివ్ ప్రభాకరన్ అంతా విని సాలోచనగా తల పంకించాడు.

4

మునుపటిలాగా లావణ్యను కలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు నవీన్. ప్రతి రోజూ సాయంత్రం లావణ్యతో కలిసి తిరిగే నవీన్ ఆ యింటి ఛాయలకే రావడం మానేసాడు. లావణ్య తనతో ప్రేమ నటిస్తూ— అక్రమ సంబంధాల ద్వారా గర్భం తెచ్చుకున్నదని అతను గట్టిగా నమ్ముతున్నాడు.

తనకు ఎంతో సన్నిహితుడని తాను అనుకుంటున్న నవీన్ తనను అసహ్యించుకుంటాడని ఆమె వూహించలేదు. అయినా అతనికి తన నిర్దోషిత్వాన్ని తెలియజేయాలనుకున్నది.

నాలుగు గంటలకు కాలేజీ నుండి నవీన్‌కోసం పత్రికా కార్యాలయానికి ఫోన్ చేసింది.

నవీన్ ఫోన్ ఎత్తాడు.

"హలో, నేను లావణ్యను మాట్లాడుతున్నాను. నవీనేనా?"

"యస్....చెప్పు!" నిర్లిప్తంగా వుంది అతని గొంతు.

ఇంతకు మునుపు లావణ్య ఫోన్ చేసిందంటే—అతనికి వెయ్యి ఏనుగుల బలమొచ్చినట్లు అనిపించేది. ఇప్పుడతను దానికి పూర్తిగా విరుద్ధమైన స్థితిలో వున్నాడు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. సాయంత్రం 5 గం॥లకు పబ్లిక్ గార్డెన్స్‌కు రాగలవా?"

అతను నిరాసక్తతగానే — "వస్తాను" అని ఒప్పుకున్నాడు.

సాయంత్రం అయిదు గంటలు.

పబ్లిక్ గార్డెన్‌లో ఎప్పుడూ వాళ్ళు కూర్చునే ఒక ఘంటపానికి సమీపంలో వున్న పూలపొదల దగ్గర నవీన్ రాకకై ఎదురుచూస్తూ కూర్చుంది లావణ్య.

పావుగంట లేటుగా వచ్చాడు నవీన్.

"ఐయామ్ సో సారీ! ఆలస్యమైంది ..." అంటూ వచ్చి ఆమెకు సమీపంలో కూర్చున్నాడు.

"ఫర్వాలేదు" అంది లావణ్య.

కొద్ది నిముషాలు వారి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

"నేను అక్రమ సంబంధాలు పెట్టుకొని గర్భం తెచ్చుకున్నానని నువ్వు భావిస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. నా అనుమానం నిజమేనా?" స్పష్టంగా అడిగింది.

అతను సమాధానం చెప్పడానికి కాస్సేపు సంశయించి-

"నిస్సందేహంగా .... నీకున్న అసంఖ్యాకమైన బాయ్ ఫ్రెండ్స్‌తోనో—లేకపోతే మీ ఇంట్లో తిరిగే దయ్యంతోనో నువ్వు కడుపు తెచ్చుకున్నావు. ఏది ఏమైనా నిన్ను మనస్ఫూర్తిగా స్వీకరించాలంటే- నా అంతరాత్మ ఒప్పుకోవడం లేదు. నువ్వంటే నాకు అసహ్యమేస్తోంది. నువ్వొక మోసగత్తెవు.

నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ— ఇప్పుడు నాకా ఉద్దేశం లేదు. కారణం—దయ్యంవల్లనైతేనేమి, మనిషివల్లనైతేనేమి, నువ్వు చెడిపోయావు. ఆ పాపభారం నీ కడుపులో పెరుగుతోంది. నువ్వు నాతో స్నేహం చేయాలని ఆశించకు. నేనూ నీ స్నేహం ఆశించను...." అంటూ వడివడిగా అడుగులేస్తూ స్కూటర్

పార్క్ చేసి వున్నవైపు వెళ్ళాడు.

నవీన్ విసిరిన మాటల ఈటెలతో ఆమె హృదయం వెయ్యి వ్రక్కలయింది.

తనకు జరిగిన అన్యాయానికి సానుభూతి వాక్యాలు పలికి—చెయ్యని పాపానికి శిక్ష అనుభవిస్తున్న తనను తప్పక ఆదరిస్తాడని నమ్మిన లావణ్యకు ఆశాభంగమైనది.

అప్పటి వరకు పొదలమాటున పొంచి వుండి వాళ్ళ మాటలను వింటున్న ప్రభాకర్ నవీన్ వెళ్ళిపోవడం గమనించి—పొదల్లోంచి బయటికొచ్చాడు. డిటెక్టివ్ ప్రభాకరన్ పొదలమాటున వున్న విషయం లావణ్యకు తెలుసు. ఇద్దరు ప్లాన్‌గా నవీన్‌ను పబ్లిక్ గార్డెన్‌కు ఆహ్వానించారు.

"చూశారా సార్! అతను నే నంటే యెంత అసహ్యం పెంచుకున్నాడో—దీనికంతటికి కారణం నా కొచ్చిన ఈ మాయదారి గర్భమే!"

ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

"అఖండ మేధావి అయిన మిమ్మల్నే యిలాంటి గడ్డు పరిస్థితికి లోనుచేసాడంటే—నేరస్థుడు అసలు మనిషేనా అని నాకూ అనుమానమేస్తుంది.... వాడు మనిషైనా దయ్యమైనా వారం రోజుల్లోగా మీ ముందుంచుతాను. మీరేమి భయపడకండి! బై దిబై—మీకు డైరీ వ్రాసే అలవాటుందా?"

లావణ్య కళ్ళు తుడుచుకొని—"యస్! నేను డైరీ వ్రాస్తువుంటాను" అన్నది.

"మీకు అభ్యంతరం లేకపోతే మీ డైరీ ఒకసారి యిస్తారా?"

"ఓ తప్పకుండా!"

"అయితే పదండి...."

పార్కులో ఓ ప్రక్కకు పార్కుచేసి వున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ వైపు నడిచారు ఇద్దరు.

5

నవీన్ తల్లిదండ్రులు అతనికి పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టి ఒక లక్షాధికారి సంబంధాన్ని ఖాయం చేసారని డిటెక్టివ్ ప్రభాకర్ తెలుసుకున్నాడు.

ఆయన పేరు కోటేశ్వర్రావు. అనేక వ్యాపార సంస్థలకు యజమాని. ఆయనకు వున్న ఒక్కగా నొక్క కూతురు వనజను నవీన్‌కు యిచ్చి పెళ్ళి చేయడానికి ఒప్పుకున్నాడు.

వనజ గురించి అన్ని విషయాలు ఎంక్వయిరీ చేసాడాయన. ఆమె ఒట్టి తిరుగుబోతు. ఒకసారి ఎవరివల్లనో గర్భం తెచ్చుకొని—ఎబార్షన్ కూడా చేయించుకుందని ఎంక్వయిరీలో తేలింది.

అయినా వనజను వివాహ మాడటానికి నవీన్ ఒప్పుకున్నాడంటే — అందుకు కారణం ఆమె గతజీవితం గురించి అతనికి ఏమీ తెలియకపోవడమేనని—అర్థం చేసుకున్నాడు.

6

లావణ్య డైరీని క్షుణ్ణంగా ఫాలో అయిన డిటెక్టివ్ ప్రభాకరన్‌కు కేసు కొంచెం అర్థమైనది. అసలు వాస్తవాన్ని బయట పడెయ్యాలంటే ఏం చేయాలో అతనికి అర్థమైనది.

వెంటనే ఆయన లావణ్యకు ఫోన్‌చేసి—తన కార్యాలయానికి పిలిపించాడు. వాళ్ళిద్దరూ కలిసి—ఒక హిప్నాటిస్టును సంప్రదించారు. ఆయన పేరు ప్రొఫెసర్ రామరాజు.

ప్రొఫెసర్ రామరాజు డిటెక్టివ్ ప్రభాకరన్‌ను సాదరంగా ఆహ్వానించాడు.

"చెప్పండి! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ!" ప్రొ.రామరాజు హుషారుగా అడిగాడు.

"నా క్లయింట్ మిస్ లావణ్య తనకు ఏ పాప పుణ్యాలు తెలియకుండానే గర్భవతి అయింది. ఐ మీన్ ఆమె యింత వరకు పురుష సంపర్కం ఎరుగదు. అయినా ఆమె గర్భవతి అయింది."

"ఇదెలా సాధ్యం! ఆమెకు ఎవరైనా మత్తుమందు యిచ్చి యీ పాపానికి ఒడిగట్టి వుంటారు."

"నో! అలాంటి అవకాశంలేదు. ఆమె పడకగదిలోకి యితరులు ఆమెకు తెలియకుండా వచ్చే అవకాశంలేదు. గత ఆరునెలలుగా ఆమె తన పడకగదిలో తప్పించి - ఇతరత్రా నిద్రించలేదు అని తెలియజేసింది."

"ఈ విషయములో నేను ఏమి చేయగలను" ప్రొ. రామరాజుకు విషయం అర్థంకాలేదు.

"మరేమీలేదు. ఆమెను హిప్నటైజు చేసి ఈ రహస్యం ఆమె ద్వారానే వెలిగక్కించాలి. తనకు జరిగిన సెక్సు అనుభవము ఆమె యిప్పుడు మనకు చెప్పలేకపోయినా-ఆమె అంతఃచేతనంలో భద్రంగా రికార్డు అయివుంటుంది. దాన్ని మనం వెలికితీయాలి!"

ప్రొఫెసర్ రామరాజు ముఖం ఆనందంగా వెలిగింది. "యువార్ కరెక్టు! యిది పూర్తిగా సంభవమే!" అన్నాడు.

"అయితే-ఆ కార్యక్రమమేదో మీరు దయచేసి మొదలుపెట్టండి!" అంటూ సిగెరెట్ వెలిగించాడు

లావణ్యను లైటింగ్ ఏర్పాటుచేసి వున్న ఒక ప్రత్యేకమైన గదిలోకి తీసికెళ్ళారు.

ఆ గదిలో—చాలా కంఫర్ట్‌బుల్‌గా వున్న ఒక కుర్చీలో ఆమెను కూర్చోబెట్టాడు. ఆమె ముఖం మీద వెయ్యి ఓల్టుల విద్యుత్ బల్బు వెలుతురును ఫోకస్ చేశాడు.

"లావణ్యగారు! మీరు గట్టిగా క్రమంగా వూపిరి పీల్చండి.... ఇదిగో యిలా ... అలా ఓ పది నిముషాలపాటు మీరు చేయవలసి వుంటుంది. మీరు హిప్నాసిస్‌లోకి వెళ్లాలంటే నేను యిచ్చే సూచనలు తూ.చ. తప్పకుండా పాటించవలసి వుంటుంది. ఒక్క సూచనను కూడా పాటించక వదిలేసారా-మీరు హిప్నటైజ్ కాలేరు. మీరు హిప్నాసిస్‌లోకి వెళ్ళడానికి నేను సహాయపడుతుంటాను అంతే! మీరు నా సూచనలను పాటించకుండా లేదా హిప్నాసిస్‌లోకి వెళ్ళకూడదని భీష్మించుక కూర్చున్నారనుకోండి.... నేను మిమ్మల్ని హిప్నాసిస్‌లోకి తీసుకెళ్ళలేను. సో.... నేను చెప్పే సజెషన్స్ మీరు పాటిస్తారని నేను ఆశిస్తున్నాను ..."

"తప్పకుండా.... నా చెవులను మీ సూచన కొరకే అప్పగించి కూర్చుంటాను. సరేనా?" అని నవ్వింది లావణ్య.

"అలా అన్నారు బావుంది...." అని ప్రొ. రామరాజు నవ్వాడు.

క్రమంగా ఆమె ముఖంమీద వేసిన కాంతివంతమైన వెలుగును తగ్గించి—జీరో వోల్టు వెలుగును ప్రసరింప జేసాడు.

ఆమె క్రమమైన పద్ధతిలో వేగంగా వూపిరి తీసుకొంటోంది.

ప్రొ. రామరాజు ఆమెకు సూచనలు ఇవ్వడం మొదలు పెట్టాడు.

"యువార్ ఇన్ డీప్ స్టేట్ ఆఫ్ రిలాక్షేషన్....యు వార్... ఇన్... డీప్ స్టేట్ ఆఫ్ రిలాక్షేషన్....యువార్ ఇన్....డీప్ స్టేట్ ఆఫ్ రిలాక్షేషన్....డీప్....డీప్....డీప్" అంటూ పెద్దగా శృతిబద్ధంగా రాగం తీయడం మొదలు పెట్టాడు.

"మీరు ఎంతో హాయిగా....సుఖంగా....ప్రశాంతంగా వున్నారు....మీ మనసులో ఏ బాధలూ....భయాలు లేవు. స్వర్గంలో వున్నంత సుఖంగా వున్నారు. హాయిగా వున్నారు. హా....యిగా వున్నారు. మీరు హా....యిగా వున్నారు.

"మీ కళ్ళు మూతలు పడుతున్నాయి. మీరు గాఢంగా నిద్రపోతారు. మీ రెప్పలమీద చెప్పలేనంత బరువు పడు తోంది....మీరు సుఖనిద్రలో వున్నారు"

ఆశ్చర్యం!

ఆమె కళ్ళు మూసుకొని గాఢంగా నిద్రపోతోంది.

"ప్రభాకరన్‌గారూ! ఆమె చెప్పే మాటలు దయచేసి రికార్డు చేయండి!" ప్రొ. రామరాజు టేపురికార్డర్‌ను ఆయనకు అందించాడు.

ఆయన టేపు ఆన్‌చేసి కూర్చున్నాడు.

"లావణ్యగారూ....3 నెలల క్రితం మిమ్మల్ని ఒక వ్యక్తి రేప్‌చేసాడు. ఆ వ్యక్తి ఎవరో మీరు చెప్తారు. మీ మనసు 3 నెలల క్రితం జరిగిన సంఘటనల వెంట పరి గెడుతోంది. మీ జ్ఞాపకాలు 3 నెలల క్రితం జరిగిన సంఘ టనలను చూస్తున్నాయి. మిమ్మల్ని రేప్ చేసిన వ్యక్తి పేరు చెప్పుతారు" అదే పదాన్ని ఆయన పలుమార్లు సూచించా డామెకు.

"రామరాజుగారు! అయాం సారీ 3 నెలల క్రితం నేను ఎవరితోనూ రేప్ చెయబడలేదు. ఎటువంటి అత్యాచారమూ నాపై జరగలేదు...." ఆమె మాటలు స్లోగా భారంగా ఉన్నాయి.

డిటెక్టివ్ ప్రభాకరన్ అవాక్కయ్యాడు. మరి ఈవిడకు గర్భం ఎలా వచ్చిందో ఆయనకు అర్థంకాలేదు.

"3 నెలల క్రితం కాకపోతే_4 లేక 5 లేక అంతకు ఎక్కువే కావొచ్చు—కానీ, మీపై అత్యాచారం జరిగింది. తత్ఫలితంగా గర్భవతి అయ్యారు."

"గర్భవతి అయిన మాట వాస్తవమే! కానీ—నాపై అత్యాచారం జరగలేదు...." నొక్కి చెప్తోంది.

ఈ సారి ప్రొ. రామరాజు కూడా ఆశ్చర్యపోయాడు.

ఆయనకు ఏం చేయాలో కాస్సేపటి వరకు అర్థం కాలేదు. అంతలోనే ఆయనకు ఒక అయిడియా మెరిపింది.

"లావణ్యగారూ....మీరు 3 లేక 4 నెలల క్రితం....ఒక అత్యంత మధురమైన అనుభూతికి లొంగిపోయారు. ఆ అనుభూతి మీ జీవితంలో మొదటిసారి చవిచూసారు. మీరు ఆ రోజు పరవశించి పోయారు గుర్తుందా?"

"యస్! ఉంది!!"

"అయితే, వెంటనే ఆ ఘట్టాన్ని వర్ణించండి."

"నాకు సిగ్గేస్తోంది!"

"సిగ్గేసినా ఫర్వాలేదు చెప్పండి!"

"నాకు అత్యంత ప్రియుడు, నా మనసు దోచుకున్న వాడు నవీన్ సరదాగా హిప్నాటిజం నేర్చుకున్నాడు. ఆ రోజు ఉదయం నవీన్ బర్త్‌డే! నన్నొక్కదాన్నే ఆహ్వానించాడు. మేమిద్దరం అతని గదిలో చాలాసేపు కబుర్లు

చెప్పుకున్నాం. అతను నన్ను హిప్నాసిస్‌లోకి తీసుకెళ్తా నన్నాడు. నేను ఒప్పుకున్నాను. కొద్దిసేపట్లోనే నేను హిప్నాసిస్‌లోకి వెళ్ళిపోయాను.

అతను నవ్వుతూ యిది మన శోభనం రాత్రి ...ఇది మన శోభనం రాత్రి అంటూ అతను నాకు సజెషన్స్ యిచ్చాడు. ఆ రోజు మేము ఆనందంగా శోభనం రాత్రి గడిపాము ...మన శోభన రాత్రి గురించి నువ్వు మరిచి పోతావు. నీ కెప్పుడూ గుర్తుండదు. నాకు మళ్ళీ సజెషన్స్ యిచ్చాడు. రెండు గంటల తర్వాత నేను హిప్నాసిస్‌లో నుంచి బయటికి తెప్పించబడ్డాను. 3 నెలల తర్వాత నా జీవితంలో ఎదురైన అత్యంత మధురమైన అనుభూతి అదే....''అని ముగించింది.

లావణ్య యింకా కళ్ళు మూసుకొనే కూర్చొని వుంది.

ఆశ్చర్యంతో ఆమె మాటలు వింటున్న వాళ్ళిద్దరి కళ్లు పెద్దయ్యాయి.

డిటెక్టివ్ ప్రభాకరన్ టేప్‌రికార్డర్ ఆఫ్ చేశాడు.

ప్రొ. రామరాజు లావణ్యను హిప్నాసిస్‌లో నుంచి వాస్తవ జగత్తులోకి తెప్పించాడు.

7

కోర్టుహాలు జనంతో క్రిక్కిరిసి వుంది. జడ్జీగారు తన జడ్జిమెంటును ఈ విధంగా ముగించారు—

''ముద్దాయి నవీన్ ధరఖాస్తుదారురాలు లావణ్యను హిప్నాసిస్‌లోకి తీసుకెళ్ళి రేప్ చేసాడని—సాక్ష్యాధారలతో ప్రాసిక్యూషన్ వారు నిరూపించినందున, ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 376 ప్రకారం నేరస్థుడు నవీన్‌కు 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించడమైనది.'' □

కౌన్సిలరు బాబా

ఏ.వి. మోహన్

'చందనగిరి' అనే ఊరు చిన్నదే అయినా, రాజావారికి మాత్రం పాడుబడ్డ పెద్దకోట వుంది. వెనుకవైపు పూర్వీకుల సమాధులున్నాయి. రాజాగారి ఆస్థి మొత్తం హారతి కర్పూరంలా హరించుకుపోయింది. తలమునక అప్పులు మాత్రం మిగిలాయి.

రాజా రమేష్‌చంద్ర అవివాహితుడు. వయస్సు ముప్పై దాటివుంటుంది. దర్జాలు తగ్గించుకోడం చేతకాక, వెలిగించడం వీలుకాక, గత నాలుగైదు సంవత్సరాల నుంచి సతమతమయిపోతూన్నాడు.

ప్రతి సంవత్సరం ఏప్రియల్ నెలలో, ఆయన పాత స్నేహితులంతా ఆ కోటలో పోగయి, విందులు, వినోదాల్లో, తేలియాడుతూండడం పరిపాటి. ఈ సంవత్సరం కూడా చాలామంది వచ్చేశారు అప్పుడే. రావలసింది ఒక్క రామచంద్ర మాత్రమే. అతను రాజాగారికి స్వయాన మేనల్లుడు. అస్తమానం, అల్లరి చెయ్యడం, జోకులు వెయ్యడం, అందర్నీ నవ్వించడం అతని హాబీ.

అతని రాకకోసం అంతా ఆతృతగా ఎదురు చూడసాగారు. ఆ రోజు సాయంత్రం సరిగ్గా ఆరుగంటలకు ఫియట్ కారులో వచ్చాడు రామచంద్ర. అతని వెంట ఓ అందమైన అమ్మాయి వుంది. వెనుక సీట్లోంచి కాషాయ బట్టలు కట్టుకొన్న ఆజానుబాహు విగ్రహం దిగింది.

"ఈమె నా కాబోయే భార్య తార!" అంటూ ఆ అమ్మాయిని అక్కడున్న అందరికీ పరిచయం చేశాడు రామచంద్ర. ఆ అమ్మాయి ఎవ్వరి వంక తలెత్తి చూడకుండా, రెండు చేతులూ జోడించి శిల్పసుందరిలా నిలుచుండిపోయింది.

"వీరు కాశ్మీరు బాబాగారు! నా గురువులు. హిమాలయ పర్వతాల్లో ఇరవై సంవత్సరాలు ఘోరతపస్సు చేసి, భగవద్దర్శనం పొందిన మహామహులు" అంటూ రామచంద్ర కాషాయ బట్టల్లోవున్న వ్యక్తిని పరిచయం చేశాడు. అందరు ఆయనకు వినమ్రులై సాష్టాంగ దండప్రమాణం చేశారు.

ఆ రాత్రి అందరూ భోజనాల దగ్గర చేరారు.

"మామయ్యా! ఆ బాబాగార్ని ఎందుకు పిల్చుకొచ్చానో తెలుసా?" అడిగాడు రామచంద్ర.

తెలీదన్నట్లు తల అడ్డంగా దింపి, బ్రాందీగ్లాసు తీసి నోటిదగ్గర పెట్టుకున్నాడు రమేష్‌చంద్ర.

వారికి చాలా శక్తులున్నాయి. గతించిన గతంగాని, ముందున్న భవిష్యత్తుగాని, ఆయనకు కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. నేపాల్ మహారాజుగారి అతిధిగా వారి ప్రాకారంలో దాదాపు రెండు మాసాలు వున్నారు.

తలూపుతూ వినటం తప్ప పెదవి విప్పి మాట్లాడలేదు రమేష్ చంద్ర. మిగిలిన స్నేహితులు కూడా అంతే జేశారు.

"కాశ్మీర్ రాజాగారు నన్ను వీరికి పరిచయం చేశారు." బ్రాందీ గ్లాసు క్రిందపెడుతూ చెప్పాడు రామచంద్ర.

"అసలు విషయం చెప్పు!" అన్నాడు రమేష్‌చంద్ర.

"చెప్తాను. నన్ను పరిచయం చెయ్యగానే, మేనమామ రాజా రమేష్‌చంద్రగదూ!"అంటూ అడిగారు. అవునన్నాను. ఆ తర్వాత, నీ ఆర్థిక పరిస్థితి, మానసికస్థితి, గత పది సంవత్సరాలుగా, మీరు పొందిన కష్టనష్టాలు అన్నీ ఏకరువు పెట్టారు. ఆయన చెప్పినవన్నీ నాకు తెలిసినంతవరకు నగ్న సత్యాలు కావడంతో వెంటనే వారి కాళ్ళపైన పడి మా మామయ్య కష్టాలు తీరే దారి చూపమని ప్రార్థించాను. తనను ఇక్కడకు వెంట తీసుకెళ్ళమన్నాడు. తీసుకొచ్చాను" అన్నాడు రామచంద్ర.

"మంత్రాలకు చింతకాయలు రాల్తాయా?" పూర్తిగా

మత్తెక్కి కూర్చోవడం చేతగాని, రమేష్‌చంద్ర నిరాశగా అన్నాడు.

మిగిలిన మిత్రబృందం "రాలవు!" రాలవు!! అంటూ గోలచేశారు.

ఆ రాత్రి రమేష్‌చంద్రకు బాగా పొద్దుపోయిం తర్వాత కాస్త మైకం వదిలింది. మంచం మీద అటూ యిటూ పొర్లాడు. కిటికీ గుండా దూరంగా వెన్నెల్లో మెరుస్తూ కనిపించిన సమాధులవైపు చూశాడు. అలా తదేకంగా చూస్తూ అఖండ భోగాలు అనుభవించిన తన తాత తండ్రులను గుర్తుకు తెచ్చుకొన్నాడు.

అంతలో అతను కళ్ళకు దూరంగా సమాధుల వెనుక వేపు ఏదో మానవాకారం కదులుతూ కనుపించింది. కళ్ళు చిట్లించుకుని చూశాడు. ఆ ఆకారం తెల్లటి బట్టలు తొడుక్కొని వున్నట్లు తోచింది. మొహం కనుపించకుండా, నల్లటి జుట్టు ముందుకు విరబోసుకొని వుందేమోననిపించింది. తన కళ్ళను, తన స్థితిని తనే నమ్మలేక ఒకమారు గట్టిగా కళ్ళు మూసుకొని, రెండు చేతుల్తో రుద్దుకుని, ఆ పైన తెరచి చూశాడు. అంతకు ముందు చూచిన దృశ్యం అలాగే వ్రేలాడదీసిన ఫొటోలా వుంది.

రమేష్‌చంద్ర మంచం దిగి, చెప్పులు తొడుక్కొని, గోడకు తగిలించివున్న రైఫిల్ తీసుకొని, క్రిందకు బయలుదేరాడు. వడివడిగా నడుస్తూ సమాధుల దగ్గరకు చేరుకున్నాడు.

అక్కడ అంతా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది. వెనుకనున్న చెట్లలోకి చూశాడు. ఎవ్వరూ కనపడలేదు. ఏదో భ్రాంతిలోనో, తాగిన మత్తులోనో, ఎవర్నో చూచి

నట్లు, అనిపించి వుంటుందని తన్ను తనే సర్ది చెప్పు కున్నాడు. తిరిగి వెనక్కి వెళ్ళి పడుకున్నాడు.

2

తెల్లవారింది.

రమేష్‌చంద్ర, రామచంద్ర, అతని స్నేహితులు, తార, అంతా టిఫిన్లు చేసేందుకు కిందకు దిగారు. డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు.

వంటవాడు వేడి వేడి ఇడ్లీలు పింగాణీ ప్లేట్లలో తెచ్చి పెట్టాడు.

"బాబాగారు నిద్ర లేచారా?" అడిగాడు రమేష్‌చంద్ర.

"ఆఁ! వారి పూజ పునస్కారాలు కూడా పూర్తయి నాయి. నేను వెళ్ళి చూసొచ్చాను" అన్నాడు రామచంద్ర.

"వారు ప్రొద్దున పూట ఏం తీసుకుంటారు?"

"అరటిపండ్లు, తేనే, పాలు ..తార వెళ్ళి యిచ్చి వచ్చింది" అంటూ. "మిమ్మల్నోకమారు రమ్మన్నారట!" చెప్పాడు రామచంద్ర.

"నన్నా? ఎందుకు?" తారవైపు చూసి అడిగాడు.

"ఏమో? నాకు చెప్పలేదు. రాజాగారు తీరిగ్గా వుంటే ఓసారి రమ్మని చెప్పు! అన్నారు" అంది తార.

రమేష్‌చంద్ర కాఫీ త్రాగి, తిన్నగా బాబాగారి గదికి వెళ్ళారు. పులితోలుపైన కూర్చుని వున్నారు వారు. కళ్ళు మూసుకొని ధ్యానంలో నిమగ్నమై వున్న బాబా ముందు కూర్చుని దగ్గారు రాజాగారు.

"స్వాగతం! రాజాగారికి సుస్వాగతం!!" కళ్ళు తెరవ కుండానే అన్నారు బాబాగారు.

"మీ వసతి, సౌకర్యాలు సరిగా వున్నాయా?" అడిగాడు రాజాగారు.

"ఊఁ" అన్నారు బాబాగారు.

"రమ్మని కబురు చేశారట!"

"ఆఁ! రాత్రి నీ కళ్ళకు కనుపించిన దృశ్యం గుర్తు వుందా."

"ఏ దృశ్యం స్వామీ?"

"అదే అందమైన ఒక ఆడదయ్యం జుట్టు విరబోసుకుని మీ తాతగారి సమాధి చుట్టూ తిరుగుతూ, ఎగురుతున్న దృశ్యం!"

"అది నా భ్రాంతిగా భావించాను. రైఫిల్ తీసుకుని క్రిందకు వెళ్ళాను. అక్కడ నాకేమీ కనుపించకపోవడంతో వెనక్కి తిరిగి వచ్చాను" అన్నాడు రమేష్‌చంద్ర.

"తెలుసు! నా మనో నేత్రంతో నేనంతా గమనిస్తూనే వున్నాను."

"ఎవరిదా దయ్యం?"

"మీ తాతగారు చనిపోతూ, మీ తండ్రిగారిని ఒక వరం కోరారు!" అంటూ కళ్ళు తెరిచారు బాబాగారు.

"ఏమిటా వరం?"

"ఆ నాటికి మీ సంస్థానంలో ఖజానాలో వున్న వజ్ర వైఢూర్యాలు, నగలు, నాణ్యాలు మొత్తం నాలుగు మట్టి కుండల్లో బెట్టి, మూతలు కట్టి, భూమిలో పూడ్చి, వాటిపైన తన శవాన్ని వుంచిన పేటికను పెట్టి, భూ స్థాపితం చెయ్యాలని. మీ తండ్రిగారు అందుకు అంగీకరించి అలానే చేశారు. మీ సంస్థానానికి, ఆర్థికమైన ఇబ్బందులు అప్పట్నుంచే ప్రారంభమయ్యాయి" అన్నాడు బాబాగారు.

"మరి ఆదదయ్యం ఎందుకు తిరుగుతుంది?" అడిగాడు రమేష్‌చంద్ర.

"అది మా తాతగారి రెండవ భార్యది. ఆమె నిశ్చింతగా చనిపోయింది. తన సవతి వారసులు ఎవరన్నా త్రవ్వి, ఆ నిధిని కాజేస్తారేమోనన్న భయంతో, అసూయతో అలా కాపలా కాస్తూ వుంటుంది. ఆ దయ్యాన్ని హతం చేస్తే తప్ప నీకా నిధి దక్కదు. అది దక్కితే నీ దరిద్రం మొత్తం తీరిపోతుంది. మళ్ళీ నాలుగు తరాలు రాజాధిరాజుల్లా బ్రతకొచ్చు" అన్నాడు బాబాగారు.

"దయ్యాన్ని చంపటమా?" అడిగాడు రమేష్‌చంద్ర విస్మయంగా.

"దయ్యాల్ని చంపనవసరం లేదు. అవి ఎప్పుడో చచ్చిపోయినవే! కానీ వాటి ఆత్మలు, పరమాత్మలు ఏకంగాకుండా, గాలిలో తిరుగుతుంటాయి. ఆమె శవానికున్న పేటికను సరిగా బిగించలేదు. అందువల్లే యిలా రోజూ వెలుపలికి వచ్చి విహరించగలుగుతుంది. ఈ రాత్రికి, ఆమె సమాధిని తవ్వి, పేటికను గమనించి చూడు. అందులోని శవం, జీవం వున్న మనిషిలా వుంటుంది. వెంటనే తలుపు మూసి, లావుపాటి చీల పెట్టెమధ్య పెట్టి శవం శరీరం గుండా దిగేట్లు చూడు. ఆ దయ్యం యిక వెలుపలికి రాదు" అన్నాడు బాబాగారు.

"అలాచేస్తే నిజంగా ఆ దయ్యం యికతిరగదంటారా?"

"ఈ బాబా మాటలు వ్యర్ధంగావు. చేసి చూడు. ఆ తర్వాత మీ తాతగారి సమాధి క్రిందనున్న నిధిని త్రవ్వి తీసుకో. అందులోనుంచి మాకు కొంత వెచ్చించి, చిన్న ఆశ్రమం కట్టించు" అన్నాడు బాబా.

"అలాగే!" అంటూ తలూపాడు రమేష్‌చంద్ర.

"ఈ విషయం నీకూ, నాకూ తప్ప మరెవ్వరికీ తెలియ నివ్వకు. ఈ కార్యక్రమం మొత్తం నీ చేతిపైనే జరగాలి. అన్యుల సాయం ఉపేక్షించకు" బోధించారు బాబాగారు.

"చిత్తం!" అంటూ వారికి పాదాభివందనం చేసి, శెలవు తీసుకొని, వెలుపలికొచ్చాడు రమేష్‌చంద్ర.

3

హాల్లో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్న రామచంద్ర "మామయ్యా!" అంటూ పిలిచాడు. అతని ప్రక్కనే ఉంది తార.

"ఏమిటీ?" అడిగాడు రమేష్‌చంద్ర.

"ఏంలేదు. బాబాగారు ఎందుకు పిలిచారు?" అడిగాడు రామచంద్ర.

"ఊరికే పిలిచారు."

"అబద్ధం! నా దగ్గర ఏదో దాస్తున్నావ్. నా సాయం ఏమైనా కావాల్సి వుంటే చెప్పు!"

"ఏంలేదు!" అంటూ వడివడిగా తన గదిలోకి వెళ్ళిపోయాడు రమేష్‌చంద్ర. ఆ రాత్రికి కావలసిన సాధనలన్నీ సమకూర్చుకోవడంలోనే మునిగిపోయాడు. మధ్యాహ్నం భోజనాల దగ్గర కూడా కలవలేదు.

కటిక చీకటి కమ్ముకుంది.

రమేష్‌చంద్ర గడియారంకేసి చూసుకున్నాడు. పన్నెండు దాటి పదినిముషాలైంది.

గదిలో లైటార్పి, మంచం క్రింద పెట్టుకున్న లావుపాటి సుత్తి, గడ్డపార, లావుపాటి పొడవైన చీలలు

నాలుగు, తీసుకుని మెల్లిగా వెలుపలకు వచ్చాడు. తన్నెవరూ చూడడం లేదని, నిర్ధారించుకుని, మెట్లుదిగి క్రిందకొచ్చి, సందువేపు గదులు దాటుకొంటూ కోట వెలుపలకొచ్చాడు. అక్కడ్నించి సమాధులు అరఫర్లాంగు దూరం వున్నాయి.

రమేష్‌చంద్ర అడుగులో అడుగు వేసుకుంటూ అక్కడకు వెళ్ళాడు.

జేబులోని సెన్‌టార్చి వెలిగించి చూశాడు. తన తాత గారి రెండోభార్య సమాధి మొత్తం త్రవ్వివుంది. శవ పేటిక పైకి కనబడుతూ వుంది. ఆశ్చర్యపోవడం అతని వంతయింది.

మెల్లిగా శవపేటిక చుట్టూ లైటు వెలిగించి చూశాడు. ఎక్కడా చీలలు కొట్టిన జాడలు లేవు. మెల్లిగా కూర్చుని, తలుపు పైకి నెట్టాడు. తెల్లటి చీరలో వున్న ఆకారం కనుపించింది. జుట్టు మొహంమీద పడివుంది. అంతకు ముందు రాత్రి చూసిన ఆకారం ఎత్తు, లావు, శవపేటికలోవున్న ఆకారానికి సరిపోయినట్లైంది.

లైటు వెలుగులో ఆ ఆకారానికేసి తదేకంగా చూడ సాగాడు. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ, ఉచ్ఛ్వాస నిశ్వాసాల జోరు వినిపించసాగింది. ఇంక ఆలస్యం చెయ్యకుండా తన పనులు చకచక కానిచ్చాడు.

అరగంట తర్వాత తిరిగి బంగళాలోకి వచ్చాడు.

4

తెల్లవారాక అంతా డైనింగ్ టేబుల్ ముందు చేరారు. వంటవాడు ఉప్మా కొబ్బరి పచ్చడి తెచ్చి పెట్టాడు.

"మామయ్యా! ఏమిటి రాత్రి నిద్ర లేనట్లుంది" అడిగాడు రామచంద్ర.

"ఎవరికి నాకా? నీకా?"

"మీకే!"

"అందరూ వచ్చారు! తార రాలేదేం?" అడిగాడు రమేష్ చంద్ర.

"మొద్దు నిద్రలో వుందేమో?" అన్నాడు రామచంద్ర.

"చూపిరా పో!" అన్నాడు రమేష్ చంద్ర.

రామచంద్ర లేచి వెళ్ళి, చూసి తిరిగొచ్చి "ఎక్కడా కనిపించడంలేదు. ఏమయిందో? నాతో చెప్పకుండా రాత్రి వెళ్ళిపోయిందేమో?" అన్నాడు.

"ఎక్కడికి?"

"వాళ్ళ ఊరికి."

"అంత అర్జంటుగానా?"

"తిక్కమనిషి. ఎప్పుడు ఏం చేస్తుందో, ఎందుకు చేస్తుందో కూడా తెలీదు?" అన్నాడు రామచంద్ర.

వాళ్ళు మాట్లాడుతుండగానే వెలుపల జీపు ఆగిన శబ్దమైంది. అందరూ ఆశ్చర్యంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. పోలీసు యిన్స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చారు లోనికి. రమేష్‌చంద్ర వారిని ఆహ్వానించాడు.

జేబులోంచి తాళం చెవి తీసి ఇన్‌స్పెక్టర్ కిచ్చి సైగ చేశాడు. మరునిముషంలో కాశ్మీరు బాబాను పెడరెక్కలు విరిచిపెట్టుకొని తీసుకొచ్చాడు.

"ఏమిటిదంతా?" అడిగాడు రామచంద్ర.

"నాకేం తెలుసు. తారా!" అని పిలిచాడు.

తార వచ్చింది.

"చెప్పమ్మా!" అన్నాడు రమేష్‌చంద్ర.

"ఈ రామచంద్ర నన్ను క్షమించానని, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి వల్లో వేసుకొని, నా శీలం కాజేశాడు.

ఫలితంగా నేను గర్భవతి నయినాను. పెళ్ళి చేసుకొమ్మన్నాను. అలాగేనని, తన మామగారి దగ్గర బాగా డబ్బుందని, తను చెప్పినట్లు నాటకమాడితే ఆస్థంతా తమకే వస్తుందని చెప్పి, ఈ దొంగ బాబాను సృష్టించి తీసుకొచ్చాడు.

పరిచయం మొదలైంది లగాయితూ, ఈ బాబా మా రహస్యం అందరికీ చెబుతాననీ, తనకు లొంగి పొమ్మని బలవంతం చేశాడు. ఈ విషయం ఆయనకు చెప్పాను. ఆయన చంపుతానని బెదరించాడు. దాంతో పథకం మొత్తం మార్చి, నన్ను రాజాగారి చేత చంపించే ప్లాను వేశాడు. అదృష్టవశాత్తూ, ఆయన నన్ను చూపి శవం కాదనీ, బ్రతికున్న మనిషనీ, తెలుసుకొని రక్షించాడు" అంది తార.

రామచంద్ర మొఖం దించుకున్నాడు. పోలీసులు అతనికీ, బాబాకు బేడీలు తగిలించారు. □

రోగి - డాక్టర్



కట్నం వచ్చిన కేసు

కాశీభట్ల భానుమూర్తి



ఎండ నిప్పులు చెరుగుతోంది. భానుడు తన ప్రతాపాన్ని బెజవాడ పట్టణ పౌరులమీద తీవ్రంగా చూపిస్తున్నాడు. ఆ ఎర్రటి ఎండలో, ఆ నిప్పులు చెరిగే బెజవాడ పట్టణపు రోడ్డుమీద ఇద్దరు నడుస్తున్నారు. ఇద్దరంటే ఇద్దరని కాదు

ముఖ్యంగా మనకి కావలసింది ఆ ఇద్దరే: వారు ఒకరు ఓంకారం, రెండవవారు శ్రీకారంలు.

"ఇక నేను నడవలేనురా ఓంకారం, ఇందాక తాగిన ఆ బటర్ మిల్కు అప్పుడే ఆవిరి అయిపోయింది. అబ్బ ఏమి ఎండలు. ఈ ఎండలో మనం పోస్టలు డిపార్టుమెంటు వారు తప్ప ఎవరూ కనబడటంలేదు" అన్నాడు శ్రీకారం.

"అవునురా మనపని ఆ పోస్టలు డిపార్టుమెంటువారి పనిలాగే వుంది. మన బాసు చెప్పిన ఎడ్రసు పట్టుకొని ఆ ఆవకాయ, మాగాయ పచ్చళ్ళ జాడీలు ఇచ్చేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. అయినా మన బాసు పరిశోధన రావుకి బొత్తిగా బుర్రలేదురా. లేకపోతే ఏమిటి. ఇక్కడి వాళ్ళు ఏ ప్రియా పచ్చళ్ళో కొనుక్కోలేరా? తణుకునించి పంపాలా, మనని ఇలా చంపాలా" అని విసుక్కున్నాడు ఓంకారం.

"ఇచ్చే జీతం తక్కువ, చేయించుకొనేది మాత్రం గొడ్డు చాకిరీ. ఇదే గవర్నమెంటు ఉద్యోగమయితేనే ఇప్పటికి నాలుగుసార్లు సమ్మెలు చేసి నాలుగు వందలు జీతం ఎక్కువ వేయించుకొనేవారము" అన్నాడు శ్రీకారం.

"ఆ! గవర్నమెంటు అయినా: స్టేటు గవర్నమెంటు లాభం లేదురా, సెంట్రలు గవర్నమెంటు అయితే మంచిది. స్టేటు గవర్నమెంటులో అయితే 55 ఏళ్ళకే రిటైరు అయి ఒక మూల ఏ కిళ్ళీ కొట్టో పెట్టుకోవాలి. ఇప్పుడు మారిన కొత్త ప్రభుత్వం ప్రకారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదువరకు సీట్లోంచి కదలకూడదు. లంచాలు పుచ్చుకోనివ్వరు. ఇవ్వనివ్వరు. అబ్బ వద్దురా బాబు" అన్నాడు ఓంకారం.

"ఒరే! ఆగు" అని శ్రీకారం ఓంకారాన్ని తీసుకొని

కొద్ది దూరంలో వున్న కిళ్ళీ కొట్టువైపు నడిచాడు. కొట్టు వాడిని అడిగి అప్పుడే వచ్చిన అపన తీసుకొన్నాడు. అపన తీసుకోవటంచూపి పాపం ఓంకారమే డబ్బులు ఇచ్చేశాడు. ఒకరు మాసపత్రిక, మరొకరు సప్లిమెంటు పట్టుకొని ఆ కిళ్ళీకొట్టువాడు వేసిన బెంచీమీద కూర్చొన్నారు.

కాసేపటికి పుస్తకాలు మార్చుకొని అవికూడా పూర్తి చేశారు.

"అబ్బ నాలుగు నవలలు నాలుగు ఆణిముత్యాలు" అయినా ఆ ఎడిటర్‌గార్కి బొత్తిగా మనమంటే జాలిలేదు. సీరియల్ సరిగా సస్పెన్సులో ఆపేశారు. ఇక ముప్పై రోజులు ఆగాలా" అని విసుక్కొన్నాడు ఓంకారం.

"ఆ నవల్లు ఏడిసినట్టు వున్నాయి, మాసపత్రికలో కథలు వున్నాయి, అబ్బ అన్నీ నవరత్నాలు. సీరియల్ అంటే ఇలా వుండాలి" అన్నాడు శ్రీకారం.

"ఏడిశావ్! నీకు టేస్టులేదు, నవల చదివే ఓపిక లేదు" అన్నాడు ఓంకారం.

"నవ్వావ్ లేవోయి! నీకు పెద్ద టేస్టు వున్నట్టు: కథలు బాగోలేదంట. ఎక్కడో బి.సి మనిషిలా వున్నావు" అని అన్నాడు శ్రీకారం.

"ఆ! పెద్ద దిగొచ్చాడు నవతరం ప్రతినిధి" అని ఈస డించాడు ఓంకారం.

"ఆ! ఆ గొడవకేం గాని ఆనంద తాండవం అన్న కథ చూశావా! అది మనని గురించే రాసినట్టు వుంది. నా పేరు, నీ పేరు, మన బాసు పరిశోధనరావు పేరువేసి వున్నాయి" అన్నాడు శ్రీకారం.

"ఆ! అవును. నిజమే: మనం ఆ కేసుని అలాగే పరి శోధించామని ఆ రచయితకి ఎలా తెలుసు" అన్నాడు

ఓంకారం.

"మనమే డిటెక్టివ్‌ల మనుకొంటే, వాడెవడో మన కంటె పెద్ద డిటెక్టివ్‌లా వున్నాడు. పోనీలే మనకి ఫ్రీగా పుస్తకంలో పేర్లు వేసిపెడుతున్నాడు" అన్నాడు శ్రీకారం.

"అది సరేగాని, ఎంత కాలమిలా, ఆ జీతం రాళ్ళకోసం మన బాసు దగ్గర గొడ్డు చాకిరీ చేయటం, దీనికి విమోచన లేదా, మన బానిస సంకెళ్ళు తెగవా, అరుణోదయ రాగ రంజితకాంతుల్ని చూడలేమా"అని వాపోయాడు ఓంకారం.

"నా దగ్గర ఒక ప్లాను వుంది. నువ్వు నాకు సహకరిస్తానంటే మన బాసు దగ్గర నుంచి కనీసం పదివేలు కొట్టేయచ్చు" అన్నాడు శ్రీకారం.

"నా సహకారం నీకెప్పుడూ వుంటుంది. చెప్పుమా ఆ ప్లాను త్వరగా" అన్నాడు ఓంకారం.

శ్రీకారం ఓంకారం చెవిలో ఏదో 'గుసగుస' లాడాడు. ఓంకారం శ్రీకారం చెవిలో 'ఆ గుసగుస'ల తోటే సందేహాలు అడుగుకొన్నాడు

శ్రీకారం 'గుసగుస'ల తోటే సమాధానాలు చెప్పాడు. అక్కడి నుంచి ఇద్దరూ కదలి వెళ్ళిపోయారు.

* * *

"బాసు, బాసు ఘోరం జరిగిపోయింది, మన శ్రీకారం మనకిక లేడా, ఈ నిజం నేను భరించలేను. భరించి జీవించలేను, జీవించి సుఖించలేను" అని వాపోయాడు ఓంకారం.

"లయబద్ధంగా ఏడవటం ఆపి, ఏమి జరిగిందో చెప్పి ఏడువు!" అని విసుక్కున్నాడు పరిశోధనరావు.

"నా నోటితో చెప్పలేను, ఈ కాగితం చూడండి" అని ఒక కాగితం ఇచ్చాడు పరిశోధనరావుకి ఓంకారం.

అందులో "మీ ప్రియ అసిస్టెంటు ఘనత వహించిన

శ్రీకారం మా చేతిలో బందీ అయ్యాడు. అతన్ని నువ్వు మళ్ళీ చూడాలంటె, పదిహేను వేల రూపాయలు ఒక పెట్టెలో పెట్టుకొని ఈ రోజు మధ్యాహ్నము మూడు గంటలకి తణుకు పాత బస్‌స్టాండ్ షెడ్‌లో పెట్టాలి, ఆ వెంటనే ఆ ఎదురుగా వున్న కిళ్ళీకొట్టులో నుంచి మీ శ్రీకారం బయటికి వస్తాడు. పిచ్చి వేషాలు వేసినా, పోలీసులకు చెప్పినా "మీ శ్రీకారానికి నూకలు లేనట్లే" అని వుంది.

అది చదివి పరిశోధనరావు పిడికిళ్ళు బిగుసుకొన్నాయి.

"బాసు, మన శ్రీకారాన్ని పదిహేను వేలు పోయినా సరే విడిపించుకోవాలి" అని తొందర పెట్టసాగాడు ఓంకారం.

"సరే" అని చెప్పి ఒక బ్రీఫ్ కేసులో పదిహేనువేల రూపాయలు సర్దుకొని బయలుదేరారు పరిశోధనరావు, ఓంకారంలు.

* * *

మూడు దాటింది. మరొక గంట గడిచింది, మరొక గంట గడిచింది శ్రీకారం జాడలేదు.

పరిశోధనరావు విసిగిపోయాడు. "వీడెవడో రైల్వేలో ఇంజను డ్రైవరు అయింటాడు మనని హెచ్చరించినవాడు. వాడు అన్న టైము దాటి రెండు గంటలైనా మన వాడు రాలేదు. ఇక నాకు ఓపిక లేదు "పోదాం నడు" అన్నాడు పరిశోధనరావు.

"తొందర పడకండి బాసు; తొందరపడి ఒక నిండు జీవితాన్ని బలి ఇవ్వకండి, తొందరపడి తీసుకొన్న నిర్ణయాలు ఫలితానివ్వవు" అని స్మృతిలో పరిశోధనరావుని ఏడిపించసాగాడు ఓంకారం.

"ఆపు! నీ వెధవ ఏడుపు: మూడు గంటలకి వస్తానన్న ఈ వెధవ ఐదు అయినా అయిపులేడు. పోనీ మన శ్రీకారా

న్నయినా వదలలేదు. ఇలాంటి వెధవకి ఏ స్కూల్లో అయినా మధ్యాహ్న భోజనం పెట్టించాలి, అదే సరైన శిక్ష" అన్నాడు పరిశోధనరావు.

"అంత తీవ్ర శిక్ష వేయకండి. నన్ను అడిగితే ఉరిశిక్ష వేసే వాళ్ళకి ఆ ఉరిశిక్ష ఆపేసి, ఏ పాఠశాలలో నయినా మధ్యాహ్నం భోజనం పెట్టించాలి, దెబ్బకి చచ్చి ఊరుకొంటాడు. అంత పెద్ద శిక్ష ఆ వెధవకి వేయకండి. మన శ్రీకారాన్ని చూసి ఊరుకోండి" అన్నాడు ఓంకారం.

"లాభం లేదు. ఇక నన్ను నువ్వు బుకాయించలేవు ఓంకారం. నీ నాటకం తెలిసిపోయింది. నన్ను వెధవని చేసి డబ్బు లాగుదామనుకొన్నారా మీ రిద్దరు. నాకు తెలుసు మీ ప్లాను. ఎలా తెలుసా అని ఆశ్చర్యపోతున్నావా; మీ ఇద్దరి గుస గుసలు మీరు అపన కొన్న కిళ్ళీకొట్టువాడు విని, డిటెక్టివ్ కథలు చదివి, చదివి ఉత్సాహము పట్టలేక నాకు ఫోను చేశాడు. కాని అసలు మీ ప్లానులో నిజం తెలుసు కొందామని నీ కూడా వచ్చాను. ఏడి ఆ శ్రీకారం" అని గర్జించాడు పరిశోధనరావు.

"క్షమించండి బాసు. ఆ కిళ్ళీకొట్టువాడు సిగరెట్లు అవీ అమ్ముకోక, ఇంతకి తెగిస్తాడని కల్లో కూడా అనుకోలేదు. మన శ్రీకారం మూడింటికే ఇక్కడికి రావాలి. మరి ఏమయ్యాడో" అన్నాడు ఓంకారం.

"సరే వస్తే వాడే వస్తాడులే, పద" అని ఓంకారాన్ని తీసుకొని పరిశోధనరావు ఆఫీసుకి వచ్చేశాడు.

వీళ్ళు ఆఫీసులో అడుగుపెట్టగానే ఫోను మ్రోగింది. ఎత్తి అవతలి మాటలు విన్న పరిశోధనరావు మొహం ఎర్రబడింది. ఫోను టక్కున పెట్టేశాడు.

"ఏమిటి బాసు?" అన్నాడు ఓంకారం.

"ఏముంది? మనవాడు యెవరో ఆడపిల్లని అల్లరి చేశాడట! ఆ అమ్మాయి వాళ్ళ నాన్న అతన్ని చితకతన్ని పోలీసులకి అప్ప చెప్పాడట. ఎస్.ఐ. ముకుందరావు ఫోను చేశాడు. అతన్ని బెయిలుమీద విడిపించుకోమని," అని చెప్పాడు పరిశోధనరావు.

ఇద్దరూ పోలీసుస్టేషనుకి వెళ్ళి శ్రీకారాన్ని విడిపించుకొని వచ్చారు.

బతిమిలాడినమీదట శ్రీకారం ఇలా చెప్పాడు.

"పాత బస్టేండులో నుంచుని విసుగుపుట్టి ఎదురుగా ఉన్న వెంకటేశ్వరా టాకీసులో బలిదానం పిల్మ్సు పెట్టాడుగా చూద్దామని అలా వెళ్ళాడట. అక్కడ ఎవరో అందమైన అమ్మాయి కనబడగానే దానివెనక పడ్డాడట. అతను ఆ తొందరలో ఆ అమ్మాయి వెనక వున్న వాళ్ళ నాన్న రావు గోపాలరావుని చూడలేదట. అతను చితక తన్ని పోలీసు స్టేషన్లో పడేశాడట" అని వివరించాడు శ్రీకారం.

"ఛీ! ఛీ! మన డిటెక్టివ్ ఏజెన్సీకే చెడ్డపేరు తెచ్చావు. దేశంలో యింతమంది డిటెక్టివ్‌లు వున్నారు. వాళ్ళు యెవరైనా ఇలా చేశారా, హత్యలు పరిశోధించాల్సిన మనం ఆడవాళ్ళ వెనక పడొచ్చా. అయినా జీతం ఇచ్చి పోషిస్తున్న నన్నే వెన్నుపోటు పొడుస్తారా" అని రంకెలు వేశాడు పరిశోధనరావు.

"క్షమించండి బాసు" అని ఓంకారం, శ్రీకారంలు పరిశోధనరావు కాళ్ళు పట్టుకొన్నారు.

"సరే వదలండి, ఈ కేసులో ఫీజు లేదుగాని: ఖర్చు మటుకు అయింది. ఫీజులేని కేసు పరిశోధించిన డిటెక్టివ్‌లు ఎవరూ ఉన్నట్టు నేను వినలేదు. ఈ కేసులో ఫీజులేదు సరి కాదుగదా, చెడ్డపేరు వచ్చింది" అని చిరాకుపడ్డాడు పరి

శోధనరావు.

"ఇంతలో ఫోను మోగింది."

వెధవ ఫోను ఒకటి శుభానికి అశుభానికి ఒకేలా మోగు తుంది, ఇప్పుడేమయ్యిందో" అని సందేహంగానే ఫోను తీశాడు.

అవతల శ్రీకారాన్ని చితక తన్నిన రావుగోపాలరావు గారు మాట్లాడసాగారు.

"సారు క్షమించండి, మీ అసిస్టెంటు అని తెలీక నేను చితక తన్నాను. నా కున్నది ఒక్కగాని ఒక్క కూతురు, ఆ అమ్మాయి పేరు కుసుమ లెండి, మీవాడిని మొదటి చూపు లోనే ప్రేమించిందట.

నేను ఈ ఆస్థి అంతా దానికోసమే సంపాదించాను. దాని ఇష్టప్రకారమే మీ అసిస్టెంటుతో వివాహము జరుపుదామను కొంటున్నాను. ఎస్సై ముకుందరావుగారు 'మన శ్రీకారా నికి తల్లితండ్రి లేరని' చెప్పారు. కనుక మీకు నేను కట్నం కింద పదివేలు ఇద్దామనుకొంటున్నాను. మిగిలిన వివరాలు రేపు మాట్లాడతాను స్వయంగా" అని ఫోను పెట్టేశాడు.

పరిశోధనరావు తేరుకొని శ్రీకారాన్ని గాల్లో గిరగిర తిప్పేస్తూ అసలు విషయం చెప్పాడు.

శ్రీకారానికి నోట మాటలేదు. ఆనందంతో డాన్సు చేయసాగాడు. ఓంకారం కుళ్ళుకోసాగాడు.

"ఫీజే కట్నంరూపంలో వచ్చింది....కట్నమే ఫీజుగా వచ్చింది....కట్నం వచ్చిన కేసు, ఆహా....ఓహో...." అని డాన్సు చేస్తూ అరవసాగాడు పరిశోధనరావు. బాసుతో శృతి కలిపాడు చివరకు ఓంకారం కూడా. □

MRN. ప్రసాదరావు

హోషిమా కౌజిల్

డిటెక్టివ్ రాజా త్రికాజిల్స్ సిగరెట్టు ముట్టించుకుని పొగ రింగులుగా వదిలాడు.

గింగిరాలు తిరుగుతూ ముందుకు వెళ్ళిన రింగులోంచి రామారావు ముఖం తమాషాగా కనిపించింది. రామారావు రాజా స్నేహితుడు. దేశంలోని ఒక ముఖ్య పత్రికకు

సంపాదకుడు.

"ఊఁ! చెప్పరా రామూ! తరవాత ఏమయింది!"— అడిగాడు రాజు.

రామారావుకూడా సిగరెట్టు ముట్టించుకుని, రెండు నిముషాల సేపు మౌనంగా వున్న తరవాత, గొంతు సవరించుకున్నాడు.

"వారం రోజుల క్రితం కోహిమా ప్రాంతం నుంచి నాకో తమాషా అయిన ఉత్తరం వచ్చింది" — ఆగాడు రామారావు.

"కోహిమా అంటే నాగలాండ్ లోనిది కదూ? అది సరే ఏమిటా తమాషా అయిన ఉత్తరం?"అడిగాడు రాజా.

"ఉత్తమకుమార్ అనే కోటీశ్వరుడు ఒకాయన బొంబాయిలో వుండడం ఇష్టంలేక, కోహిమా పర్వతాల ప్రాంతంలో స్వంత భవనం ఒకటి కట్టుకుని కాలం గడుపుతున్నాడు. భార్యా పిల్లలు లేరు. బ్రహ్మచారి. ఇదుగో ఆయన ఉత్తరం. చదువు"—అంటూ పొడగాటి కవరొకటి తీసి, డిటెక్టివ్ రాజా చేతికి ఇచ్చాడు.

ఉత్తరం విప్పాడు. అందమయిన అక్షరాలు.

"ఎడిటర్‌జీ! నా పరిచయాన్ని పై పేజీలోనే వ్రాశాను. ఇక అసలు సంగతి ఏమిటంటే, మా కోహిమా నుంచి ఉత్తర దిశగా అయిదు మైళ్ళు వెళ్ళితే మూడొందల ఏళ్ళ నాటి పాడుబడ్డ కాజెల్ (కోట) ఒకటి వున్నది. పొకప్పుడు కోహిమా ప్రభువులు నివసించిన కోట అది. ఇప్పుడు దాంట్లో గబ్బిలాలూ, నక్కలూ, తప్ప ఎవరూ లేరు. అది చాలా భయంకర ప్రదేశమని విన్నాను. అందులో దాదాపు మూడు నెలలుగా—ఆ కోట ప్రాంతంలో దెయ్యం ఒకటి తిరుగుతోంది. ఇద్దరు ముగ్గురు చనిపోవడం కూడా జరి

గింది దానివల్ల.

మొన్నొక రోజు నేను పర్వత ప్రాంతాల్లోకి షికారు కెళ్ళాను. ఎంతసేపు తిరిగినా రెండు కుందేళ్ళు తప్ప మరే జంతువూ దొరకలేదు నాకు.

బాగా అలిసిపోయిన నేను, కోహిమా కాజెల్‌కు కొంత దూరంలో ఒక పెద్ద రాయి నీడన పడుకున్నాను. ఎంత సేపు పడుకున్నానో తెలీదు. ఏదో పెద్ద చప్పుడు నా నిద్రకు భంగం కలిగించింది. ఉలిక్కిపడి లేచాను.

చుట్టూ గాఢాంధకారం. ఏమీ కనిపించలేదు. కానీ మరో నిముషంలోనే వెలుగొచ్చింది. అది వెన్నెల రాత్రి. చంద్రుడు అప్పుడప్పుడూ కారు మేఘాల చాటుకు తప్పుకుంటూ లోకాన్ని చీకటి చేస్తున్నాడు. గడియారం వైపు చూసుకున్నాను. రాత్రి రెండున్నర చూపింది నా రేడియం డైల్. ఎన్నడూ లేంది అంతసేపు పడుకున్నందుకు ఆశ్చర్యపోతూ లేచి నిలుచోబోయాను.

"దబ్, దబ్, దబ్"—ఏదో అతి బరువైన ప్రాణి వేస్తున్నట్టుగా అడుగుల చప్పుడు....ఆశ్చర్యపోతూ లేచి కూర్చుని రాయి చాటునుంచి చూశాను ముందుకు. బహూశా, ఏ పులో ఏనుగో అనుకున్నాను.

కాదు!

ఎవరో మనిషి!! ఆరడుగుల ఎత్తున్నాడు, అదొక రకమైన నల్లటి లాంగ్‌కోటు వేసుకున్నాడు. కోటు లోపల వేసుకున్న షర్ట్‌కూడా నలుపురంగుదే. పూర్తి నలుపులో తలా చేతులు మటుకే వెన్నెల వెలుగులో అస్పష్టంగా కన్పిస్తోంది.

ఎవరతను?

ఇంతరాత్రిపూట కోహిమా కాజెల్ వైపు వస్తున్న

దెవరా? అని ఆశ్చర్యంగా చూడసాగాను. అతను మరో రెండు నిముషాల్లో నాకు దగ్గరయ్యాడు.

అతి ప్రకాశవంతమయిన వెన్నెల వెలుగులో ఆయన ముఖం స్పష్టంగా కనిపించింది.

నా గుండెల్లో ఆటంబాంబులు కురిసాయి.

అతను మాక్డొనాల్డ్!

ఇది ఎలా సాధ్యం? రెండు సంవత్సరాల క్రితం చని పోయాడతను. అతను నాకు స్నేహితుడు కూడా.

అయితే! మాక్డొనాల్డ్ ముఖంలో చాలా మార్పులు వచ్చి నట్టు అనిపించింది. ముఖం తెల్లగా ఫెయిడ్ అయినట్టుగా వుంది. వెంట్రుకలు పీచులా గాలికి చిందర వందరగా ఎగురుతొన్నాయి. నాలుగు పళ్ళకు అటు ప్రక్కా, ఇటు ప్రక్కా రెండు పళ్ళు పొడుగ్గా వున్నా ఎందుకో మొత్తానికి కాస్త భయంకరంగా వున్నాడు.

చచ్చిన మనిషి బ్రతకడం ఎలా సాధ్యం? అంతకు ముందు కూడా, ఇద్దరు ముగ్గురు చనిపోయిన మనుషుల్ని వాళ్ళు దెయ్యాలుగా మారిం తరవాత కోహిమా ప్రజలు చూశారు. ముందు ఆ మాటలన్నీ కట్టుకథలనుకున్నాను. కానీ నాకు మాక్డొనాల్డ్‌ను చూస్తోంటే — దెయ్యాలంటే నమ్మకం లేని నాకు, దెయ్యాలపైన నమ్మకం కలిగింది. చూస్తుండగానే విసురుగా మాక్డొనాల్డ్ నా ముందునుంచి కోహిమా కాజెల్‌లోకి వెళ్ళిపోయాడు.

నేను చాలా ప్రమాద భరితమైన ప్రాంతాల్లో అంత రాత్రి వున్నానని గుర్తుకు వచ్చి, వణికిపోయాను.

మెల్లగా రాళ్ళను చాటు చేసుకుంటూ నానా ప్రయాసలు పడి ఇంటికి చేరుకోగలిగాను. ఇలాంటి ప్రమాదభరితమైన ప్రాంతాల పైన ప్రభుత్వం చర్య తీసుకోవాలి. ప్రజల్లోని

భయాందోళనలను దూరం చేయాలి.

అందుకే—మన ఇండియన్ క్లారియోన్ పత్రికకు నా ఈ ఉత్తరం పంపుతున్నాను.

గమనిస్తారనే ఆశతో—
మీ, ఉత్తమ కుమార్."

ఉత్తరాన్ని చదవడం పూర్తిచేసిన డిటెక్టివ్ రాజా ఆశ్చర్యపోయాడు.

కొన్ని హర్రోర్ కాజెల్స్ ఇంగ్లండులో ఫ్రాన్స్‌లో వున్నమాట నిజమే, కానీ భరత ఖండంలో కూడా అలాంటి కాజెల్ వుందని వినడం ఇది మొదటిసారి.

త్రికాజిల్స్ చివరికంతా కాలిపోయి వ్రేళ్ళు భగ్గు మన్నాయి.

సిగరెట్టు ఆష్ట్రేలో పడేసి, రామారావు వైపు చూశాడు రాజా.

"ఈ ఉత్తరాన్ని ప్రభుత్వానికి చూపించాను. చర్యలు తీసుకుంటాం అన్నారు. అయినా యే పోలీసు ఆఫీసరూ కోహిమా వెళ్ళలేదు ఇంతవరకూ. రెండు రోజుల క్రితం మరొక వ్యక్తి చంపబడ్డాడు. అతని చావుకు కూడా దెయ్యాలే కారణం అనుకున్నారు" — చెప్పాడు రామారావు.

"రామూ! ఇంతకూ నువ్వు చెప్పొచ్చేది నన్ను కోహిమా వెళ్ళమంటావ్, అవునా?" నవ్వుతూ అడిగాడు రాజా.

యస్! నువ్వెళ్ళి చూడాలి."

"ఒరేయ్, ప్రభుత్వం చర్య తీసుకుంటానని అన్నప్పుడు ఇంకా నేనెందుకు వెళ్ళడం!" మరో సిగరెట్టు వెలిగించు కుంటూ అన్నాడు రాజా.

"రాజా! అదికాదు. నా తరపున వెళ్ళాలి నువ్వు. ఈ హర్రోర్ మిష్టరీ ఏమిటో తెలుసుకోవాలి. కోహిమాలో నా స్నేహితుడు ఫెర్రాస్ వున్నాడు. అతను అమెరికన్. నీకు కావలసిన సహాయం చేస్తాడు. అతనికి టెలిగ్రాం ఇస్తాను" అన్నాడు రామారావు.

"ఓరి నీ దుంపతెగ. అన్ని ఏర్పాట్లూ—చేసే వచ్చావన్న మాట" నవ్వుతూ అన్నాడు రాజా.

2

మరో రెండు రోజుల్లో అస్సాం చేరుకున్నాడు రాజా.

కోహిమాకు హైవే రూట్ బాగానే వుంది. డిటెక్టివ్ రాజా ఆష్టిన్ కారు నాలుగు గంటల ప్రయాణంతో లుమ్డిన్గ్ నుంచి కోహిమాకు చేరుకుంది. అంత కష్టపడకుండానే ఫెర్రాస్ వున్న భవనం దొరికింది.

సాయంత్రం నాలుగున్నర గంటలవుతోంది. అయినా వింటర్‌సిజన్ కావడంవల్ల పూర్తిగా మబ్బులుపట్టి తమాషా అయిన అనుభూతులు కలిగిస్తోంది. అందులోనూ విపరీతంగా మంచు కురుస్తోంది.

డిటెక్టివ్ రాజా కారు డోర్ మూసి గుమ్మం దగ్గరికి వచ్చి కాలింగ్ బెల్ నొక్కాడు. మరో రెండు నిముషాల్లో తలుపు తెరుచుకుంది.

అందం! ఆకర్షణా, కళ్ళు మిరుమిట్లు గొలిపే వెన్నెల లాంటి అమ్మాయి తలుపు తెరిచింది. పందొమ్మిది వుంటుందేమో వయస్సు. అమెరికన్, కళ్ళు నీలి రంగులో మెరుస్తున్నాయి.

ఆమెకూడా రాజా అందానికి ముగ్ధురాలై, కొన్ని క్షణాల పాటు రెప్పలు కొట్టడం మరిచిపోయి అలాగే చూస్తూ వుండిపోయింది.

"ఫెరాస్ వున్నారా మేడమ్?" అందమైన ఆమె కళ్లల్లో తన కళ్ళు కలిపి అడిగాడు రాజా.

"యస్! ఇదే" — అంటూ ప్రక్కకు తప్పుకుంది. రాజా లోపలకు అడుగు పెట్టాడు. చలి శరీరాన్ని కొరుక్కు తింటుంది.

"కూర్చోండి" అన్నదా అమ్మాయి.

రాజా సోఫాలో కూర్చున్నాడు. ఫైర్ విండో నుంచి వెచ్చగా మంట తగలగానే హాయిగా ఫీలయ్యాడు రాజా.

"ఫెరాస్ బయటి కెళ్ళారా?" అడిగాడు రాజా.

"లేదు. వున్నాను. ఎవరు మీరు?" కంచులా ఖంగున మ్రోగింది కంఠం.

రాజా వెనక్కు తిరిగి చూశాడు.

ఆరడుగుల పొడవుతో బలమైన మనిషి రాజా దగ్గరగా వచ్చాడు.

రాజా లేచి "గ్లాడ్ టు సీ యూ మిష్టర్ ఫెరాస్" అన్నాడు.

"హోయ్! వెరీ గ్లాడ్ టు మీట్ యు యంగ్ డిటెక్టివ్ రాజా! రామారావ్ రాసిందాన్ని మీరే అనుకుంటున్నాను రాజని. అవునా?" అన్నాడు నవ్వుతూ.

"యస్!"—అన్నాడు రాజా.

"అండ్ మీట్ మై డాటర్ రోజ్!" అని. "రోజ్, దిసీజ్ మిష్టర్ రాజా!"—అంటూ ఆ అందమయిన అమ్మాయిని రాజాకూ, అమ్మాయికి రాజాను పరిచయం చేశాడు. కరచాలనాలు అయింతరవాత, అందరూ టిఫిన్లు పుచ్చుకున్నారు.

"ఉత్తమకుమార్ మన రామారావుకు రాసిన ఉత్తరం పైన మీ అభిప్రాయం ఏమిటి?"—అడిగాడు రాజా త్రికా

జిల్ప్ ముట్టించుకుని.

"సరిగ్గా చెప్పాలంటే ఉత్తమకుమార్ పైన నాకు సరియైన అభిప్రాయం లేదు. ఓవర్‌గా త్రాగుతాడు. భార్యా పిల్లలు లేరు. చెడు తిరుగుళ్ళు తిరుగుతాడు ఎక్కువగా. త్రాగిన నిశాలో అతను అబద్ధం రాసి వుండవచ్చు" అన్నాడు ఫెరాస్.

"మరి ఇంతకు ముందూ, మొన్న మొన్న కొంత మంది చనిపోయారని విన్నాను?" అన్నాడు రాజా.

"అవి నేను నమ్మను. చనిపోయిన మాట నిజమే— అయినా ఈ ప్రాంతాల్లో క్రూరజంతువులు ఎక్కువ. వాటి వల్ల మరణించి వుండవచ్చు. అయినా ఈ ఇరవయ్యో శతాబ్దంలో దెయ్యాలేమిటీ, దేవుళ్ళేమిటీ"—నిర్లక్ష్యంగా అని, పెదవులు విరిచాడు ఫెరాస్.

"ఈ ఊర్లో ఏ డాక్టర్ సర్టిఫై చేశాడు శవాల తరపున?" అడిగాడు రాజా.

"డాక్టర్ బసంత్‌రాయ్!" చెప్పింది రోజ్.

"సరే, మరో మారు కలుసుకుంటాను మిమ్మల్ని"— అంటూ లేచాడు రాజా.

"నో! నో! అదేమిటి? మీరు మా అతిథులు. మా ఇంట్లోనే వుండండి"—అన్నాడు ఫెరాస్.

"అవును ప్లీజ్!" అంది రోజ్.

మీ అభిమానానికి నా కృతజ్ఞతలు. క్షమించాలి. నా ఇన్వెష్టిగేషన్‌లో ఏ రాత్రో, పగలో తిరుగుతూ వుంటాను నేను. మిమ్మల్ని డిస్టర్బ్ చేయుటం ఇష్టం లేదు. బలవంతం చెయ్యవద్దు" అన్నాడు రాజా.

ఫెరాస్, రోజ్ మాట్లాడలేదు. కానీ రోజ్ కళ్ళల్లో మటుకు ఏదో భావం కనిపించింది.

3

"చనిపోయిన ప్రతి వ్యక్తి మెడపైనా రెండు పంటి గుర్తులున్నాయి.

అవి మనుషులవో, జంతువులవో చెప్పలేను. ఆపరేట్ చెయ్యడానికి కోహిమా ప్రజలు ఒప్పుకోలేదు"—అన్నాడు డాక్టరు బసంత్‌రాయ్.

"హర్రోర్ కాప్టెల్ గురించి మీ అభిప్రాయం"—అడిగాడు రాజా.

"నాకు దేవుడిపైనా, దెయ్యాలపైనా నమ్మకం ఎక్కువ" అన్నాడు డాక్టర్.

రాజా నవ్వుకున్నాడు. పెర్రాస్‌ది, డాక్టర్‌దీ ఉత్తర దక్షిణ ధృవాలు.

అక్కడి నుంచి డిటెక్టివ్ రాజా నేరుగా తను దిగిన హోటల్ నికేతన్‌కు వచ్చాడు. అది చాలా చిన్న లాడ్జింగ్ హోటల్. దానికి షిమాహీ అనే వృద్ధురాలు యజమానురాలు. ఆమె టిబెటియన్.

"ఏం బాబూ! నువ్వేం చేస్తావని అందరూ నా ప్రాణాలు కొరుక్కు తింటున్నారు. కోహిమా ఎందుకు వచ్చినట్టు?" అడిగింది షిమాహీ.

రాజా చిరునవ్వు నవ్వి, పత్రికా విలేఖరిని. అవును గానీండి. ఇక్కడంతా దెయ్యాల గురించి చెప్పుకుంటున్నారు. మీకేమైనా తెలుసా?" అడిగాడు రాజా.

బెదరిపోయింది షిమాహీ. అంత చలిలో కూడా ఆమెకు ముచ్చెమటలు పోశాయి.

"వద్దు బాబూ వద్దు! నాకు వాటిని గూర్చి గుర్తుకు చెయ్యొద్దు" అంటూ గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

దెయ్యాలంటే అంత భయమా! అనుకున్నాడు రాజా.

"ఆమె అలా భయపడడానికి కారణం వుంది"—

గిరుక్కున వెనక్కి తిరిగాడు రాజా. రోజ్!

"హలో సర్! షిమాహీ భర్త అందరూ దెయ్యం అనుకునే—ఆ దెయ్యం వల్ల మరణించాడు"—అన్నది రోజ్.

రాజా ఆశ్చర్యపోయాడు. తరవాత కొంతసేపు రోజ్ రాజాతో మాట్లాడి వెళ్ళిపోయింది.

రాత్రి రెండు గంటలయింది. ఏదో పుస్తకం చదువుతూ నిద్రబోయాడు రాజా.

"టక్! టక్!! టక్!!!"

ఏదో చప్పుడు! చెక్క మెట్ల దగ్గర. తలగడ క్రింది రివాల్వర్ చేతుల్లోకి తీసుకుని లేచాడు. రూంలో జీరో వాల్ట్ బల్బు వెలుగుతోంది. మంచం మెల్లగా దిగి అడుగులో అడుగు వేసుకుంటూ తలుపు తెరిచి ఒక్కసారి రివాల్వర్ గురిపెట్టి బయటికి వచ్చాడు.

శూన్యం!

ఏమీలేదు. మరి అడుగుల చప్పుడు ఎలా వచ్చింది? మళ్ళీ వినిపించింది అదే చప్పుడు. గబగబా పరుగెత్తాడు రాజా అటువైపు. అయినా ఏమీ కనిపించలేదు.

4

"బహుశా, కుంటి మనిషై వుండాలి. ఒకటి చెక్క కాలు."—విషయమంతా ఫెర్రాస్‌కు రోజ్‌కూ చెప్పాడు రాజా.

వాళ్ళు ఆశ్చర్యంగా విన్నారు. "చెక్క కాలంటే షిమాహీ భర్తదికూడా చెక్క కాలే మరి. అతను చని పోయి రెండు నెల లయింది"—అన్నాడు ఫెర్రాస్.

ఇదంతా పెద్ద మిస్టరీలా తోచింది రాజాకు.

"ఉత్తమకుమార్‌ని కలుసుకున్నారా?" అడిగింది రోజ్.

"వెళ్ళాను. ఎక్కడో షూటింగ్‌లో ఉన్నాట్ట. వాళ్ళ సర్వెంట్ చెప్పాడు" అన్నాడు రాజా.

"లేదు. వచ్చేశాడు. ఉదయం చూశాను నేను. నాకూ ఇంట్రెస్టింగ్‌గా వుంది. ఉత్తమకుమార్ దగ్గరికి వెళదాం పదండి" అన్నాడు ఫెర్రాస్. రోజ్ ఇంటి దగ్గరే వుండి పోయింది. ఫెర్రాస్, రాజా అయిదు నిముషాల ప్రయాణంలో ఉత్తమకుమార్ ఇంటికి చేరుకున్నారు.

"సారీ! నేనా విషయంలో పొరపాటు పడ్డాను" అన్నాడు ఉత్తమకుమార్.

రాజా ఆశ్చర్యపోయాడు.

"అంటే...."—ఇంకేదో అనబోయాడు ఫెర్రాస్.

"అవును. నాకు దెయ్యాలపై నమ్మకం లేదు"—చాలా ముక్తసరిగా మాట్లాడాడు. మాటల మధ్యలో దగ్గు వచ్చింది ఉత్తమకుమార్‌కు. "సారీ"—అంటూ ఉమ్మేయడానికి బయటికి వెళ్ళి మళ్ళీవచ్చాడు. రాజాకు మటుకు ఉత్తమకుమార్ అబద్ధం ఆడుతున్నాడని అనిపించింది.

మరో రెండు నిముషాలు మాట్లాడి ఫెర్రాస్ రాజా కారు దగ్గరికి వచ్చారు. రాజా స్టీరింగ్ ముందు కూర్చోగానే టూల్‌బాక్స్‌పైకి పరుగెత్తింది. అది తెరిచివుంది. రాజా కనుబొమ్మలు ముడిపడ్డాయి. లోపల ఏదో కాగితం వుంది. టూల్‌బాక్స్ మూసి ముందుకు పరుగెత్తించాడు కారును. ఫెర్రాస్‌ను ఆయన యింటిదగ్గర విడిచిపెట్టి హోటల్ నికేతన్‌కు వెళ్ళాడు. టూల్‌బాక్స్ తెరిచి లోపలున్న కాగితం తెరిచాడు.

అది ఉత్తరం.

"రాజాగారూ! ఫెరాస్ ముందు చెప్పగూడని రహస్యాలు కొన్ని వున్నాయి.

అందుకని కోహిమా కాస్టెల్ దగ్గరికి రండి. మోడువారిన చెట్టొకటి వున్నదక్కడ. ఆ ప్రక్కనే పెద్ద రాయి. అక్కడ కాచుకుని కూర్చుంటాను మీ కోసం. మీకు అక్కడో అద్భుతం చూపిస్తాను. రాత్రి ఎనిమిదిన్నర గంటలకు రండి.

మీ—ఉత్తమకుమార్."

చదవడం పూర్తిచేసిన తరువాత కొన్ని క్షణాలపాటు మౌనంగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు.

5

రాత్రి ఏడు నలభై నిముషాలకు డిటెక్టివ్ రాజా కోహిమా కాజెల్‌వైపు బయలుదేరాడు. మంచు విపరీతంగా కురుస్తోంది. వెన్నెల వెలుగులో మంచు రిఫ్లెక్టయి పట్ట పగలులా కనిపిస్తోంది.

కారు ఆపి క్రిందికి దిగాడు. యాభై అడుగుల దూరంలో వుంది కోహిమా కాస్టెల్.

కాలినడకన బయలుదేరాడు రాజా. మరో పది అడుగుల దూరంలో మోడువారిన చెట్టు కనిపించింది. అక్కడ పెద్ద రాయి ప్రక్కన ఉండివుండాలి ఉత్తమకుమార్.

డిటెక్టివ్ రాజా గబగబా నడవడం ప్రారంభించాడు. గాలి విపరీతంగా వీస్తోంది. చీకటిగా వుంది రాయి ప్రక్కన.

రాజా పెన్‌టార్చి వెలిగించాడు. ఉత్తమకుమార్ కూర్చుని వున్నాడు. రాజానే చూస్తున్నాడు దీర్ఘంగా. రాజా దగ్గిరికి వెళ్ళాడు. అలాగే రెప్పలేయకుండా చూస్తు

న్నాడు రాజాను.

"సారీ కొంచెం లేటయింది"—అన్నాడు రాజా. అయినా ఏమీ మాట్లాడలేదు ఉత్తమకుమార్.

రాజా ఆశ్చర్యపోతూ భుజంపైన చెయ్యి వేశాడు. కూర్చున్న మనిషి రాజా చెయ్యిపడగానే వుండలా క్రిందికి దొర్లాడు. "మైగాడ్!" అదిరిపడ్డాడు రాజా.

6

రాజా తల్లో సుడిగుండాలు చెలరేగుతున్నాయి.

ఏదో ముఖ్యమైన విషయం చెబుతానన్నాడు ఉత్తమ కుమార్. అంతకన్నా ముఖ్యమైనా, అద్భుతమైన దృశ్యం చూపుతానన్నాడు. ఏమిటది?

ఉత్తమకుమార్‌ని యెవరు చంపారు? నిజంగా దెయ్యాలున్నాయా? తనూ చూశాడు శవం మెడపైన రెండు పంటి గుర్తులున్నాయి.

అలా ఆలోచిస్తూనే పడుకున్నాడు రాజా. దిగ్గున లేచాడు వున్నట్టుండి.

టక్! టక్!! టక్!!!

అదే చప్పుడు. ఒకటి చెక్కకాలు. షిమాహీ చనిపోయిన భర్త! ఏమయినా సరే ఈసారి విడువగూడదు అనుకున్నాడు రాజా. రివాల్వర్‌కి సైలెన్సర్ అమర్చి పెన్ టార్చితో చప్పడు వస్తున్నవైపు బయలుదేరాడు.

హోటల్ నుంచి బయటికి వచ్చాడు. క్షణ క్షణానికా చప్పుడు దూరమవుతోంది. అలాగే వెంటబడ్డాడు. పదిహేను నిముషాలు ప్రయాణించిన తరువాత చప్పుడు ఒకచోట ఆగిపోయింది. టార్చితో చుట్టూ ఫోకస్ చేశాడు. అది శ్మశానం! అడుగుల చప్పుడు ఆగిపోయిన చోట ఫోకస్‌చేసి చూశాడు. అది సమాధి.

అంతే! రాజా తలపైన బలమైన దెబ్బ పడింది. అనుకోని ఈ సంఘటనకు రాజా బిత్తరపోయాడు. జరిగిందేమిటో తెలుసుకునే లోపలే తెలివి తప్పి మూర్ఛపోయాడు.

ఆ ఆకారం రాజాను భుజంపైన వేసుకుని సమాధి దగ్గరగా వచ్చి మూడుమార్లు తన్నింది సమాధిని. తమాషాగా సమాధి పైకి లేచింది. ఏర్పడిన ద్వారంగుండా రాజాతోబాటు లోపలకు దిగింది. చెట్లచాటు నుంచి మరో ఆకారం మొదటి ఆకారానికి తెలీకుండా సమాధిలోకి దిగింది.

7

డిటెక్టివ్ రాజా తల విదిలించాడు. తల బరువుగా వుంది. చుట్టూ చూశాడు. ఔటాఫ్ ఫోకస్ అయినట్టు మసక మసగ్గా కనిపించింది ఆ ప్రాంతమంతా.

చుట్టూ మనుషులున్నారు. కళ్ళు నులుపుకుని చూశాడు. ఈసారి స్పష్టంగా కనుపించారంతా. ఆశ్చర్యపోయాడు.

ఫెర్రాస్, హోటల్ యజమానురాలు షిమాహీ, డాక్టర్ బసంత్‌రాయ్. చెక్క-కాలుతో వున్న షిమాహీ భర్త, వాళ్ళందరి చేతుల్లోనూ రివాల్వర్స్ వున్నాయి. అందరూ రాజావైపు గురిపెట్టారు.

కుంటికాలు కోరియాన్ రాజా దగ్గరగా వచ్చాడు రివాల్వర్ ముందుకి చాపి. అప్పుడు చూశాడు రాజా కోరియాన్ వైపు. అదిరిపడ్డాడు.

ఇది నిజమా?! ఆ చెయ్యి తనకు బాగా పరిచయం వున్న చెయ్యి. ఆ చెయ్యి ఎప్పుడో కాలిపోయి బొబ్బ కట్టింది. అదే కాకుండా ఆ చెయ్యికి ఆరు వ్రేళ్ళు.

తన నెవరైతే ఇంత దూరం పంపించారో అతనిదా

చెయ్యి! "రామారావ్!"—అన్నాడు రాజా.

కోరియాన్ ఆ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు. అంతలోనే భయంకరంగా నవ్వాడు.

"అవును రాజా, గుర్తుపట్టావన్నమాట? రామారావునే"—అంటూ తనేసుకున్న మేకప్ చెరిపేసుకున్నాడు. చెక్కకాలు తీసి అవతల పారవేశాడు.

"అయితే, ప్రభుత్వానికి ద్రోహం తలపెడుతున్నది నువ్వా?"—మరింత ఆశ్చర్యం కనబరుస్తూ అన్నాడు రాజా.

"అవును నేనే. ప్రభుత్వ రహస్యాలు చేరవేస్తున్న గాంగ్‌ని పట్టుకొమ్మని ప్రభుత్వం నిన్ను కోరిందని నాకు తెలుసు. కానీ నువ్వా విషయాన్ని గుప్తంగా వుంచావు. ఎవరికి తెలీదనుకున్నావు—సందేశాలు పంపడానికి మేం ఈ కోహిమా కోటను అనువుగా వాడుకుంటున్నాం. ఎవ్వరూ ఈ ప్రాంతాల్లోకి రాకుండా దెయ్యాలుగా వేషం మార్చాం. అయితే ఉత్తమకుమార్ మమ్మల్ని పసిగట్టాడు. అతన్ని తప్పించాం. నిన్ను చంపాలంటే ఎప్పుడో చంపే వాళ్ళం. కానీ నిన్ను దెయ్యం చంపినట్టుగా నిరూపించాలి. అందుకే ఇన్నాళ్ళూ ఆగాం. నువ్వూ దెయ్యం గోళ్ళతోనే చంపబడతావు."

హాలు దద్దరిల్లిపోయేలా నవ్వాడు రామారావ్.

రామారావు జేబులోంచి పొడగాటి గోళ్ళు గల గ్లోవ్స్ తీసి చేతికి తొడుక్కున్నాడు. ఫెర్రీస్, షిమాహి, డాక్టర్ బసంత్‌రాయ్ రివాల్వర్స్ పట్టుకుని రాజా చుట్టూ చేరారు.

ఎంతటి మొనగాళ్ళయినా తప్పించుకోలేని పరిస్థితి అది. రాజా నిస్సహాయంగా చూస్తూండిపోయాడు. ఒకవేళ రామారావుని గబాలున పట్టుకొని మిగతా వాళ్ళపైన గిరా

ఉద్దామన్నా వీలులేదు. చుట్టూ వున్నవాళ్ళల్లో ఎవరో ఒకరు అవలీలగా కాల్చగలరు తనని.

రామారావు భయంకరమైన చెయ్యి రాజా మెడ దగ్గరగా వచ్చింది.

రాజా కళ్ళు మూసుకున్నాడు. ప్రవీణా, వసంతా, సునీలూ, వేణూ, తల్లీ, తండ్రీ అంతా గుర్తుకు వచ్చారు.

మరో నిముషంలో రాజా మెడలో గోళ్ళు దిగుతాయనగా ఏదో గుర్ మన్న శబ్దం అయింది. పెద్దగా అరుస్తూ రామారావు గింగిరాలు తిరిగి ఎగిరి దూరం పడ్డాడు. సైలెన్సర్‌తో యెవరో కాల్చారు. బుల్లెట్ గుండెల్లోకి దిగి వెంటనే రక్తం కక్కి మరణించాడు.

"ఎవ్వరు కాల్చారు"-అందరూ అన్నారు ఒక్కసారే.

"అందరూ రివాల్వర్స్ క్రిందికి విడిచేసి చేతులెత్తి వెనక్కి తిరగండి"-స్త్రీ కంఠం ఖంగున మారుమ్రోగింది హాల్లో.

అందరితోబాటు రాజా కూడా నివ్వెరపోయాడు.

ఫెరాస్, షిమాహీ రివాల్వర్ జారవిడిచారు కానీ, బసంత్‌రాయ్ మటుకు మొండిగా రాజాను కాల్చబోయి, పెద్దగా అరుస్తూ నేల కూలాడు.

"నా రివాల్వర్ గురి తప్పలేదు ఇంతవరకూ. వెనక్కి తిరగండి"—మళ్ళీ అంది కంఠం.

మిగిలింది ఇద్దరు, ఫెరాస్, షిమాహీ.

ఈసారి వాళ్ళు తిరక్కుండానే, రాజా యెగిరి రెండు కాళ్ళతో తన్నాడు ఇద్దరినీ.

ఇద్దరూ విసురుగా వెళ్ళి గోడకు గుద్దుకుని మూర్ఛపోయారు.

మరుక్షణంలోనే ఆ ఆకారం రాజా ఎదురుగా వచ్చింది. రాజా ఆశ్చర్యపోయాడు.

"రోజ్!"—అన్నాడు.

"అవును రోజ్‌నే"—అన్నది.

"అయితే మీ నాన్నకు సాయంగా వుండక యెందుకు భారతదేశానికి సాయపడ్డారు!"

"ఈ దేశం ఉప్పు తిని ఈ దేశానికి ద్రోహం తల పెట్టడం ఇష్టంలేక."

ఆమెది ఈ దేశం కాకున్నా ఉప్పు తింటున్నాననే భావంతో తన తండ్రిని కూడా లెక్క చేయలేదు. రాజా కళ్ళు చెమర్చాయి ఆనందంతో.

[పదహారేళ్ళనాటి 'అపన' కథ]



అర్హత

జె రామలక్ష్మి

"చాలాకాలం తర్వాత కనిపించాడు శేఖరం" అన్నాడు రంగారావు ఆనందంగా.

"నువ్వు దగ్గర లేవనేకానీ నిన్ను తలచుకోని రోజంటూ వుండదనుకో—" అన్నాడు సంతోషరావు.

"మీరంతా నన్ను రోజూ తల్చుకోవడం నా కెంతో యిష్టం. అందుకే మీకు దూరంగా వుంటున్నాను. మీకు

దూరంగా అయితే వుంటున్నాను కానీ నాలో మార్పు ఏమీ లేదు—" అన్నాడు శేఖరం.

"మార్పు లేదంటే—బెట్స్ కట్టడం యింకా మాన లేదా?" రంగారావు ప్రశ్న.

"బెట్స్ కడుతున్నాను. నెగ్గుతూనూ వున్నాను—" అన్నాడు శేఖరం.

"అది చాలా ప్రమాదకరం—" అన్నాడు సంతోష రావు.

శేఖరం కట్టే బెట్సు గుర్తొచ్చినట్లున్నాయి—రంగా రావు, సంతోషరావుల యిద్దరి ముఖాల్లోనూ ఆదుర్దా కన బడింది....

శేఖరానికి ఈత రాదు. మిత్రులంతా వుండగా తను నీటిలోకి దూకేస్తాననీ—తనను తప్పక యెవరో ఒకరు రక్షిస్తారనీ పందెం కట్టాడతడు. వంద రూపాయల పందెం....

"నీకు ప్రాణాలమీద తీపి వుంటే ఈ పందేనికి తల పడకు—" అని రంగారావు చెప్పాడు. అతడికీ ఈత రాదు.

సంతోషరావుకి ఈత వచ్చును. అయితే అతడు, రంగా రావు కాక మరో ఆరుగు రున్నారక్కడ. వాళ్ళలో ఒకడు సంతోషరావుని దూరంగా తీసుకునిపోయాడు—"నువ్వు దగ్గరుంటే పందెం దెబ్బతింటుంది—" అన్నారు వాళ్ళు. వాళ్ళందరికీ ఈత వచ్చును.

"ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను మేము రక్షించం. ఏ నమ్మకంతో నీళ్ళలో దూకాలని నువ్వనుకుంటున్నదీ మాకు తెలియదు. కానీ తీరికూర్చుని ప్రాణాలు తీసుకోకు...." అన్నాడు వాళ్ళలో ఒకడు.

"నేను మానవత్వాన్ని నమ్ముతున్నాను. కళ్ళెదుట ఓ మనిషి ప్రాణాలు పోతూంటే మనిషైనవాడు ఎవడూ చూస్తూ ఊరుకోడు. ఒకవేళ అలా జరిగిందనుకోండి. అప్పుడు మానవత్వం లేని ఈ లోకంలో బ్రతకడం వృధా కదా—అందువల్ల నేను తీసుకున్న నిర్ణయం తిరుగులేనిది" అన్నాడు శేఖరం.

అదో చిన్న చెరువు. ఒడ్డున ఓ నావ వున్నది. శేఖరం, అతడి మిత్రులు తప్ప—వేరెవ్వరూ అక్కడ లేరు.

శేఖరం నావ ఎక్కాడు. అతడికి నావ నడపడం వచ్చును. అయినా మరో మిత్రుడు నావ ఎక్కాడు. మళ్ళీ నావను ఒడ్డుకు తీసుకుని రావడం కోసం.

శేఖరం నావను చెరువు మధ్యకు తీసుకుని వెళ్ళాడు.

అంతా చూస్తూండగా—"జయం శేఖరానిదే—" అని అరిచి నీళ్ళలో దూకేశాడు.

ఈ సంఘటనకు అంతా తెల్లబోయారు. అతడు తెగించి అలా దూకేస్తాడని ఎవ్వరూ అనుకోలేదు.

"కొంపదీసి వీడు ఈతకానీ నేర్చుకోలేదు కదా!" అన్నాడు స్నేహితులలో ఒకడు.

ఈలోగా శేఖరం రెండు మునకలు వేశాడు. అది నటనలాలేదు.

"లాభంలేదు. నీళ్ళలోకి దూకు—" అంటూ నావలోని మనిషిని మిత్రులు హెచ్చరించారు. ఈలోగా వాళ్ళు కూడా నీళ్ళలో దూకడానికి సిద్ధమవుతున్నారు.

"మరి పందెం సంగతి........" అన్నాడు నావలోని మనిషి.

"ఆ సంగతి తర్వాత తీరా వాడి ప్రాణాలు పోతే—మనం నేర్చుకున్న ఈతకు సార్థకత యెక్కడ....అయినా

వాడో మొండి వెధవ....ఈ సంగతి పందేనికి ముందే మనం గుర్తుంచుకోవాల్సింది....” అని విసుక్కుంటూనే నీళ్ళలోకి దూకారు.

శేఖరం రక్షించబడ్డాడు. అయితే అప్పటికే అతడు బాగా నీళ్ళు మింగేశాడు. కొంత ప్రథమ చికిత్స చేశాక- “అయితే నీకు ఈత రానిమాట నిజమన్న మాట అన్నాడతడు.

“నాకు ఈతరాని మాట నిజమే—అయితే యేం— పందెం నెగ్గాను కదా—” అన్నాడు శేఖరం.

“వాణ్ణి రక్షించకుండా వుండాల్సింది—” అన్నాడింకొకడు.

“సాధారణంగా యెవరి ప్రాణాలైనా రక్షిస్తే ప్రతిఫలం వుంటుంది. వీడి ప్రాణాలు రక్షించడంవల్ల మనమే ఎదురిచ్చుకోవలసి వస్తోంది—” అన్నాడింకొకడు.

“నీళ్ళలో మునిగిపోతూంటే మనమలా చూస్తూంటే వీడేమై పోయేవాడు?” అన్నాడింకొకడు.

“మీరేమనుకున్నప్పటికీ — తను ఈత రానప్పటికీ నిజంగా నీళ్ళలోకి దూకినప్పుడే శేఖరం పందెం నెగ్గేశాడు. వాడికి మనం వందరూపాయ లిచ్చుకోక తప్పదు. రిస్కు- తీసుకున్నది వాడే కదా....” అన్నాడు రంగారావు.

శేఖరం వంద రూపాయలు సంపాదించుకున్నాడు.

మరోసారి ఇంకో పందెం. బియ్యేలో రేపు పరీక్షలనగా అంతకు ముందురోజు రాత్రి ఓ స్నేహితుడు వచ్చి— “రేపుదయం పరీక్ష ప్రారంభమయ్యే వరకూ నువ్వింకేమీ చదువకూడదు. వందరూపాయల పందెం—” అన్నాడు.

అప్పుడు కూడా పక్కన రంగారావు, సంతోషరావు వున్నారు.

"పందరూపాల కోసం—జీవితాన్ని పణంగా పెట్టకు. ఈ పందెం వద్దు--" అని వాళ్ళిద్దరూ అతడికి సలహా యిచ్చారు.

శేఖరం వినలేదు—"ఇన్నేళ్ళు చదివినది—ఈ కొద్ది గంటలూ చదవకపోతే వ్యర్థమైపోతే-నా చదువే వ్యర్థం-" అన్నాడు.

అత డలాగే పందెంలో నెగ్గాడు. ఆ పైన పరీక్షకూడా బాగా వ్రాశాడు.

శేఖరం యిలాంటి పందేలు చాలా వేశాడు. ఇంచు మించు అన్నిట్లోనూ నెగ్గాడు. అలా నెగ్గిన కొద్దీ అతడి మొండితనం పెరిగిపోయేది. ఏ రోజు అత డెలాంటి పందెం వేసి ప్రాణం మీదకు తెచ్చుకుంటాడోనని రంగా రావు, సంతోషరావు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండే వారు.

అదంతా యిప్పుడు మిత్రులకు గుర్తుకొచ్చింది.

"నువ్వు కోస్తున్నావు" అన్నాడు రంగారావు.

"పోనీ ఈ రోజు ఏదయినా బెట్ కాద్దామా?" అన్నాడు శేఖరం.

"వద్దు!" అన్నారు మిత్రు లిద్దరూ భయంగా.

"మీ అంత చచ్చుపుటాల్ని నే నెక్కడా చూడలేదు. బెట్ వల్ల రిస్కులో పడేది నేను. మధ్య మీకు భయ మెందుకు?" అన్నాడు శేఖరం.

నీ కోసం!" అన్నాడు సంతోషరావు.

"నే నో మాట చెబుతాను. మీరేమీ అనుకోకూడదు" అన్నాడు శేఖరం. వాళ్ళిద్దరూ తలలూపాక "మీరు తప్ప యించుమించు మిగతా అందరూ నాతో బెట్సు కట్టేశారు మన మిత్రుల్లో. మీకు నా మీద అభిమానమని నేనంటే

వాళ్ళెవ్వరూ ఒప్పుకునేవారు కాదు. మీకు డబ్బు కక్కుర్తి అని వాళ్ళ అభిప్రాయం. ఒక్కసారంటే ఒక్కసారి మీరు నాతో బెట్ కట్టి ఆ అపవాదు తొలగించుకోకూడదూ" అన్నాడు.

రంగారావు నవ్వి "మా చేత బెట్ కట్టిస్తానని ఎవరితో నయినా బెట్ కట్టేవా?" అన్నాడు.

"అబ్బే! అలాంటిదేమీ లేదు. ఒక్కసారి కూడా మీరు నాతో బెట్ కట్టకపోవడంతో - నిజంగా మీకు డబ్బు కక్కుర్తి ఉన్నదేమోనన్న అనుమానం నాకూ కలుగుతోంది. ఎందుకంటే ఇంతవరకూ ఒక్క బెట్ కూడా నేను ఓడిపోలేదన్న సంగతి మీకు తెలుసు...." అన్నాడు శేఖరం.

సంతోషరావుకు పౌరుషం వచ్చింది. "వెధవ కబుర్లు చెప్పకు. నిజంగా నేను బెట్ కాశానంటే నువ్వు అపజయం రుచి చూడడం తథ్యం."

"అవునవును. అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడజాతశత్రుడే యలిగిననాడు సాగరము లన్నియు నేకము గాక పోవు" అంటూ రాగయుక్తంగా పాడి - "అని శ్రీకృష్ణు డన్నాడు కానీ ఆ ధర్మరాజు నిజంగా అలిగి సాగరాలను ఏకం చేసిన సందర్భం మహాభారతంలో ఒక్కటీ వున్నట్లు లేదు" అన్నాడు శేఖరం నవ్వుతూ.

దీంతో సంతోషరావుకి యింకా బాగా మండినట్లుంది. "సరే! అయితే బెట్ కాస్తాను-ఏదయినా సినిమాకి పోదాం పద" అన్నాడు.

2

అతడు సుమారు ఆరడుగుల ఎత్తున్నాడు. పచ్చని ఛాయ. మిలిటరీ మీసాలు. చూడగానే మనిషి ఎంతో

బాగున్నాడనిపిస్తుంది. అయినప్పటికీ అతన్ని కాక అతడి పక్కనున్న అమ్మాయినే చూడాలనిపిస్తుంది.

ఆమె గులాబి పువ్వులా మనోహరంగా వుంటే ఆమె కారణంగా అతడు గులాబి ముల్లులా వున్నాడు.

చూడగానే వాళ్ళిద్దరూ భార్యా భర్తలని అర్థమయి పోతోంది. వాళ్ళిద్దరూ ఇతరుల గురించి పట్టించుకోకుండా మహా అన్యోన్యంగా వున్నారు. వాళ్ళలోవాళ్ళు తెగ నవ్వేసుకుంటున్నారు. అదే పనిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఆ జంట చాలా బాగుంది కదూ!" అన్నాడు రంగారావు.

"అవును" అన్నాడు శేఖరం.

"ఆ జంటను చూడగానే అతడు చాలా దృఢకాయుడని గుర్తుకు వస్తూంది కదూ!" అన్నాడు సంతోషరావు.

"వాడి సంగతి మన కెందుకు?" అన్నాడు శేఖరం.

"ఎందుకంటే - ఇప్పుడు నేను చెప్పబోయే పందెం అదే!" అన్నాడు సంతోషరావు. "నీకు ధైర్యం వుంటే నువ్వామె చేయి పట్టుకుని నాలుగడుగులు వేయాలి. ఆపైన ఆ దృఢకాయుడు నిన్ను కొట్టకూడదు. నువ్వామెను క్షమార్పన అడగకూడదు. పందేనికి సిద్ధమేనా?"

"ఛా. ఇలాంటి పందేలు వద్దు" అన్నాడు రంగారావు.

"ఈ పందేనికి సిద్ధపడినా సరే - లేదా ఇక మీదట నువ్వు పందేలు వేసే అలవాటు మానుకోవాలి" అన్నాడు సంతోషరావు.

"శేఖరం ఆలోచిస్తున్నాడు.

"వాడిచేత ఈ ప్రమాదకరమైన అలవాటు మాన్పించడమే నా ఉద్దేశ్యం. నువ్వు మరోలా అనుకోకు...." అని

సంతోషరావు రంగారావుతో అన్నాడు.

"వాడు అడ్డమయిన పందేలకు వొప్పుకోడు. అలా గయితే యిప్పటికే నీతితప్పి వుండేవాడు" అన్నాడు రంగారావు.

"నాకు తెలుసు. తనకు ప్రమాదం అయినవీ - నీతి దూరం కానివీ అయిన పందేలకు మాత్రమే శేఖరం సిద్ధపడతాడు. ఇదీ అలాంటిదే. ఇందులో ప్రమాదం వుంది తప్పితే అవినీతి లేదు. నేనామె చేయి పట్టుకుని నాలుగడుగులు వేయాలన్నాను తప్పితే ఆమెను ముద్దు పెట్టుకోవాలన లేదు. అయినా ప్రమాదం...." అని సంతోషరావు ఆగాడు.

"ప్రమాదం ఎత్తు ఆరడుగులు. ప్రమాదానికి మీసాలు కూడా వున్నాయి. మంచి బలమయిన ఈ ప్రమాదం జోలికి శేఖరం వెళ్ళడనే నా ఆశ" అన్నాడు రంగారావు.

"నీ ఆశ నెరవేరదు" అన్నాడు శేఖరం. "పందెం ఎంతో చెప్పండి. ఉత్తినే బెట్ కాసే అలవాటు నాకు లేదు."

"వంద!" అన్నాడు సంతోషరావు.

"మరి నువ్వు?"

"నేను బెట్ కాయను" అన్నాడు రంగారావు.

"ఎలాగూ నేను కాస్తున్నా కదా నువ్వూ కాయి. ఈ పందెంలో మనం నెగ్గడం కాయం" అన్నాడు సంతోషరావు.

మొత్తంమీద రంగారావు కూడా వొప్పుకున్నాడు.

"సరే. అయితే నాకు రెండు వందలు లాభం" అన్నాడు శేఖరం.

"నీ లాభం సంగతి నాకు తెలియదు. నాకు మాత్రం వంధరూపాయలే లాభం" అన్నాడు సంతోషరావు.

"సరే....మీరంతా అలా చూస్తూండండి" అన్నాడు శేఖరం.

అతడు ముందడుగు వేయగానే అతడికి కాస్త దూరంలో రంగారావు, సంతోషరావు కూడా నడక ప్రారంభించారు.

ఆ యువతి, ఆమె భర్త ఈ లోకం తెలియకుండా వున్నారు. ఎదురుగా వున్న గాజుపలకల వెనుక నున్న బొమ్మలు చూస్తూ వాళ్ళేవేవో చెప్పుకుంటున్నారు. శేఖరం చటుక్కున ఆమె చేయి పట్టుకుని తనతో నాలుగడుగులు లాగి "అరే! శాంతా! నువ్విక్కడున్నా వేమిటి? అత డెవరు?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

ఆ యువతి తెల్లబోయి అతడి వంక చూసి "మీ రెవరో నాకు తెలియదు" అన్నది.

శేఖరం ఆమె చేయి వదిలిపెట్టి "నన్ను అప్పుడే మర్చిపోయావా శాంతా!" అని అడిగాడు.

ఈలోగా అతడి భుజం మీద ఓ బలమయిన చేయి పడింది. "మిస్టర్! ఆమె పేరు శాంత కాదు."

"శేఖరం వెనుదిరిగాడు. గులాబిముల్లు కనిపించాడు.

"ఆమె శాంత కాదా! ఇది నేను నమ్మలేను."

గులాబిముల్లు ముఖం గంభీరంగా మారింది. "నేనూ నిన్ను నమ్మడం లేదు. ఈ రోజుల్లో పరాయి యువతుల్ని తాకడానికి ఏదో ఎత్తు. వాటం చూస్తే నీ కిలాంటివి బాగా అలవాటనిపిస్తున్నది. నీకు బుద్ధి చెప్పాలి."

శేఖరం చిత్రంగా ఆయన వంక చూసి "ఎత్తు, బుద్ధి యిలాంటి మాటలు వినడం నా కిష్ట ముండదు" అన్నాడు.

"అనడం నాకూ యిష్టముండదు. కానీ తప్పదు. నా భార్య నేను తప్ప యింకెవరు తన చెయ్యి పట్టుకున్నా సరే సహించలేదు. ముందు నువ్వామెకు క్షమార్పణ చెప్పు

కోవాలి".

"తర్వాత ...."

"ఇలాంటి పనులింకెప్పుడూ చెయ్యనని మాట యివ్వాలి ...."

"తర్వాత!"

"బహుశా నేను నిన్ను క్షమించి వదిలిపెట్టవచ్చు!"

"ఆమె శాంత అనే నేను యిప్పటికీ భావిస్తున్నాను. తప్పు చేశానని నేను భావించడం లేదు. ఆడవాళ్ళ విషయంలో నే నెంతటి ఉత్తముడినో శాంతకే తెలుసు. చిన్నతనం నుంచీ కలిపి పెరిగిన మూలాన మా యిద్దరికీ చాలా చనువు వున్నది. అయితే ఆ చనువు మమ్మల్ని తప్పుకు ప్రోత్సహించ లేదు. అసలు నేను తప్పు చెయ్యను. చెయ్యని తప్పుకు క్షమార్పణ అడగను" అన్నాడు శేఖరం.

"నీ గురించి నువ్వు చెప్పుకున్నావు. మరి నా గురించి కూడా చెప్పుకోకతప్పదు" అన్నాడు గులాబిముల్లు. "దారిన పోయే వాళ్ళను పిలిచి క్షమార్పణ అడగడం నా హాబీ కాదు. తప్పుచేసిన వాళ్ళను శిక్షించడమూ నా హాబీ కాదు. నా విషయంలో ఎవరయినా తప్పుచేసినా నేను క్షమించగలను. కానీ నా భార్య విషయంలో మాత్రం .... ఆమె మనసు రవంత కష్టపడినా భరించలేను. నువ్వామెకు క్షమార్పణ చెప్పుకోకపోతే నేను నిన్ను ఏంచేసినా చేయవచ్చు. బహుశా చంపేస్తానేమో కూడా!"

"మనం ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నాం గదా - యింక నేను వస్తాను. నా మంచి తనం గురించి శాంతను అడిగి తెలుసుకో. నీ కిష్టంలేదన్నావు కాబట్టి ఆమెతో ఒక్క క్షణంకూడా మాట్లాడను" అంటూ శేఖరం అక్క

ణ్ణించి కదిలాడు.

"నీకు అతడు తెలుసా?" ముల్లు గులాబిని అడిగాడు.

"తెలియదు" అంది గులాబి.

"అయితే అతడు అబద్ధం చెబుతున్నా డంటావా?"

"అవును" అంది గులాబి.

"సరే....ఈ రోజు వాడికి మూడింది" అంటూ అతడు నాలుగు అంగల్లో శేఖరాన్ని సమీపించి భుజం మీద చేయి వేసి "ఎక్కడికి పోతున్నావ్?" అన్నాడు తీవ్రంగా.

శేఖరం చిరాగ్గా అతడి వంక చూసి "నేను ప్రస్తుతానికి ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఇంకో పది నిముషాల్లో గేటు తెరుస్తారు. అప్పుడు సినిమా హాల్లోకి వెడతాను. సినిమా చూడ్డం పూర్తయ్యాక యింటికి వెడతాను" అన్నాడు.

"సరే....అయితే నాకు చాలా టైముంది" అని వెళ్ళిపోయాడతడు. శేఖరం మిత్రులను సమీపించి "అంతా ఫాలో అయ్యారుగా" అన్నాడు.

"ఫాలో అయ్యాం. కానీ అప్పుడే నువ్వు పందెం నెగ్గినట్లు కాదు. ముల్లు నీ మీద పగబట్టినట్లు కనబడుతున్నాడు" అన్నాడు సంతోషరావు.

"అది పగ కాదు" అని నవ్వాడు శేఖరం. "అసహాయత. పరాయి మగవాడు తన కళ్ళెదుట తన భార్య చేయి పట్టుకుని లాగాడు. అది సహించి ఊరుకుంటే భార్య ముందు లోకువయిపోడూ? అందుకని రియాక్టవుతాడు తప్పితే యిందులో యేమంత కొంప మునిగిపోయిందని? అల్లరిచేస్తే అవమానం తన భార్యకే గానీ నాకు కాదు. ఈ పైకాలజీ నాకు బాగా తెలుసు. తన అహాన్ని తృప్తిపర్చుకోవడం కోసం, తన భార్య ముందు పరువు నిలబెట్టు

కోవడం కోసం అతడు నన్ను బెదిరించి వెళ్ళాడు. అంతే!"

"సరే.... నీ థియరీ నీది. నాకు మాత్రం ఇంకా ఏదో జరుగుతుందనే అనిపిస్తోంది" అన్నాడు సంతోషరావు.

"వంద రూపాయలు పందెం కాశావుకదా! ఆ మాత్రం ఆశ నీకు వుండడం సహజం" అని నవ్వాడు శేఖరం. తను అప్పుడే పందెం నెగ్గేశానన్న భావం అతడిలో స్పష్టంగా కనబడుతున్నది.

3

సినిమా జరుగుతున్నది.

ఒక వరుసలో చిట్టచివర వున్నాడు శేఖరం. ఎవరో సన్నగా పిలిచినట్లనిపించి వెనుతిరిగాడు శేఖరం. తను శాంతా అని పిలిచిన గులాబి ఆమె!

"ఒక్కసారి హాలు బయటకు రండి మీతో మాట్లాడాలి."

ఆమె అతడి జవాబు కోసం ఎదురుచూడకుండా హాలు లోంచి బయటకు నడిచింది. శేఖరం కూడా బయటకు వచ్చాడు.

ఇద్దరూ ఓ మూల కలుసుకున్నారు.

"మీరు నా కాళ్ళు పట్టుకుని క్షమార్పణ అడగడం మంచిది. ఆయన చాలా కోపంగా వున్నారు. మీకు తెలియదు. ఆయన చాలా ప్రమాదకరమయిన మనిషి. అవసరమైతే హత్యలు చేయడానికికూడా జంకడు. నేను మిమ్మల్ని తప్పు పట్టడం లేదు. నాకు మీమీద కోపం లేదు. కేవలం జాలితో మిమ్మల్ని కోరిక కోరుతున్నాను" అన్నదా గులాబి.

"మీవారి గురించిన మీ అంచనా తప్పు. ప్రమాదకర మైన మనిషి యిలా ఆడవారిచేత రాయబారాలు పంపడు" అన్నాడు శేఖరం. అత డిలా మాట పూర్తి చేయగానే భుజం మీద ఏదో దెబ్బ తగిలింది. ఆ ఒక్క దెబ్బకు అత డికి స్పృహ తప్పింది.

వెనుక నుంచి మల్లు వచ్చాడు. తన జేబులోనుంచి చిన్న బ్రాందీ సీసా తీశాడు. కొద్దిగా శేఖరం మూతికి బ్రాందీ రాసి మళ్ళీ సీసా తన జేబులో పెట్టేసుకున్నాడు.

ఆ తర్వాత భార్యాభర్తలిద్దరూ అతణ్ణి నడిపించుకొంటూ రోడ్డుమీదకు వచ్చారు. "తాగి స్పృహ తప్పాడు" అని వాళ్ళల్లో వాళ్ళే గొణుక్కున్నారు.

ఓ ఆటోలో వాళ్ళు ముగ్గురూ ఓ హోటలు చేరు కున్నారు.

హోటల్లో గదికి చేరుకున్నాక శీతలోపచారాలు చేసి శేఖరానికి స్పృహ తెప్పించాడు మల్లు.

"శేఖరం కళ్ళు తెరిచి—"నే నెక్కడున్నాను?" అన్నాడు.

"నా ఎదుట...." అన్నాడు మల్లు.

శేఖరం కళ్ళు నులుముకున్నాడు.

హోటలు గది....గులాబి....మల్లు....

"నే నిక్కడికెలా వచ్చాను?"

"నేను తీసుకుని వచ్చాను...." అన్నాడు మల్లు. అతడి చేతిలో ఇప్పుడు హంటర్ ఉన్నది.

జీవితంలో తొలిసారిగా శేఖరం భయపడ్డాడు.

"ఏమిటిదంతా?" అన్నాడతడు కంగారుగా.

"నా భార్య కాళ్ళమీద పడి క్షమార్పణ చెప్పుకో—"

ముల్లి ఉరిమినట్లుగా అన్నాడు. అతడొక పర్యాయం తన చేతిలోని కొరడాను ఝళిపించాడు.

శేఖరం వెంటనే వినలేదు.

ముల్లి అతణ్ణి కొరడాతో నాలుగు దెబ్బలు కొట్టాడు.

శేఖరం గులాబి పాదాలమీద పడ్డాడు. ముల్లి ఏమి చెప్పమంటే అది చెప్పాడు.

"ఈ బుద్ధి ఆ సినిమాహాలు వద్దనే వుండాల్సింది...." అన్నాడు ముల్లి.

"ఆ సినిమాహాలు వద్దనే నాకు బుద్ధి ఎందుకు చెప్ప లేదు!" అన్నాడు శేఖరం దిగులుగా.

"బుద్ధిగా క్షమార్పణ చెబుతావనుకున్నాను. చెప్పలేదు. ఈ విధంగా నీకు పదిమందిలోనూ బుద్ధిచెబితే కొంత నా భార్యను కూడా అల్లరిపెట్టి నట్లవుతుంది కదా—అదీకాక— ఇంత ఫ్రీగా నిన్ను కొట్టడానికీ వుండదు...."

శేఖరానికి శరీరమంతా మంటలుగా వున్నది. అయినప్ప టికీ అతడినో విషయం ఆశ్చర్యపరుస్తున్నది. అసలు భార్య గురించి ఇంత పట్టుదల గల మనిషి వుంటాడన్నది తన ఊహకు అందడం లేదు. తను పెద్ద తప్పేమీ చేయ లేదు. ఆమె గురించి తప్పుగా మాట్లాడలేదు. కానీ ఈ పెద్దమనిషి ఈ విషయాన్నెంత సీరియస్‌గా తీసుకున్నాడు? అదంతా ఆ భార్య గొప్పతనమా?.

"మళ్ళీ మనం సినిమాకు పోదాం—" అన్నాడు ముల్లి....

శేఖరం సినిమా హాల్లో కూర్చునేందుకు రాగానే "ఇంత సేపూ ఏమైపోయావు? మధ్యలో నీకోసం ఓసారి వెతికాం కూడా" అన్నాడు రంగారావు.

"ఏమీ లేదు—నేను పందెం ఓడాను...." అన్నాడు శేఖరం.

4

"జీవితంలో మొదటిసారిగా పందెం ఓడాను. అందు క్కారణం ఓ మహా యిల్లాలు. మీ యిద్దరికీ చెరో వందా మాత్రమే కాక ఆమెకు కూడా ఏదైనా బహుమతి ఇవ్వాలని పిస్తోంది" అన్నాడు శేఖరం.

"ముల్లుగాడు మళ్ళీ తన్నగలడు జాగ్రత్త!" అన్నాడు రంగారావు.

"తన్నులు తినయినా ఆమెకు బహుమతి నివ్వాలి. భర్త మనసులో అంతటి ఉన్నత స్థానాన్ని పొందగలిగిన ఆ స్త్రీ చరితార్థురాలు" అన్నాడు శేఖరం.

ఈ పర్యాయం కూడా శేఖరం మిత్రుల మాట చెవిని పెట్టలేదు. అతడామెకోసం ఓ వెండి కుంకంభరిణె కొన్నాడు. మిత్రులతో కలిసి హోటలుకు బయల్దేరాడు.

అయితే వాళ్ళు చేరేసరికి ఆ హోటల్ రూం కాళీ అయి పోయింది. ఉదయమే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారుట.

"అయితే ఆమెను కలుసుకోవడం ఇంక సాధ్యపడదు. కొన్ని కొన్ని అదృష్టాలు అందీ అందకుండా మనల్ని బాధి స్తాయి" అన్నాడు శేఖరం.

ఈ సంభాషణ వింటున్న హోటల్ మేనేజర్—"సార్. మీరు ఆమెను కలుసుకోవాలనుకుంటున్నారా — నేనింకా ఆయన కోసం వచ్చేరనుకున్నాను" అన్నాడు.

"అయితే యేం?"

ఆమెను మీరు కలుసుకోవాలనుకుంటే నేను ఏర్పాటు

చేయగలను. అయిదు వందలవుతుంది—" అన్నాడు మేనేజర్.

ఉలిక్కిపడ్డాడు శేఖరం. రంగారావు, సంతోషరావు తెల్లబోయారు. వారి ముఖాల్లో కనబడుతున్న ఆశ్చర్యానికి మేనేజరూ ఆశ్చర్యపోయాడు.

"చాలా ఫామిలీటైపు సార్! మీరు కలిసి షాపింగుకి వెడితే—ఎవరైనా మీ భార్యనే అనుకుంటారు—" మేనేజరు ఆమె గురించిన వివరాలిస్తూంటే శేఖరం బుర్ర పని చేయడం మానేసింది.

ఇప్పుడేం చేయాలి? మేనేజర్ మాటల్లోని నిజాన్ని పరీక్షించాలా?

ఒక యువతి చేయి తను పట్టుకున్నాడు. అందుకామె భర్త కోపగించి తనను బలవంతంగా హోటల్ గదికి తీసుకుని వెళ్ళి ఆమె పాదాలంటి క్షమార్పణ చెప్పేలా చేశాడు. తీరా చూస్తే ఆ యువతి ధర రాత్రికి అయిదువందలు.

"నా కామె కావాలి....ఎప్పటికి వీలవుతుంది?" అన్నాడు శేఖరం.

మేనేజర్ ఏదో పుస్తకం తీశాడు. కాసేపు ఆలోచించి- "రేపు రాత్రి అయితే ఆమె ఫ్రీగా వుంటుంది....ఆ తర్వాత రెండు నెలలవరకూ కాళీల్లేవు" అన్నాడు.

శేఖరం వెంటనే అతడికి అడ్వాన్సిచ్చాడు.

మేనేజర్ డబ్బు అందుకుని—"రేపు రాత్రి ఆరున్నరకు రూం నంబర్ యాభై ఆరు...." అన్నాడు.

"చివరికి నువ్విలా తయారయ్యావన్న మాట...." అన్నాడు సంతోషరావు బాధగా—బయటకు వచ్చేస్తూ!

"అవినీతిని ప్రోత్సహించను నేను. డబ్బిచ్చి ఆడదాన్ని

కొనడం నీతి అని భావించను. కానీ ఈ కేసు విచిత్రంగా వున్నది. ఎవరినయితే పరమ పవిత్రంగా భావించి వెండి కుంకం భరిణ కొన్నానో-ఆ యువతి వ్యభిచారిణి అని తెలిసింది. ఒక వ్యభిచారిణి పరువు నిలబెట్టడం కోసం అతడెందు కంత శ్రమపడ్డాడు? ఈ విషయం నేను తెలుసుకోవలసి ఉన్నది" అన్నాడు శేఖరం.

అతడు మరునాడు అన్న సమయానికి హోటల్ గదికి వెళ్ళాడు. అతడిలో ఏ మూలనయినా సందేహముంటే అది కాస్తా పూర్తిగా తీరిపోయింది. ఆ రోజు తను శాంతా అని పిలిచి చేయిపట్టుకున్న యువతి ఈ రోజు గదిలో ప్రత్యక్షమైంది.

అతన్ని చూస్తూనే "మీరా?" అన్నదామె.

"అవును. నేనే!" అన్నాడు శేఖరం.

"ఆ రోజు అనవసరంగా నా కోసం దెబ్బలు తిన్నారు. మిమ్మల్ని చూస్తే జాలేసింది" అన్నదామె.

ఆమెతో పందెం విషయం చెప్పాడు శేఖరం.

"నేను రౌడీని కాదు. ఆ రోజా విధంగా నీ చేయి పట్టుకున్నాను నీ మీద నాకే విధమైన వ్యామోహమూ లేదు. అయితే నీ భర్తగా నటించిన వ్యక్తి ఆ రోజు ఆ విషయాన్ని ఎందు కంత సీరియస్‌గా తీసుకున్నాడు? ఈ విషయం తెలుసుకొనడం కోసం ఈ రోజు నీమీద అయిదు వందలు ఖర్చుపెట్టాను" అన్నాడు శేఖరం.

"ఆయనొక విచిత్ర వ్యక్తి" అన్నదామె. "ఆయనకు భార్య వున్నది. ఆమె అపురూపసౌందర్యవతి అట. కానీ నిప్పులాంటి మనిషి. ఆమెపై ఎందరో కన్ను వేశారు. కానీ ఆమె పతివ్రతను నిలుపుకున్నదట. తనకు సంబంధించి

ఎటువంటి అవమానాన్నీ ఆమె సహించలేదు. సున్నితమైన మనసామెది.ఆమె నాయన అపురూపంగా చూసుకునేవాడు. ఒక రోజున విచిత్ర పరిస్థితుల్లో ఆయన ఆమెను అనుమానించాడు. అతడి అనుమానాన్ని భరించలేక ఆమె ఆత్మ హత్య చేసుకుంది.

మానసికంగా అతడు బాగా దెబ్బతిన్నాడు.అతడి మనసు నిండా ఆమె రూపమే. మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. కానీ ఇలా. అప్పుడప్పుడు నాబోటి వారి వెంటబడతాడు. లెక్కలేనంత డబ్బిస్తాడు. ఆయన చెప్పేది ఒక్కటే!

"నా భార్య పరమ పవిత్రురాలు. ఈ రోజు నీలో ఆమెను చూసుకుంటున్నాను. నీ వామె పవిత్రతను నిల పాలి. నేను నిన్ను అక్షరాలా నా భార్యలా చూసు కుంటాను!"

ఆయన అన్న ప్రకారం చేస్తాడు. వేశ్యలను వేశ్యలుగా కాక కట్టుకున్న భార్యలా చూస్తాడు. ఆయనతో నాలుగు రోజులు గడపడం నా బోటి వారికి దివ్యానుభూతి."

శేఖరం తను కొన్న వెండి కుంకం భరిణను ఆమెకు చూపించి "ఇది నీ కోసమని కొన్నాను. కానీ అతడితో నాలుగు రోజుల కాపురం అనంతరం కూడా నీ వృత్తిని వదిలిపెట్టాలని నీకు అనిపించలేదంటే ఈ బహుమతికి నీవు అర్హురాలివి కాదు" అన్నాడు.

ఆమె నవ్వి "ఎవరి అర్హత గురించో ఆలోచించవద్దు. భర్తగా మీలో ఔన్నత్యముంటే-ఈ బహుమతి అందుకునే అర్హత మీ భార్యకే ఉంటుంది" అన్నది. □

బి.రాజేశ్వరి

వృత్తి శత్రువులు

"ఇన్నాళ్ళకి మనమో ప్రయోజనకరమైన పరిశోధన చెయ్యగలిగాం" అన్నాడు శేష సంతృప్తిగా.

'వాసు అండ్ శేష డిటెక్టివ్ ఏజెన్సీ' ఆఫీసు గదిలో వాసు, శేష రిలాక్సింగ్‌గా కూచొని వున్నారు.

"పెద్దవాడినయినందుకు, నా పేరు బోర్డుమీద ముందు

న్నందుకు నాకు చాలా గర్వంగా వుంది. ఓ ఆడపిల్లకు తను కోరిన వరుడితో, నిరాటంకంగా పెళ్ళి కావటానికి మనం సాయంచేయగలిగామన్న సంతృప్తి నాకెంతో ఆనందాన్నిస్తోంది!" అన్నాడు వాసు.

"ఆ పెద్దమనిషి మాట నిలబెట్టుకున్నాడు. చక్కటి విందు భోజనంతో పాటు తా నిస్తానన్న ఫీజు పువ్వుల్లో పెట్టి - కాదు, కాదు - తాంబూలంలో పెట్టి మరీ ఇచ్చాడు. మొదటి సంపాదన మంగళకరంగా మంగళవాద్యాల మధ్య మనచేతి కొచ్చింది."

"సో.... యిక మన పరిశోధన నిత్యకల్యాణం పచ్చ తోరణంగా సాగుతుందన్న ధైర్యం నా కొచ్చేసింది".

"ఇక ఆఫీసు అద్దె చెల్లించగలమన్న భరోసా నాకూ వచ్చేసింది. రెండు నెలల అద్దె ఒకేసారి యిచ్చేద్దాం! ఓ.కే? ఫోన్ కూడా ఇన్‌స్టాల్ చేద్దాం."

"అలాగే! వచ్చేనెల ఎలా ఉండబోతుందో తెలీదుగా!"

"అమంగళం ప్రతిహతమగు గాక! మానవుడు ఆశా జీవి! మనలాంటి డిటెక్టివ్‌లు ఆప్టిమిస్ట్‌గా వుండాలి గాని మరీ పెసిమిస్టులుగా వుండకూడదు!"

అని వాసు అంటుండగానే ఓ యిరవై రెండేళ్ళ యువకుడు ఆఫీసు గదిలోకి దూసుకొచ్చినట్టుగా వచ్చాడు. స్టూడెంటులా వున్నాడు. ముఖంలో యింకా లేతదనం దోబూచులాడుతూనే వున్నది.

డిటెక్టివ్ లిద్దరి వంకా మార్చి మార్చి చూపి "మీరే ననుకుంటాను మిస్టర్ వాసు అండ్ మిస్టర్ శేషు" అన్నాడు.

"ఎస్ ప్లీజ్! అలా కూచోండి" వాసు మర్యాదగా సీటు చూపించాడు.

శేషు అతని వంక నఖశిఖ పర్యంతం చూస్తున్నాడు పరిశీలనగా. అతని సమస్య ఏమిటో వూహించటానికి ప్రయత్నిస్తున్నాడు.

"నా పేరు వీరేన్. నే నో అమ్మాయిని ప్రేమించాను. ఆమె గురించి కొన్ని వివరాలు కావాలి" అన్నా డా కుర్రాడు.

"నువ్వు ప్రేమించిన అమ్మాయి గురించి మేము వివరాలు చెప్పట మేమిటి?" అన్నాడు శేషు.

"అమ్మాయి గురించి నాకు తెలీని విషయాలు, నేను తెల్సుకోవాలనుకుంటున్న వివరాలు మీరు సేకరించి నాకు చెప్పాలి" అన్నాడు వీరేన్.

"అసలు సంగతి వివరంగా చెప్పండి" అన్నాడు వాసు. శేషు వంక సాభిప్రాయంగా చూశాడు.

శేషు అయిష్టంగానే పెన్సిలు, నోట్ బుక్ చేతిలోకి తీసుకున్నాడు. వాసు నవ్వుకున్నాడు.

"నేను రాధ అనే అమ్మాయిని—నా క్లాస్‌మేట్‌ని ప్రేమించాను. ఆమె కూడా నన్ను ప్రేమించింది."

"ప్రేమించటం వరకేనా...." శేషు అర్ధోక్తిలోనే ఆగిపోయాడు.

"పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం."

"మరిక ఆలస్యం దేనికి? పురోహితుడి దగ్గరికి వెళ్ళాల్సిన సమయంలో డిటెక్టివ్‌తో పనేమిటి?" శేషు కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది.

వాసు హెచ్చరికగా చూశాడతనివంక.

వీరేన్ యిబ్బందిగా చూశాడు.

"మీరు చేస్తానంటే, చెయ్యగల నంటే చెప్తాను" అన్నాడు.

"ఏ పనయినా చెయ్యగలం గాని, వివరాలు చెపితేనే చేస్తాం!" అన్నాడు శేషు నిష్కర్షగా.

వీరేన్ కొద్ది క్షణాలు మౌనం వహించి, తర్వాత ఇలా అన్నాడు: "రాధ యీ మధ్య నాతో కొంచెం ముభావంగా వుంటూంది. ఒకటి రెండుసార్లు కాలేజీలో మా కొలీగ్ రాఘవ్‌తో మాట్లాడుతూ కనిపించింది. ఆమె మనసు పరాధీనమవుతున్నదేమోనని నా అనుమానం. కాని నాతో సినిమాలకి, షికార్లకి మామూలుగానే వస్తుంది. పెళ్ళికి సుముఖంగా వున్నట్టే కనిపిస్తుంది. అంతలోనే ఏదో ఆలోచిస్తూ ముభావంగా అయిపోతుంది. ఆమె మనఃస్థితి నా కేమిటో అర్థం కాకుండా వుంది."

"అది మీ యిద్దరు తేల్చుకోవలసిన సమస్య! మీ మధ్య మూడో మనిషి జోక్యం అనవసరం!"

"అదికాదు సార్, రాధ కేరక్టర్ గురించి మీరు యెంక్వయిరీ చెయ్యాలి!" వీరేన్ నసుగుతూ అన్నాడు.

శేషు ముఖం ఎఱ్ఱగా అయింది. "అంత నమ్మకం లేనివాడివి ఆ అమ్మాయినే యెందుకు పట్టుకు వేలాడాలి!" అన్నాడు తీవ్రంగా.

"....అని కాదండి! రాధని నేను చాలా యిదిగా ప్రేమించాను. ఆమెని తప్ప మరో పిల్లని ప్రేమించలేను, పెళ్ళాడలేను!"

"ప్రిన్సిపుల్ మంచిదే! కాని, ఆ అమ్మాయిని అనుమానించటమే మంచిగా లేదు. పెళ్ళి కాకముందే యిన్ని అనుమానాలు పెట్టుకుంటే, పెళ్ళయ్యాక ఎన్ని రకాల అనుమానా లొస్తాయో? నా మాట విని, ఆ అమ్మాయిమీద యెంక్వయిరీ కండక్టు చెయ్యటం మాని మరో అమ్మాయిని ప్రేమించో ప్రేమించకో పెళ్ళాడు!" శేషు నిష్కర్షగా

జెప్పటం వీరేన్‌కి నచ్చలేదు.

"నేను ఫీజు ఇవ్వలేనని మీ అనుమానంలా వుంది!...." అన్నాడు వీరేన్ ఉక్రోషంగా.

వాసు తేలిగ్గా నవ్వేస్తూ ఏదో సర్ది చెప్పబోయాడు.

"నో, నో! ఇలాంటి అనుమానాల పిశాచాల కేసులు టేకప్ చెయ్యటం నా కిష్టంలేదు! సారీ అబ్బాయ్, ఆడవాళ్ళ మీద సదభిప్రాయం లేని నీలాంటివాళ్ళ చర్యల్ని ప్రోత్స హించలేను. మా నిలువెత్తు ధనం పోసినా యీ కేసు మేం తీసుకోలేం. నువ్విక వెళ్ళొచ్చు!"

శేషు మాటలకి వీరేన్‌కి బాగా కోపం వచ్చిందనటానికి నిదర్శనంగా ఉత్తరక్షణంలో అతను ఆఫీసు మెట్లు దిగి రోడ్ మీద నిల్చున్నాడు.

2

మిట్టమధ్యాహ్నం వేళ వచ్చిన ఆగంతకుడ్ని చూసి ముందు వెంటనే గుర్తుపట్టలేదు—వాసు, శేషు.

అతను వాళ్ళిద్దరివంకా స్నేహపూర్వకంగా చూసి, "నన్ను గుర్తుపట్టలేదా?" అన్నాడు సన్నగా నవ్వుతూ.

శేషు ముందుగా గుర్తుపట్టి, "అరె, మోహన్. నువ్వా? యెన్నాళ్ళ కెన్నాళ్ళకు?" అంటూ చేయి గుచ్చిపట్టి పక్కన కూచోబెట్టుకున్నాడు.

వాసు కూడా గుర్తుపట్టి, "ఇప్పు డెక్కడున్నావు? ఏం చేస్తున్నావు?" అనడిగాడు ఆదరంగా.

ఆ వచ్చిన మోహన్ అనబడే వ్యక్తి వాసు శేషుల క్లాస్‌మేటు. చాన్నాళ్ళక్రితం కలిసి చదువుకున్నారు. అనుకో కుండా యిన్నాళ్ళ తర్వాత కలవటంతో బాల్యస్మృతులు ముగ్గుర్నీ ఆవహించి కాసేపు అందులో మునిగిపోయారు.

"మీ రిద్దరు డిటెక్టివ్ ఏజన్సీ పెట్టి బాగా పేరు సంపా

దించారని విన్నాను. చాలా సంతోషం!" అన్నాడు మోహన్. డిటెక్టివ్ లిద్దరు సంతోషంగా చూశారు.

"నాకో చిన్న సమస్య వచ్చిపడింది ..." అర్ధోక్తిలో ఆపి యిద్దరి ముఖాల్లోకి చూశాడు మోహన్.

"ఏమిటి, ఏమిటది?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"నన్నెవరో బ్లాక్ మెయిల్ చెయ్యటానికి ప్రయత్నిస్తున్నారు."

"ఎలా అనుకొంటున్నావు?"

"నన్ను బెదిరిస్తూ ఉత్తరాలు వచ్చాయి. నేను వ్యాపారంలో కాస్తో కూస్తో ఆస్తి సంపాదించాను. అది చూపి కన్ను కుట్టి అది కాస్తా కాజెయ్యటానికి యెవరో ఉచ్చు పన్నుతున్నారు" అన్నాడు మోహన్ విచారంగా.

శేషు వెంటనే "ఇక నిశ్చింతగా వుండు. మేము రంగం లోకి దిగితే ఆ బ్లాక్ మెయిలర్ ఆట కట్టిస్తాం" అన్నాడు వాసు తలూపాడు.

"ముందుగా అలా బ్లాక్ మెయిల్ చేసే అవకాశం ఎవరి కుందో తెల్సుకోవాలి. నువ్వంటే గిట్టనివాళ్ళు—శత్రువులని చెప్పుకోదగ్గవాళ్ళు యెవరయినా వున్నారా?" అడిగాడు వాసు.

మోహన్ కొద్ది క్షణా లేదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత గుర్తొచ్చినట్టు, "నాకు వ్యాపారంలో ప్రత్యర్థి భూషణం వున్నాడు. వాడికి నా వ్యాపారం బావుందని యేడుపు. నన్నేదో విధంగా పడగొట్టాలని చూస్తూన్నాడు" అన్నాడు.

"నిన్ను బెదరించటంవల్ల అతనికేం లాభం?"

"ఊరికే బెదిరించి వూరుకోవటంలేదు. డబ్బు అడుగుతూ రాశాడు. ఇవ్వకపోతే నన్ను హతమారుస్తానని

రాశాడు. నా కుటుంబ సభ్యుల్ని హతం చేస్తానని రాశాడు....”

“ఐ. సీ! ఏదీ ఆ ఉత్తరం నీతో తెచ్చావా?”

“ఆ(....ఇదిగో!” అంటూ జేబులో నుండి ఓ పావు టావు సైజు తెల్లకాగితం శేషు కందించాడు మోహన్.

శేషు పరిశీలనగా చూశాడు. నల్ల సిరాతో గజిబిజిగా రాసినట్టున్నాయి అక్షరాలు. తెలుగు లిపి. మోహన్ చెప్పినట్టే పదివేల రూపాయలు వెంటనే చెల్లించకపోతే అతని అంతు చూస్తానని రాయబడుంది. సంతకంగానీ, సంబోధనగానీ లేవు. డబ్బు రాత్రి షాపు మూసేసేముందు మోహన్ షాపు మెట్లపైన కుడిపక్కగా పెట్టిపొమ్మనీ, తర్వాత తను తీసుకుంటాననీ రాశాడు.

వాసుకూడా పరీక్షగా ఆ కాగితం వంక చూశాడు.

“ఇది నీకు పోస్టులో వచ్చిందా? ఎవరైనా తీసుకొచ్చి యిచ్చారా?” అనడిగాడు.

“పోస్టులోనే వచ్చింది.”

“పోస్టల్ కవరుందా?” శేషు అడిగాడు.

మోహన్ వెంటనే “లేదు, అప్పుడే పారేశాను” అని అంతలోనే ఏదో గుర్తొచ్చి, “వేస్ట్ పేపర్ బాస్కెట్లో పడేశాను. దాన్ని ఖాళీ చెయ్యనట్టే గుర్తు. చూసి రేపు తెస్తాను” అన్నాడు.

“లేకపోయినా ఫరవాలేదులే! నీకీ ఉత్తరం వచ్చి ఎన్ని రోజులయింది?”

“నాలుగైదు రోజులవుతుంది.”

శేషు ఉత్తరానికి దిగువ తేదీ ఉండటం గుర్తించాడు. ఆగష్టు పదో తేదీ వేసి వుంది. కేలండర్ వంక చూశాడు. ఆగష్టు పదహారు చూపిస్తోంది. పోస్ట్ చేసిన ఒకటి రెండు

రోజుల్లో అంది వుంటుంది. లోకల్ పోస్టే కదా! ఒక రోజు చాలు! అనుకున్నాడు.

"ఇక రెండు రోజులే గడువుంది!" అన్నాడు మోహన్.

శేషు ఉత్తరంలోకి చూశాడు. పద్దెనిమిదో తేదీ రాత్రి వరకు టైం యిచ్చాడు బ్లాక్ మెయిలర్. ఆ రాత్రి షాపు మూసేవరకు డబ్బు అందించాలి. లేకుంటే మర్నాడే మోహన్ వాళ్ళ అంతు చూస్తానన్నాడు. అంటే, యిక మధ్యలో పదిహేడో తేదీ మాత్రం అడ్డుంది!

వాసు, శేషు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

"సరే మేం ప్లాన్ చేసి అతన్ని పట్టుకుంటాం. భూషణం కాక మరెవరైనా అనుమానితు లున్నారా నీ దృష్టిలో?" అడిగాడు శేషు.

"ఎవరూ గుర్తురావటం లేదు."

"సరే, నువ్వు వెళ్ళు! మేము యీ క్షణం నించీ పరిశోధన మొదలుపెడ్తున్నాం" అన్నాడు వాసు.

మోహన్ జేబునించి చెక్ బుక్ తీసి "మీ ఫీజు ఎంతో చెబితే అంకె వేస్తాను" అన్నాడు.

శేషు చిరుకోపంతో చూసి, "మన స్నేహాన్ని డబ్బుతో కొలవాలనుకుంటున్నావా?" అన్నాడు.

మోహన్ తడబడి, "అబ్బెబ్బె, అదేం కాదు! నేనూ వ్యాపారం చేసి సంపాదిస్తున్నాను. పోలీసుల జోలికివెళ్తే దొంకంతా లాగుతారని చిన్ననాటి స్నేహితులైన మీ దగ్గరి కొచ్చాను—అంతేగాని, ఫీజు యివ్వనక్కర్లేదని కాదు! మీరు తీసుకోవాల్సిందే" అన్నాడు.

"కేసు పూర్తయ్యాక మేమే అడిగి తీసుకుంటాంలే!" అన్నాడు శేషు చనువుగా చెక్ బుక్ మోహన్ జేబులో

పెట్టేస్తూ.

మోహన్ వెళ్ళిపోయాడు.

వాసు అతనలా వెళ్ళగానే నాలిక్కరచుకుని, "అరెరె! మనవాడికి కాఫీ అయినా పోయించలేదే! ఏమనుకుంటాడు?" అన్నాడు.

శేషకూడా నొచ్చుకుని, "అవును సుమా! కేసు విషయం ఆలోచిస్తూ ఆ సంగతే మరిచి పోయాం" అన్నాడు.

"నాకో అనుమానం వస్తోంది. వృత్తిలో శత్రుత్వం వుంటే మరోలా తీర్చుకుంటారు గాని బ్లాక్ మెయిల్ చెయ్యటం దేనికి?"

"అదే మరోలా తీర్చుకోవటానికే బ్లాక్ మెయిల్ చెయ్యటం! డబ్బివ్వకపోతే యివ్వలేదు గాబట్టి హానిచేస్తున్నట్టు మోహన్ అనుకోవాలని అతన్ని మానసికంగా చిత్రవధ చేస్తున్నాడన్న మాట భూషణం! అతని తర్వాతి ప్లాన్ మోహన్‌ని అతని కుటుంబ సభ్యుల్ని ఏదైనా చెయ్యాలనే! అది తను చేసినట్టు మోహన్ అనుమానించకుండా డబ్బు యిమ్మని బ్లాక్ మెయిల్ చెయ్యబోయిన ఎవరో ఆగంతకుడి లాగా ఉత్తరం రాశాడన్న మాట!"

"ఉత్తరం రాయకుండానే మోహన్ వాళ్ళను ఏదయినా చెయ్యవచ్చుకదా!"

"తను బయటపడకుండా బ్లాక్ మెయిలర్ ఎవడో అన్నట్టు అనుమానం ప్రక్క ట్రాక్ పట్టించాలని భూషణం ప్లాన్! కమాన్ ఓసారి పోయి భూషణం విషయం ఎంక్వయిరీ చేద్దాం. మోహన్ చెప్పిన వివరాలు నోట్ చేశావు కదా!" అన్నాడు శేష లేస్తూ.

వాసు అనుసరించాడు.

3

భూషణం ఫెర్టిలైజర్ షాపు ముందు ఆటో దిగి ఫేర్ చెల్లించి లోపలికి అడుగుపెట్టారు అపరాధపరిశోధకు లిద్దరు.

ఎర్రగా పొడుగ్గా హుందాగా వున్న వ్యక్తి కౌంటర్ ముందు కూచుని వున్నాడు.

"రండి సార్!" అంటూ లోపలికి ఆహ్వానించాడు.

వాసు, శేషు లోనికి అడుగుపెడ్తూనే షాపునంతటినీ కలయజూశారు. నత్రజని, అమ్మోనియా ఫాస్ఫేటు వంటి రకరకాల ఎరువుల బస్తాలు వందలకొద్దీ పేర్చబడి వున్నాయి. ఓ చిన్నసైజు గోడౌన్‌లా వున్న ఆ షాపుని చూసి వ్యాపారం చాలా పెద్ద ఎత్తున జరుగుతున్నదని గ్రహించారు వారిద్దరు.

"మీకే విధంగా సహాయపడగలను సార్!" అన్నాడతను ముఖం నిండా నవ్వు పులుముకుని ఎంతో పొలైట్‌గా.

వాసు, శేషుల అవతారాలు మారిపోయాయి. పల్లెటూరి మోతుబరి రైతుల్లా పంచె, జుబ్బా, కండువా ధరించి కాళ్ళకు ఆకుచెప్పులు వేసుకున్నారు.

తమని అతను చాలా మర్యాదగా పలకరించటం చూసి కొంత ఆశ్చర్యం అనిపించినా అతని వ్యాపార సరళి అది కావచ్చు ననుకున్నారిద్దరు.

"మేము చెరుకువేశాం పదిహేను ఎకరాల ఇస్తీర్ణంలో. ఏ ఎరువులు ఎన్ని బస్తాలు పడతాయో కూసంత లెక్కకట్టి జెప్పాలండి" అన్నాడు శేషు.

"నాగభూషణంగారి కొట్టు యిదేగదండీ" అన్నాడు వాసు అర్ధోక్తిలో ఆగిపోయి.

"ఇదేనండి. నేనే, నాగభూషణం కాదండి, ఉత్త

భూషణమే నా పేరు.''

"అట్లాగా. మీ కొట్టుకే పొమ్మని జెప్పారు మా వూళ్ళో."

"మీ దేవూరు?''అన్నాడు భూషణం చిన్నగా నవ్వుతూ.

"ఇక్కడికి దగ్గిరేనండి, గొర్రిపూడి.''

"అల్లాగా. మీరు చూడగా పెద్ద భూస్వాముల్లా వున్నారు. పదిహేనెకరాల చెరుకు తోటకే ఎరువు కావాలో నేను వేరే చెప్పాలటండీ! ఎంత కావాలో మీరు అర్డరి స్తే పోయేదానికి నేనేం చెపుతానో నా నోట వినాలని అడుగుతున్నారు కదూ!'' అన్నాడు భూషణం యింకా నవ్వుతూనే.

శేషు నాలిక్కరుచుకున్నాడు. ఈ రోజుల్లో చిన్న చిన్న బడుగురైతులక్కూడా నత్రజని ఎరువు దేనికి వాడాలో అమ్మోనియా దేనికి వాడాలో ఎంత క్వాంటిటీ వాడాలో క్షుణ్ణంగా తెలుసు. అలాంటిది తాము ఖాందు వేషాలు వేసుకునికూడా అమాయికంగా అతన్ని ప్రశ్నించటం నవ్వు పుట్టించి వుంటుందతనికి!

వాసుకూడా తప్పు అర్థం చేసుకున్నాడు.

భూషణం చకచక ఓ కాగితంమీద పదిహేనెకరాలకు కావలసిన ఎరువుల వివరాలు, వాటి ఖరీదు వేసి శేషు చేతికిచ్చాడు. అతను రాస్తున్నంతసేపు యిద్దరు అతని చేతి వ్రాత వైపే చూస్తున్నారు. ఇంగ్లీషులో రాస్తే వద్దని చెప్పాలనుకున్నాడు వాసు. కాని, భూషణం తెలుగులోనే రాశాడు. చాలా పొందికైన అక్షరాలు. అయితే అతను వాడినది నల్లసిరా కాదు.

ఇద్దరు ఒకసారి మోహన్‌కి వచ్చిన బెదిరింపు ఉత్తరంలోని దస్తూరి, గుర్తు తెచ్చుకున్నారు. రెండిటికీ ఎక్కడా పోలిక లేదు. అయితే అది భూషణం రాసి వుండదు,

ఎవరిచేతనైనా రాయించి వుండాలి!

వాసు మాటిమాటికీ మీసం అద్దుకుంటున్నాడు. పెట్టుడు మీసం ఓ పట్టాన అంటుకుని చావలేదు. అప్పటికే రెండు సార్లు భూషణంకి కనపడకుండా పక్కకు తిరిగి సర్దుకున్నాడు.

శేషు మోచేత్తో పొడిచాడు వాసుని. ఓ పక్క మీసం లేచిపోయి వేలాడుతోంది. వాసు కంగారుగా అద్దుకోబోతే మొత్తం మీసం చేతి కొచ్చేసింది.

"పోనీండి సార్, యిప్పుడు దాని అవసరం ఏ మొచ్చింది?" అన్నాడు భూషణం నవ్వుతూ. లోపల కస్టమర్సు ఎవరూ లేరు. డిటెక్టివ్‌లు, భూషణం, ఓ గుమాస్తా, పని కుర్రాడు—అంతే!

తన అవస్థ భూషణం కనిపెట్టేసినందుకు ఓ పక్క ఉక్రోషం, మరో పక్క తనమీద తనకి కోపం పుట్టుకొచ్చాయి వాసుకి.

"సార్, నేనే మీ డిటెక్టివ్ ఏజెన్సీకి రావాలనుకుంటున్నాను. ఇంతలో మీరే నన్ను వెతుక్కుంటూ నా షాపుకి రావటం నా అదృష్టం!" అన్నాడు భూషణం.

డిటెక్టివ్ లిద్దరికీ మతిపోయింది. భూషణం చాలా తెలివైనవాడిలా వున్నాడు. తామెవరో కనిపెట్టేశాడు.

పని కుర్రాడిని పిలిచి కూల్‌డ్రింక్సు ఆర్డరిచ్చాడు భూషణం. వాసు, శేషులకి ముళ్ళమీద కూచున్నట్టుంది. ఎంతో పడక్బందీగా ప్లాన్ చేసుకుని మారు వేషాల్లో వస్తే యీ భూషణం ఎలా కనిపెట్టేశాడు? పైగా తమ పేర్లతో సహా యితని కెలా తెలిసిపోయింది? ఇప్పుడెలా?

ఇద్దరు మౌనంగా తేలుకుట్టిన దొంగల్లా కూర్చుండిపోవటంతో భూషణమే మళ్ళీ అన్నాడు: "మిమ్మల్ని నా

మీద ఎంక్వయిరీకి ఎవరు నియమించారో నాకు తెలుసు. నిన్న మోహన్ మీ ఏజెన్సీ ఆఫీసునించి రావటం నేను చూశాను. అప్పుడే మీ ఆఫీసు బోర్డు, లోపలున్న మిమ్మల్ని చూశాను. మోహన్ ఎందుకు మిమ్మల్ని నా దగ్గరికి పంపించాడో కూడా నాకు అర్ధమయింది. బహుశా నామీద ఏ తప్పుడు కేసో బనాయించి నన్ను కటకటాల వెనక్కి పంపించెయ్యాలనే ఉద్దేశంతో మిమ్మల్ని నియమించి వుండొచ్చునని ఊహిస్తున్నాను.''

శేషు ముందుగా తేరుకున్నాడు: "ఎందుకలా అనుకుంటున్నారు?'' అన్నాడు సీరియస్‌గా.

భూషణం చిన్నగా నవ్వి, "వెరీ సింపుల్. వృత్తి శత్రుత్వం. మేమిద్దరం చేసేది ఒకేలాంటి వ్యాపారం. అందుకని! మోహన్ కన్న నా బిటినెస్ పెద్దది. ఎక్కువ ఆశపోతును కాకపోవటంతో రీజనబుల్‌గా యిస్తానని కస్టమర్స్ నా దగ్గరకే వస్తుంటారు. మోహన్ విపరీతమైన లాభాలకు అమ్మతాడు. అతని వల్ల మోసపోయిన వాళ్ళు మళ్ళీ అతని ముఖం రెండోసారి చూడరు. అతని కస్టమర్సుకూడా నా దగ్గరికే మారిపోతారు. అదీ మా యిరువురి మధ్య శత్రుత్వానికి కారణం!'' అన్నాడు.

శేషు అపనమ్మకంగా చూశాడు. ఇదే విషయం మోహన్ సరిగ్గా వ్యతిరేకంగా చెప్పాడు. మోహన్ తమ స్నేహితుడు! ముక్కు మొహం తెలీని యీ భూషణంమాట ఎవరు నమ్మరు? కథ అల్లి చెపుతున్నాడు. వాసు కూడా సరిగ్గా యిలాగే ఆలోచిస్తున్నాడు.

కూల్‌డ్రింక్సు వచ్చాయి. "తీసుకోండి!'' అన్నాడు భూషణం మర్యాద ఉట్టిపడేలాగా.

"నో, థాంక్స్!" అన్నారిద్దరు.

"మోహన్ మీ కష్టమర్. మీరు నా కస్టమర్స్. కస్టమర్స్ని గౌరవించటం నా కలవాటు. తీసుకోండి!" అన్నాడు భూషణం.

డిటెక్టివ్‌లు కాదనలేకపోయారు

"ఇప్పుడు వినండి! మోహన్ నామీద ఏదో కుట్ర పన్నుతున్నాడని నాకు అర్థమయిపోయింది నాకుగాని, నా కుటుంబ సభ్యులకుగాని హాని తలపెడుతుండవచ్చు. అతని వల్ల నాకు అపాయం లేకుండా మీరు నాకు రక్షణ కల్పించి అతని పన్నాగాల్ని తెలియపర్చగలరా? మీరు కోరినంత ఫీజివ్వగలను" అన్నాడు భూషణం.

వాసు, శేషు కోపంగా లేచారు. "మేము మోహన్ తరపున పని చేస్తున్నామని తెలిసే మీరు అడుగుతున్నారు. అది మా వృత్తికే అవమానం! మేము డబ్బుకోసం దిగజారి పోయేవాళ్ళలాగా మీకు కనపడుతున్నా మనుకొంటాను. ఉయార్ సారీ ఫరిట్!" అంటూ గుమ్మం దిగి పోయారు.

4

"ఈ రోజే భూషణం వార్నింగిచ్చిన రోజు!" అన్నాడు మోహన్ డిటెక్టివ్‌ల కెదురుగా కూచుని.

"అవును" అన్నాడు శేషు ఏదో ఆలోచిస్తూ.

"ఇదిగో మీరడిగిన పోస్టల్ కవరు, దీంట్లోనే భూషణం బెదిరింపు ఉత్తరం పంపాడు" అన్నాడు మోహన్ ఓ పక్కచించిన పోస్టల్ కవరు శేషు చేతికందిస్తూ.

అది పోస్టల్ డిపార్టుమెంటు వాళ్ళ ఎన్వలప్‌కాదు. అదే సైజులో వున్న పింక్ కలర్ కవర్‌మీద ఏభై పైసల స్టాంపు అతికించి వుంది. కవర్‌మీద అడ్రసు యింగ్లీషులో

రాయబడి వుంది. ఎమ్. మోహన్....అని అడ్రసు పూర్తిగా రాసి వున్న ఆ కవర్‌వంక చూస్తున్న శేషు మెదడులో ఆలోచన మెరిపింది. అవును, యిదే దస్తూరి! ఇది తనకి బాగా పరిచితమయినదే!

"సాయంత్రం ఉత్తరంలో రాసినట్టే డబ్బు షాపు మూసేశాక నీ షాపు మెట్లకు కుడివైపున పెట్టు. మేము అప్పటికే అక్కడ తయారుగా వుంటాం. అప్పటికప్పుడే భూషణాన్ని పట్టేద్దాం!" అన్నాడు శేషు, మోహన్ వంక అర్ధవంతంగా చూస్తూ.

మోహన్ అయోమయంగా చూశాడతని వంక. "సరే, రాత్రికి డబ్బు పెడతానక్కడ. మీ రక్కడే వుంటారు కదా!" అన్నాడు.

"ఆఁ హా! నీ షాపు సమీపంలో ఎవరికీ కనపడకుండా వాచ్ చేస్తుంటాం."

మోహన్ సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

వాసు, శేషు వంక అదోలా చూసి. "నీ బుర్ర మరీ చవుడుబారిపోయింది రోజురోజుకీ. మన ప్లాన్ తెలిసిపోయాక భూషణం వస్తాడని ఎలా అనుకొంటున్నావు? అసలు తన ఉనికి బయటపడకుండా యింకా జాగ్రత్తపడిపోతాడు" అన్నాడు.

"అసలు భూషణంకి ఆ ఉత్తరం సంగతి తెలిస్తేగా?" అన్నాడు శేషు నవ్వుతూ.

"తను రాసిన ఉత్తరం తనకి తెలియక పోవటమేమిటి?"

"అసలు బెదిరింపు ఉత్తరం రాసినది మోహనే!"

"మోహనా? అదెట్లా?"

"నీకు గుర్తున్నదనుకుంటాను—చదువుకునే రోజుల్లో మోహన్ నల్లయింకు వాడేవాడు. ఇప్పుడు యీ ఉత్తరం

నల్లపిరాతో రాశాడు. కవర్‌మీద అడ్రసుకూడా అదే పిరాతో రాశాడు.

నాకు అతని పేరు యింగ్లీషులో రాశాక గుర్తొచ్చింది. మోహన్ పేరులో 'ఎమ్' అన్న యింగ్లీషు అక్షరం మోహన్ సంతకం పెట్టేటప్పుడు అలాగే రాస్తాడు. ఇంటి పేరు కూడా 'ఎమ్'నే.

ఇంకో ముఖ్యమైన విషయం—కవర్ మీదున్న స్టాంపు. ఇది ఆగష్టు పదిహేనో తేదీన విడుదలైన ప్రత్యేక తపాలా బిళ్ళ! ఉత్తరం రాసినది ఆగష్టు పదో తేదీన. అప్పటికి ఈ తపాలాబిళ్ళ విడుదలే కాలేదు. డీఫేపింగ్ ముద్రమీది తేదీ గాని, డెలివరీ తేదీగాని స్పష్టంగా లేవు. నెల సంవత్సరం మాత్రమే క్లియర్‌గా వున్నాయి.

దీన్ని బట్టి మోహనే యీ కవరు సృష్టించాడని గ్రహించాను. నిన్న పోస్ట్‌చేసి యివాళ దాన్ని రిసీవ్ చేసుకుని, మనకు తెచ్చి యిచ్చాడు. నిజానికి దీనికోసం అతడింత కష్టపడాల్సిన పని లేదు. మనల్ని బాగా నమ్మించటంకోసం చేశాడు" అన్నాడు శేషు.

"మనల్ని నమ్మించటం దేనికి?"

"రేపు కోర్టులో సాక్ష్యం చెప్పటానికి!"

"సాక్ష్యమా?"

"అవును. భూషణాన్ని హత్యచేసి, తప్పించుకుంటాడు. ఎదురు తిరిగి అతనే తనని హత్య చేయటానికి ఫోన్ చేసి నట్టు కథ అల్లి అందుకు మనిద్దర్ని సాక్షులుగా ఉపయోగించు కుంటాడన్న మాట! ఇదీ మోహన్ పన్నాగం! భూషణం వ్యాపారం బాగా పెరగటాన్ని చూసి ఓర్వలేక అతన్ని అడ్డు తప్పించటానికి మోహన్ చేసిన కుత్సిత పన్నాగ మిది!"

శేష చెప్తున్నది చెవులప్పగించి వింటున్నాడు వాసు.

"ఇంత మోసగాడు, ప్రమాదకారీనా మోహన్? స్నేహితుడు కదా అని కేస్ ఒప్పుకుంటే మనల్నే యిరికించాలని చూస్తాడా? వాణ్ణి అంత తేలిగ్గా వదలకూడదు.

"అందుకే యీ రాత్రికి డబ్బు షాపు గుమ్మంమీద పెట్టమన్నాను."

"భూషణం రాడుగా, దేనికి?"

"చెపుతాను" అన్నాడు శేష.

5

రాత్రి పదిగంటలు దాటి పది నిమిషాలయింది.

మోహన్ తన ఫెర్టిలైజర్స్ షాపు మూసేశాడు. అప్పటికే బజారంతా నిర్మానుష్యమయిపోయింది. ఆ బజార్లో రాత్రి తొమ్మిది గంటలకే అన్ని షాపులు మూతపడిపోతాయి. కావాలనే మోహన్ ఆలస్యం చేశాడు. అప్పుడొకరు అప్పుడొకరు నడుస్తున్నారు రోడ్ మీద.

మోహన్ పదివేల రూపాయలు ఓ పేపర్లో చుట్టి తన షాపు కుడిపక్క మెట్లపైన పెట్టాడు. దూరంగా సందులో టార్చి వెలిగి ఆరిపోయింది. ఆ సూచన డిటెక్టివ్‌లదని మోహన్‌కి తెలుసు. ఆ సిగ్నల్ ముందు అనుకున్నదే.

మోహన్ షాపుకి అటుపక్కగా ఓ పాన్‌షాపుంది. అక్కడ బల్లమీద కూచుని వెయ్యి కళ్ళతో షాపువంకే చూస్తున్నాడు. ఇంతలో వాసు వచ్చి మోహన్‌కి కొంచెం దూరంలో నిలబడ్డాడు. మోహన్ గుర్తించి కళ్ళతోనే సైగ చేశాడు.

సరిగ్గా అదే సమయంలో మోహన్ షాపుమెట్ల మీదున్న డబ్బును చేతికి చిక్కించుకుందో ఆకారం. ఎలా వచ్చిందో

అలాగే మళ్ళీ చీకట్లో కలిసిపోయింది. వాసు భుజాల మీదుగా అదృశ్యం చూపిన మోహన్ ఒక్క అంగలో షాపు దగ్గరికి పరుగెత్తాడు అప్పటికే ఆ ఆకారం మాయ మయిపోయింది.

మెట్లమీద కాగితంతో చుట్టిన డబ్బులేదు!

వాసు, శేషు పరుగున వచ్చారక్కడికి.

"కొంప మునిగింది. డబ్బు గల్లంతయ్యింది. మీరు వుండి కూడా ఏం చెయ్యలేకపోయారు!" అన్నాడు మోహన్ నిష్ఠూరంగా.

"ఇంత తేలిగ్గా వదుల్తామా? ఆ భూషణాన్ని డబ్బుతో సహా పోలీసుల కప్పచెప్పమూ?" అన్నాడు శేషు.

"దొంగిలించిన వ్యక్తి భూషణం కాదు. నేను స్పష్టంగా చూశాను. అసలు భూషణానికి నే నిక్కడ డబ్బు దాచినట్టే తెలీదు" ఆవేశంలో నోరు జారిపోయాడు మోహన్.

కాని అప్పటికే ఆలస్యమయింది. డిటెక్టివ్ లిద్దరు విస్మయంగా చూస్తున్నారు మోహన్ వంక.

"అంటే, ఆ ఉత్తరం...." అర్థోక్తిలోనే ఆగిపోయాడు శేషు.

"ఆ విషయాలన్నీ తర్వాత మాట్లాడుదాం. నేను అర్జంటుగా వెళ్ళాలి. ఆ భూషణం నా పెళ్ళాం పిల్లల్ని ఏం చెయ్యబోతాడో...." పోతున్న ఆటో ఆపి ఎక్కాడు మోహన్.

వాసు, శేషు పగలబడి నవ్వుకున్నారు.

వాసు శేషు వంక చూసి, "పాపం, అన్యాయం కదూ పదివేల రూపాయలు స్వాధీనం చేసుకున్నావు. ఇచ్చేద్దామా?" అన్నాడు జాలిగా.

"నో నో, మనకు మోహన్ ఫీజు ఇవ్వనక్కర్లేకుండానే కేస్ టేకప్ చెయ్యాలనుకున్నాం. కాని మోహన్ మనల్నే మోసం చెయ్యాలని చూశాడు. అందుకే యిది పెనాల్టీ కింద వసూలు చేశాను. తను రాసిన ఉత్తరమే కాబట్టి ఎవరూ పట్టుకుపోరన్న ధీమాతో నిజంగానే పదివేలు కట్టగట్టి మెట్లమీద పెట్టాడు. పూర్ ఫెలో! ఈ డబ్బును 'ప్రధాని సహాయ నిధి'కి పంపుతాను" అన్నాడు శేషు విజయగర్వంతో నవ్వుతూ.

"అలాంటి వాడికి సరైన శిక్ష యిది! లేకపోతే కేసులో మనల్నే యిరికించాలని చూస్తాడా రాస్కెల్! స్నేహితుడన్న పదానికి కళంకం తెచ్చాడు" అన్నాడు కోపంగా వాసు. □

కామెంట్రీ జోరు?



సాగరలోయ

సీరియల్

బొమ్మిడి అచ్చారావు

(గతసంచిక తరువాయి)

ఈ దృశ్యం చూసిన వినోద్ రక్తం సలసల మరిగి పోయింది. ఒక్కసారిగా ఆ దొంగమీదకి ఉరికి వాడిని పక్కకు లాగి యీడ్చి కొట్టాడు. ఆ దొంగ మహోగ్రుడై తన చేతిలో వున్న కత్తిని వినోద్ పొట్టలో దించేశాడు.

కెవ్వుమన్నది సురేఖ!

వినోద్ పొట్టలో దిగబడిపోయింది కత్తి. వెచ్చటి ఎర్రటి రక్తం చిందింది. ఆ దొంగ వికటాట్టహాసం చేస్తూ సురేఖమీదికి మళ్ళీ దాడిచేశాడు. ఆమె చీరెను లాగి పారేశాడు. జాకెట్టు చించేశాడు. సురేఖ దీనాతిదీనంగా విలపిస్తూంది. ఆమె లంగా బొందుపైన చెయ్యి వేశాడు. మిగతా దొంగలు ఆ దృశ్యాన్ని వినోదంగా తిలకిస్తున్నారు.

వినోద్ ఆకలిగొన్న బెబ్బులిలా వాడిమీద విజృంభించాడు. తన పొట్టలో దిగిన కత్తిని లాగి ఆ దొంగ పొట్టలో కసిగా పొడిచేశాడు. ఆ దొంగ పెద్దగా అరుస్తూ నేలకూలిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో మరో యిద్దరు దొంగలు వినోద్‌మీద పడి అతన్ని కత్తులతో యిష్టం వచ్చినట్టు పొడిచేశారు.

వినోద్ నిలువునా కూలిపోయాడు. సురేఖవైపు జాలిగా చూస్తూ ప్రాణాలు వదిలేశాడు. సురేఖ గోడు గోడున విలపిస్తోంది.

దొంగలు సురేఖను వదలదలచుకోలేదు. ఒక్కసారిగా ముగ్గురు ఆమెమీద పడి మానభంగం చెయ్యటానికి సిద్ధమయ్యారు. సురేఖ తోక తొక్కిన తాచులా విరుచుకు పడింది. దొంగలవద్ద వున్న కత్తుల్ని లాక్కుని చెరో చేత ధరించింది. తనమీద పడిన దొంగల శరీరంమీద దొరికిన చోట్లల్లా బలంగా పొడిచింది. వాళ్ళు ఊహించని యీ పరిణామానికి విస్తుపోయి సర్దుకునే లోపల అంతవరకు ప్రేక్షకుల్లా నిలిచిపోయిన సరంగు, కళాసీలు దొంగలమీద మెరుపు దాడి చేశారు. దొంగల్ని గాయపరచి సముద్రం

లోకి తోసేశారు.

సురేఖ ఒక్క అంగలో వినోద్ దగ్గరికి పరుగున వెళ్ళి అతని తలను తన ఒడిలోకి తీసుకుంది. కాని అప్పటికే వినోద్ ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమయి పోయాయి.

సురేఖ అటూ యిటూ చూసింది. పక్కనే చచ్చి పడున్న ఓ దొంగ కడుపులో దిగబడివున్న కత్తిని తీసుకుంది.

"వినోద్, నేనూ నీ తోనే వచ్చేస్తున్నా!" అన్నది.

అంతే, ఆమె పొట్టలో నుండి వెచ్చటి రుధిరం చివ్వున వినోద్ ముఖంమీద చిందింది. అతనికి రక్త తిలకంలా అమరింది.

మరుక్షణం వినోద్ శరీరం మీద సురేఖ అచేతనంగా వాలిపోయింది!

40

"కత్తెర పురుగు వెళ్ళిపోయింది. ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు అవినాశ్ రాజేష్ వంక ప్రశార్థకంగా చూస్తూ.

రాజేష్ కత్తెర పురుగు ఏ దిశలో పోయిందో పరిశీలనగా చూస్తున్నాడు.

"చెట్టు దిగిపోదాం. ఈ చెట్టు విషయం ఆలోచించవలసిందే! అన్నాడు రాజేష్.

ముగ్గురు చెట్టు దిగారు. చుట్టూ దృష్టి సారించారు. కత్తెర పురుగు జాడలేదు. కుందేళ్ళు, చెవుల పిల్లులు, లేళ్ళు తిరిగి స్వేచ్ఛగా అటూ యిటూ పరుగులు పెడుతూ కేరింతలాడుతున్నాయి.

కొద్ది క్షణాలు ఏం చెయ్యాలో ఎవరికీ అర్థం కానట్టు నిల్చుండిపోయారు. అప్పటికి సూర్యుడు పశ్చిమాద్రిన అస్త

మించబోతున్నాడు.

"చీకటి పడబోతోంది. ఈ రాత్రికి యీ తీరంలోనే గడిపెయ్యటం మంచిది. దీవి లోపలకు ప్రవేశించటం వివేకమైన పనికాదు" అన్నాడు రాజేష్. ఇద్దరూ తలలూపారు.

మళ్ళీ తీరానికి వెళ్ళేందుకు వెనుతిరిగారు.

ముగ్గురు తీరానికి వచ్చారు. ఇసకమీద కూర్చున్నారు. ఎదురుగా అనంతమైన సముద్రం.

"ఈ రాత్రికి ఎక్కడ తలదాచుకోవాలి?" అన్నాడు అవినాశ్.

"చెట్లకింద, చెట్లమీద కూడా సేఫ్టీ అనిపించటంలేదు. ఈ రాత్రికి ఈ ఇసకలోనే మేనులు వాల్చి, తెల్లవార్తూనే మన అన్వేషణ కొనసాగిద్దాం" అన్నాడు రాజేష్.

అవినాశ్ "అదే మంచిదిలా వుంది" అన్నాడు.

రాజేష్ అర్చన వైపు తిరిగి, "ఆకలిగా వుందా?" అనడిగాడు. ఆమె తల అడ్డంగా తిప్పింది.

"ఎందుకో ఈ రోజంతా ఆకలి అనిపించటమే లేదు. మనసంతా నైరాశ్యం కమ్ముకున్నది" అన్నాడు అవినాశ్.

రాజేష్, అర్చన మౌనంగా తలలూపారు.

చీకటి తెర సముద్రం మీద నుండి దీవికంతకూ పరుచుకుంది. చంద్రుడి గుడ్డివెల్తురు మనుషుల ఉనికి తెల్పుకోవటానికి మాత్రమే ఉపయోగపడుతోంది.

"ఇక నిద్రపో" అన్నాడు రాజేష్ అర్చన వంక చూసి.

ఆమె ఓ పక్కకు వత్తిగిలి పడుకుని సముద్రం వైపే నిశ్చలంగా చూస్తోంది అవినాశ్ వెల్లకిలా పడుకుని చేతుల్ని ముఖం మీద కళ్ళకు అడ్డంగా పెట్టుకుని వున్నాడు. నిద్రపోలేదని అతని కదలికలు చెపుతున్నాయి.

రాజేష్ కంటికి కూడా నిద్ర కరువైంది.

ఎలాగో ఆ రాత్రి తెల్లవారింది.

రాజేష్ సముద్రం మీదుగా దృష్టిని సారించాడు. ఎక్కడా యెలాంటి నావా కనిపించటంలేదు. "అసలు ఈ సముద్రం మీదుగా ఏ ఓడరేవుకీ మార్గం లేదేమో? లేకుంటే ఒక్క ఓడైనా యీ దారిన పయనించకపోయుండేదా?" అన్నాడు రాజేష్.

ఎవరూ కాసేపు మాట్లాడలేదు.

"ఇక వెళదామా?" అన్నాడు అవినాశ్, కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నవాడిలా.

రాజేష్ లేచాడు. అర్చనా లేచింది.

ముగ్గురు తిరిగి దీవి లోపలకి వెళ్ళటానికని ముందుకు కదిలారు.

"బి కాషస్! కత్తెర పురుగు ఏ పక్కనుంచయినా మనని ఎటాక్ చేస్తుందేమో!" అన్నాడు రాజేష్ హెచ్చరికగా.

ముగ్గురు నేలమీద చూసుకుంటూ నడుస్తున్నారు.

అర్చన కెవ్వున అరవబోయి ఆగింది. ఆమె కాలికి తగిలి కొంత దూరం ముందుకి జరిగిన వస్తువు మనిషి పుర్రె!

"అవి చాలా విస్తారంగా వున్నాయి యీ దీవిలో. ఎముకలు, పుర్రెలు చూసి భయపడాల్సిన పనిలేదు" అన్నాడు రాజేష్.

దారి సుగమంగా లేదు. అన్నీ ఎగుడు దిగుడు మెట్టలు. పొదలు, డొంకలు. ముళ్ళ కంచెలు దారికి అడ్డంగా అడ్డదిడ్డంగా పడున్నాయి.

పక్షులు వింత శబ్దాలు చేస్తున్నాయి. ఎక్కడో జంతువులు తిరుగాడుతున్న సవ్వడి వినిపిస్తోంది. ఎండుటాకుల

మీద జరజర మని పాకుతున్న చప్పుడు! వికృతంగా అరుస్తూన్న తీతువు కూతలు! ప్రకృతి కళ్ళకు ఆనందం కూర్చటానికి బదులు మనసుల్ని భీతావాహం చేస్తున్నట్టు అనుభూతి కలుగుతోంది.

"వృధాప్రయాస! ఎక్కడా నరసంచారమే వున్నట్టు కనిపించటం లేదు" అన్నాడు అవినాశ్ చుట్టూ పరిశీలనగా చూస్తూ.

"ఇళ్ళు కనిపించటం లేదనుకో! అదిగో, ఆ కొండ గుహల వరకు పోయివద్దాం! అక్కడ ఎవరైనా నివాసముంటున్నారేమో?" అన్నాడు రాజేష్ అక్కడికి దగ్గర్లో వున్న కొండ గుహల వంక తర్జనితో చూపిస్తూ.

"ఇదిగో ఇక్కడ మరో అస్థిపంజర ముంది" అన్నాడు అవినాశ్ పొదల్లోకి చూపిస్తూ.

అందరు అటు చూశారు. పొదల మధ్య వున్న అస్థిపంజరం ఒంటిమీద షర్టు, పాంటు వున్నాయి. చేతులు, కాళ్ళు, ముఖం ఎముకల గూడుగా మారిపోయింది.

"బహుశా ఎన్నాళ్ళో కాలేదు. ఎందుకంటే దుస్తులు పూర్తిగా చినిగిపోలేదు. ఏ మృగం వాతపడ్డాడో, లేక ఏ విషపురుగైనా ముట్టిందో! ఎందుకొచ్చాడో!" అన్నాడు రాజేష్.

"అరె, ఇదేదో రివాల్వర్‌లాగుందే!" అన్నాడు అవినాశ్, అస్థిపంజరం పక్క పడున్న పిస్తోలును చూపి.

"అవును. బహుశా యితను కావాలనే ఈ దీవికి వచ్చాడేమో! వెంట రివాల్వర్ కూడా తెచ్చుకున్నాడంటే ప్లాన్‌డ్‌గా వచ్చివుండాలి!" అన్నాడు.

అవినాశ్ రివాల్వర్ అందుకుని, మేగజైన్ విప్పి చూశాడు. ఒక్క గుండు ఖర్చయింది, అంతే! తక్కిన

గుళ్ళు భద్రంగా వున్నాయి. ట్రిగ్గర్, సేఫ్టీ కాచ్ చూశాడు.

"కండిషన్‌లోనే వున్నట్టుంది. ట్రయిల్ వేసి ఓ బుల్లెట్ వేస్ట్ చేయట మెందుకు! అవసరపడితే ప్రయోగించి చూడొచ్చు!" అన్నాడు రాజేష్‌కి అందిస్తూ.

రాజేష్ రివాల్వర్ తీసుకుని చూశాడు. అవునన్నట్టు తలాడించాడు.

"ఈ నిర్జన దీవిలో దీని అవసరం చాలా వుంది. సమయానికి బాగానే దొరికింది, ఉండనియ్యి" అన్నాడు.

మరో నాలుగడుగులు వేశాక ఆగండి!" అన్నాడు రాజేష్. తక్కిన యిద్దరు ఆగిపోయారు

అక్కడ ఓ జింక చచ్చిపడుంది. దాన్ని చుట్టుముట్టి తెల్లటి పురుగులు కళేబరం మీదుగా పైకి కిందికి తిరుగుతున్నాయి. దాదాపు మూడు అంగుళాల పొడవున్నది ఒక్కో పురుగు. శరీరమంతా పై నుండి కిందిదాకా గుండ్రంగా పూసలు అమర్చినట్టు నిర్మితమయి వున్నది.

అప్పటికే జింకను సగానికి పైగా తినేశాయి. వాళ్ళు చూస్తుండగానే జింక రక్తమాంసాల్ని పూర్తిగా ఆరగించేశాయి. వాళ్ళ కళ్ళముందు జింక అస్థిపంజరం మాత్రం మిగిలింది.

చూస్తున్న ముగ్గురికీ ఒళ్ళు జలదరించింది. అంతవరకు తాము చూపిన అస్థిపంజరాలు కళ్ళకు కట్టాయి. అవి ఆ స్థితికి ఎందుకొచ్చాయో అర్థమయిపోయింది వాళ్ళకు.

చూస్తుండగానే ఆ తెల్లపురుగులు అక్కడి నుంచి క్యూలో నించున్నట్టుగా లైనుకట్టి పక్కనేవున్న పుట్టలోనికి వెళ్ళిపోయాయి, చాలా వేగంగా.

ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు ముగ్గురు.

"చాలా భయంకరమైన జాతి పురుగులు. చూడటానికి

చేదపురుగుల్లా వున్నాయిగాని, చూస్తుండగా జింక రక్త మాంసాలు పీల్చేశాయి" అన్నాడు అవినాశ్.

మళ్ళీ ముందుకు కదిలారు ముగ్గురు.

"ఇక ఈ దీవిలో ఎక్కడకు పోయినా మనుష్య సంచారమే వున్నట్టు కనిపించదు. మనకి ఇన్ఫర్మేషన్ యిచ్చే నాథుడే లేడా?" అన్నాడు అవినాశ్.

"అదిగో, ఆ గుహలు వెరిఫై చేసుకొని వెనక్కి తిరిగి పోదాం" అన్నాడు రాజేష్.

"మరో పది అడుగులు వేసేసరికి ఓ నీటి గుంట అడ్డు వచ్చింది.

"ఇదేమిటి ఇక్కడ ఎక్కడా నీరున్నట్టే లేదు. ఈ గుంట ఎక్కడినుంచి వచ్చింది?" అన్నాడు అవినాశ్. దిగి చూడబోతుంటే అతని రెక్కపట్టి ఆపేశాడు రాజేష్.

"ఇది మామూలు నీటి గుంటలా అనిపించటంలేదు నాకు!" అన్నాడు. ఒంగి ఓ రాయి తీసి గుంటలోకి విసిరాడు. అది వెంటనే కిందికి దిగలేదు. నెమ్మదిగా దిగి కను మరుగై పోయింది. అవినాశ్ కర్థమయిపోయింది.

"ఇది ఊబిలా వుంది!" అన్నాడు.

"అందుకే తొందర పనికిరాదన్నారు పెద్దలు!" అన్నాడు రాజేష్.

ముగ్గురు ఆ ఊబి వున్న గుంటకి దూరంగా జరిగారు. కొండ గుహల్ని సమీపించారు. లోపల నుంచి ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎవరో తిరుగాడుతున్న సవ్వడి వినిపిస్తోంది. గుహల బయట మనుషులు నివసిస్తూన్న సూచనలు ఏమీ కనిపించటంలేదు.

"లోపలికి వెళ్దామా?" అన్నాడు అవినాశ్.

"ముందు నేను చూసివస్తాను. మీ రిద్దరూ ఓ పక్కగా

యీ బండల వెనక దాక్కుని చూస్తూండండి. నేను అయిదు నిమిషాలలో రాకపోతే నువ్వు రా, అర్చనని యిక్కడే వుంచి!" అన్నాడు రాజేష్, రివాల్వర్ సరిచూసుకుని ముందుకి అడుగువేస్తూ.

"జాగ్రత్త ...!" అంటూ హెచ్చరించాడు వెనకనించి అవినాశ్.

రాజేష్ గుహ లోపలికి అడుగుపెట్టాడు.

41

అయిదు నిమిషాలు, పది నిమిషాలు....

రాజేష్ గుహలో నుంచి బయటకు రాలేదు.

అవినాశ్ మనసు కీడు శంకించింది. అర్చన మింగలేక కక్కలేక బాధపడుతోంది. అయిదు నిమిషాల్లో వస్తానన్న రాజేష్ ఏమైపోయాడు?

"నేను చూసివస్తాను" అన్నాడు అవినాశ్ బయల్దేరటానికి సిద్ధపడుతూ.

"నేను ఒక్కతెనూ వుండలేను. నేనూ వస్తాను" అన్నది అర్చన, బయల్దేరుతూ.

సరిగ్గా అదే సమయంలో రాజేష్ బయటికి పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆయాసపడుతున్నాడు.

"ఏమిటి, ఏమయింది?" ఆత్రుతగా అడిగారు అవినాశ్, అర్చన.

"ముందు యీ చెట్టెక్కండి, వివరాలు చెప్పలేను" అన్నాడు రాజేష్.

ముగ్గురూ పక్కనే వున్న చెట్టుమీది కెగబ్రాకారు.

సరిగ్గా అప్పుడే గుహలో నుండి బిలబిల మంటూ నాలుగయిదు కత్తెర పురుగులు—తామిదివరకు చూసినదానికంటె పెద్దవి—బయటికి వచ్చి నేలమీద వేగంగా పాకు

తున్నాయి.

అవినాశ్‌కి, అర్చనకి పరిస్థితి అర్థమయిపోయింది. చాలా పెద్ద గండం నుంచి బయట పడ్డాడు రాజేష్. ఆ పురుగుల్ని పట్టుకుంటే యిక ప్రాణాలతో బయట పడటం కల్ల!

కత్తెర పురుగులు అటు యిటు దేనికోసమో వెతుకుతున్నట్టు తిరుగాడుతున్నాయి. అవి పాకుతుంటే నేలమీద వింత శబ్దాలు పుడుతున్నాయి. ఈ శబ్దాలే రాజేష్ గుహ లోపలికి వెళ్ళేముందు వినిపించాయి.

కత్తెర పురుగులు రాజేష్ వాళ్ళు యెక్కిన చెట్టు కిందికి వచ్చాయి. రాజేష్ బృందం ఊపిరి తియ్యటం కూడా మాని తదేక దీక్షతో వాటివంకనే చూస్తూండిపోయారు.

అవి చేస్తూన్న శబ్దానికి ఉడతలు, చెవుల పిల్లులు పరుగులు పెట్టి పారిపోతున్నాయి. నాలుక చాచి వాటిని చాలా లాఘవంగా అందుకుంటున్నాయి ఆ పురుగులు. క్షణాల్లో కోరల మధ్య ఆ చిన్న జంతువులు నలిగిపోతున్నాయి. అవి యే క్షణంలోనయినా చెట్టు యెక్కవు కదా అనిపించేంత చురుగ్గా చెట్టుకింద అటు యిటు కదులాడుతున్నాయి. గడ్డి, చిన్న చిన్న మొక్కలు తునాతునకలయి పోతున్నాయి వాటి గమనంతో.

"ఇవి నన్ను పసికట్టాయి. నా వెంట పడ్డాయి. బహుశా వీటికి వాసనను పట్టి గుర్తించటం తెలుసునేమో! ఎక్కడికీ పోకుండా యిక్కడే తచ్చాడుతున్నాయి" అన్నాడు రాజేష్ మెల్లగా.

ఇంతలో ఒక కత్తెర పురుగు ఏదో పసికట్టినట్టు చెట్టు మొదలు దగ్గరికి వచ్చింది. చుట్టూ ఓసారి తిరిగింది.

తర్వాత చెట్టు మీదికి పాకటానికి ప్రయత్నం చేయ సాగింది.

రాజేష్ కలవరంగా చూశాడు తక్కిన యిద్దరివంక.

ఆ పురుగు పసికట్టినట్టుంది. పైకి ఎక్కటానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కాని అంతలోనే జారిపోతోంది దాని పొట్టకింద వున్న కత్తుల్లాంటి పొలుసులు దానికి పట్టుచిక్క నివ్వటంలేదు.

రాజేష్ రివాల్వర్ గురిచూసి పట్టుకున్నాడు. అవసర మైతే కాల్చెయ్యటానికి సిద్ధంగా వున్నాడు ఓ పదినిమిషాలు ప్రయత్నించి కత్తెర పురుగు తన ప్రయత్నం విర మించుకుంది. తర్వాత అది గుహవైపుకు పాకుతూ పోయింది. దాని వెనుకనే తక్కిన కత్తెర పురుగులు పాకుతూ వెళ్ళిపోయాయి. దార్లో దొరికినవాటిని స్వాహా చేస్తూనే వున్నాయి.

అవి వెళ్ళిపోయాయని నిర్ధారణయ్యాక తేలిగ్గా ఊపిరి పీల్చారు ముగ్గురు.

"ఈ దీవిలో నరమానవు డెవడూ లేడనే విషయం నిర్ధారణ అయిపోయింది. అందుకే యిలాంటి క్రూర పురుగులకి నివాసమైపోయింది దీవి! ఇక మనం యీ దీవిలో తిరగటంవల్ల ప్రమాదాలే తప్ప ఏ మాత్రం ప్రయోజనం లేదు" అన్నాడు రాజేష్.

ఎక్కడ నుంచో కమ్మటి పళ్ళ వాసన వస్తోంది.

అవినాశ్ చుట్టూ పరికించి చూసి, "అరె, మనం ఎక్కిన చెట్టు మామిడిచెట్టు అవిగో సగం పండిన మామిడి కాయలు. ఇన్నాళ్ళకి యిక్కడే చూశాను మనకు తెలిసిన చెట్టు!" అన్నాడు.

కొమ్మలకు మామిడికాయలు వేలాడుతున్నాయి. పచ్చటి

రంగుకి తిరిగాయి. అంటే చెట్టునే పగ్గిపోతున్నాయన్న మాట!

చకచక నాలుగు పళ్ళు తెంపాడు అవినాశ్.

రుచి చూశాడు. "నో డౌట్ మామిడిపళ్ళే!" అన్నాడు. ముగ్గురికీ అవి చూశాక విపరీతమయిన ఆకలి పుట్టు కొచ్చింది.

"ప్రమాదాల వలయాల్లో చుట్టుకుపోయి రెండు రోజులుగా ఆహారమే లేదన్న సంగతి మరుగున పడిపోయింది" అన్నాడు రాజేష్.

ముగ్గురూ పళ్ళు తృప్తిగా తిన్నారు

"ఇక చెట్టు దిగుదామా?" అన్నాడు రాజేష్.

"మరి ఆ కత్తెర పురుగుల సంగతి?" అర్ధోక్తిలో ఆగిపోయాడు అవినాశ్.

"ప్రస్తుతానికి గండం గడిచిందికదా! టైం ఎంతైంది?" అన్నాడు రాజేష్.

అవినాశ్ వాచీ చూసుకుని "మూడు కావస్తోంది" అన్నాడు.

"అయితే తీరానికి పోదాం. ఇక్కడి నుంచి క్షేమంగా బయటపడతామో, లేదో? యీ దీవిలోనే మన జీవితాలు ముగిసిపోతాయో? అగమ్యగోచరంగా వుంది" అన్నాడు రాజేష్ చెట్టు దిగుతూ.

అతని వెంట అర్చన, చివరగా అవినాశ్ దిగారు.

"అయితే అయిందిగాని చెట్లు ఎక్కటం దిగటం బాగా ప్రాక్టీసయింది" అన్నది అర్చన నవ్వుతూ.

"నీ కిప్పుడు బాగా ధైర్యం వచ్చేసిందికదూ!" అన్నాడు రాజేష్.

"ఎలాగూ బ్రతుకుమీద ఆశ పోయింది కదా! అందుకే

ఏం జరిగినా చిరునవ్వుతో ఎదుర్కొనగల మనస్థైర్యం అల వరచుకుంటున్నాను" అన్నదామె.

రాజేష్‌కి మనసు కలుక్కుమన్నది. సుఖంగా ఎండ కన్నెరగకుండా నీడపట్టున వుండాల్సిన ఆ యిరవయ్యేళ్ళ అమ్మాయి—తనతో సమంగా నానా కష్టాలు పడుతోంది. జీవితంలోని కష్టాలన్నీ యిప్పుడే అనుభవించేసింది! అను కున్నాడు రాజేష్.

"రాజేష్, కత్తెర పురుగు!" అరిచాడు అవినాశ్.

42

రాజేష్ త్రుళ్ళిపడి చూశాడు. ఎదురుగా నాలుక, కోరలు చాచుకొని కత్తెరపురుగు తమవంకే చూస్తోంది. అంటే అన్నీ పోయినా ఓ కత్తెర పురుగు అలా యెదురుచూస్తూనే వుండిపోయిందా తన కోసం? అంటే వీటికి పగబట్టడం, పసికట్టడం తెలుసా?

రాజేష్‌ని చూస్తూనే ఆ కత్తెర పురుగు వేగంగా దూసు కుంటూ వచ్చేసింది. ఉరుక్కుంటూ అతనిమీదికి సర్రున వచ్చేసింది.

అర్చన కెవ్వున అరిచింది.

రాజేష్ ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా రివాల్వర్ గురిచూసి పట్టుకున్నాడు.

కత్తెర పురుగు కోరల్ని బయటికి చాచి ముందరి కాళ్ళతో పైకి లేచింది. నాలుక బయటికి చాపి దాంతో రాజేష్‌ని అందుకోబోయింది. సరిగ్గా అదే సమయంలో రాజేష్ చేతిలోని రివాల్వర్ భయంకరంగా గర్జించింది. కత్తెర పురుగు వింత శబ్దాలను చేస్తూ కాసేపు కొట్టుకుంది. కాని, చావలేదు.

అది మళ్ళీ తిరగబడటానికి ప్రయత్నించింది. రాజేష్

అవినాశ్ దాని తోక పట్టుకున్నారు. కత్తెర పురుగు తన కాళ్ళతో వాళ్ళిద్దర్నీ పట్టుకోవటానికి వృధా ప్రయత్నం చేసింది. ఇద్దరూ బలంగా లాక్కుంటూ పోయి కత్తెర పురుగును ఊబి వున్న గోతిలోకి తోసేశారు.

కొద్ది క్షణాల్లోనే కత్తెర పురుగు ఊబిలోకి పూర్తిగా దిగబడిపోయింది.

"కమాన్, మనం వెంటనే యిక్కడి నుంచి తీరానికి వెళ్ళిపోవటం చాలా అవసరం! తక్కిన కత్తెర పురుగులు కూడా మనమీద దాడి చేస్తే వాటి నుంచి రక్షించు కోవటం చాలా కష్టం" అన్నాడు రాజేష్ ముందుకు పరుగు పెడుతూ.

అవినాశ్, అర్చన చకచక అతన్ననుసరించారు. పదడుగులు వేసేసరికి అనుకోని అవాంతరం యెదురయింది. రెండు తోడేళ్ళు క్రూరంగా నోళ్ళు తెరిచి ఆకలిగొన్న చూపుల్తో వాళ్ళవంకే చూస్తున్నాయి. మామూలు తోడేళ్ళ కన్న మూడురెట్లు ఎత్తున్నాయి. బలిష్టంగా వున్నాయి. ఏ క్షణంలోనైనా మీదపడి చీల్చి చెండాడేలా వున్నాయి. వాళ్ళను చూడగానే వాళ్ళ ముందుకి ఉరికాయి.

చటుక్కున ఆగిపోయారు ముగ్గురు. అవి రెండూ ఒక్కసారిగా దాడి చెయ్యబోయాయి. రాజేష్ చేతిలోని రివాల్వర్ రెండుసార్లు గర్జించింది.

తోడేళ్ళు రెండూ కిందపడి గిలగిల్లాడాయి కొన్ని క్షణాలు తర్వాత వాటిలో చలనం శాశ్వతంగా ఆగిపోయింది.

"అనుకోకుండా యిలాంటి ప్రమాదం ఎదురవుతుం దనుకోలేదు. మరో రెండు గుళ్ళు అనవసరంగా ఖర్చయి పోయాయి. ఇక మన ప్రాణరక్షణకు మిగిలినవి రెండే

రెండు!" అన్నాడు రాజేష్.

"ఏం చేస్తాం? అనుకోకుండా దొరికిన రివాల్వరే అనుకోకుండా ఎదురయిన ప్రమాదాల నుంచి రక్షించుకోవటానికి ఉపయోగపడింది భగవంతుడు మన పక్షాన వున్నాడు" అన్నాడు రాజేష్.

మళ్ళీ ముగ్గురూ ముందుకు అడుగు వేశారు.

రాజేష్ చటుక్కున ఆగిపోయి అర్చనకు అవినాశ్ కి సైగ చేశాడు.

ముగ్గురూ నిల్చిపోయారు.

వారి పక్కనుండి జరజరమని రెండు నాగుబాములు పొదల్లోకి పాక్కుంటూ వెళ్ళిపోయాయి. అవి వాళ్ళను గమనించినట్టు లేదు. దాదాపు ఎనిమిదడుగులుంటాయి ఒక్కొక్కటి.

అర్చన గుండె కొద్ది క్షణాలు ఆగి మళ్ళీ కొట్టుకున్నది. వాళ్ళెవరూ అంత పెద్ద సర్పాల్ని చూడలేదు. సాగర లోయకు పోయే దారిలో కనిపించిన పాము వీటి పరిమాణంలో సగం కూడా వుండదనిపించింది వాళ్ళకు.

మరి కొంతదూరం నడిచారు.

అయితే తీరం దగ్గిరపడలేదు. బయటికి పోయే దారి కూడా కనిపించడంలేదు. ఎంతసేపు నడిచినా డొంక దారి, పొదలు, తుప్పలు తప్ప కత్తెర పురుగు కత్తిరించిన పొదల దారి కనిపించలేదు. నేల మామూలుగానే వుంది. కత్తిరించిన జాడ కనపడలేదు.

"దారి తప్పినట్టున్నాం!" అన్నాడు మెల్లిగా రాజేష్.

"అవును. ఈసరికి దీవి తీరప్రాంతానికి తప్పకుండా చేరివుండేవాళ్ళం. బయటికి పోవటానికి మార్గం కూడా కనపడటం లేదు" అన్నాడు అవినాశ్.

చుట్టూ దట్టంగా అల్లుకున్న పొదలు!

రాజేష్ పొదల మధ్యగా దారితీశాడు. అయితే అర్చన పొదలు దాటుతుండగా ఓ విచిత్రం జరిగింది తను అడుగు తీసివేసేలోగా పొదలమీదుగా పాకిన తీగె ఆమె కాళ్ళకు అడ్డుకుంది. అయితే చిత్రంగా అది రెండు కాళ్ళకు బంధాలు వేసినట్టు బిగిసిపోయింది.

అర్చన వాటిని తప్పించుకునేందుకు ప్రయత్నం చేసే కొద్దీ, తీగె ఆమె రెండు కాళ్ళకూ బిగిసిపోయింది. ఆమె బోర్లా పడిపోబోయి కాచుకుంది.

రాజేష్, అవినాశ్ ఆమె కాళ్ళకు తగులుకున్న ఆ తీగెను అతి కష్టంమీద విడదీశారు. ఈ లోపల మరో తీగె మళ్ళా కాళ్ళకు అడ్డంపడింది. అర్చన తెలివిగా తప్పించుకోబోయే లోపల మరికొన్ని తీగెలు ఆమె కాళ్ళకు చుట్టుకుపోయి విడదీయరానంతగా బిగుసుకుపోయాయి.

రాజేష్, అవినాశ్ యెలాగో వాటిని బలవంతాన తప్పించారు. అర్చనను పొదలనుంచి చెరో చేతితోను పట్టి దాటించారు.

"ఇక్కడ జంతువులే కాదు, చెట్లు మొక్కలు కూడా చాలా ప్రమాదభరితంగా వున్నాయి. ఆ తీగెలు ప్రాణమున్న జీవుల్లో మనిషిని పట్టిబంధిస్తున్నాయి. చెట్టు ఆకులు పురుగుల్ని తింటున్నాయి. విచిత్రంగా లేదా?" అన్నాడు అవినాశ్.

రాజేష్ తలూపుతూ ముందుకి అడుగులు వేస్తున్నాడు. అర్చన, అవినాశ్ అతని వేగాన్ని అందుకోలేక వెనకబడిపోతున్నారు.

తీరం కనుచూపుమేరలో యెక్కడా కనిపించటంలేదు. ఎటు చూసినా చెట్లు, పొదలు, గట్లు కనిపిస్తున్నాయి.

"చాలా చిత్రంగా వుందే! మనం లోపలికి ప్రవేశించిన మార్గం ముగ్గుర్లో ఎవరికీ గుర్తు లేకపోవటం దురదృష్టం!" అన్నాడు రాజేష్.

పొదలను, ముళ్ళకంచెలను తప్పించుకుంటూ రాజేష్ ముందుకు అడుగులు వేస్తున్నాడు. మధ్య అర్చన నడుస్తోంది. అవినాశ్ చివరగా నడుస్తున్నాడు.

పదిగజాలు పోయాక రాజేష్ అవినాశ్‌తో ఏదో చెప్పాలని వెనుతిరిగాడు.

కాని అవినాశ్ కనిపించలేదు.

43

రాజేష్‌కి అంతా అయోమయంగా వుంది. తమ వెంట వస్తున్న అవినాశ్ అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాడు? ప్రశ్నార్థకంగా అర్చన వంక చూశాడు.

రివాల్వర్ చేత గట్టిగా పట్టుకున్నాడు. చటుక్కున వెను తిరిగాడు.

"నువ్వు యిక్కడే వుండగలవా? నేను వెనక్కి వెళ్ళి అవినాశ్ సంగతి చూస్తాను" అన్నాడు.

అర్చన తల అడ్డంగా తిప్పింది. "నేనూ వస్తాను" అన్నది.

రాజేష్ తలూపి చకచక వచ్చిన దారినే వెనక్కి వెళ్ళాడు. అర్చన అనుసరించింది.

అక్కడ వాళ్ళిద్దరికీ కనిపించిన దృశ్యం ఒళ్ళు జలదరింపజేసింది.

అక్కడ అవినాశ్ ఓ పెద్ద తోడేలుతో హోరాహోరీగా యుద్ధం చేస్తున్నాడు. అది తామిది వరకు చంపిన తోడేళ్ళ మాదిరిగానే వుంది. అవినాశ్ దాని నోటికి అందకుండా దాని కాళ్ళను గట్టిగా బంధించి కింద పడేస్తున్నాడు. అది

విదిలించుకుని అవినాశ్‌ని తన కోరల మధ్య యిరికించాలని ప్రయత్నిస్తోంది.

అవినాశ్ గుడ్డలు చిరిగిపోయాయి. తోడేలు కాళ్ళగోళ్ళ రక్కులు అతని శరీరాన్ని గాయపరిచాయి. రక్తం స్రవిస్తోంది గాయాల నుండి.

రాజేష్ రివాల్వర్ గురి చూచుకున్నాడు. కాని కాల్చటానికి వీలుగాలేదు. ఓ సారి అవినాశ్ మరోసారి తోడేలు కింద మీదవుతున్నారు. గురితప్పితే చేజేతులా అవినాశ్‌ని కాల్చేయటమే జరుగుతుంది.

రాజేష్ రివాల్వర్‌ని అర్చన చేతి కిచ్చాడు. ఒక్కసారిగా తనూ తోడేలుమీద పడ్డాడు. రాజేష్‌ని చూడగానే అవినాశ్‌కి కొండంత బలం వచ్చింది. తోడేలు తలని తన రెండు చేతుల మధ్య నొక్కిపట్టి దాని పీక నదిమి పట్టుకున్నాడు. ఈ లోపల రాజేష్ దాని కాళ్ళను వెనక్కి విరిచి పట్టుకున్నాడు.

తోడేలు ఒక్క అంగుళం కూడా కదలలేకపోయింది. చెవులు చిల్లులుపడేలా ఘూర్ణిల్లింది. అవినాశ్ దానికి ఊపిరాడకుండా పీక గట్టిగా నొక్కి అదిమాడు.

తోడేలు గిలగిల్లాడింది. ఓ పక్క రాజేష్ దాని కాళ్ళు వెనక్కి తిప్పి విరిచేశాడు. పళపళ మన్న శబ్దంతో తోడేలు కాళ్ళు విరిగిపోయాయి. అవినాశ్ ఉడుంపట్టు తప్పించుకోలేక ఊపిరి తీసుకోలేక కొద్ది క్షణాల్లోనే ప్రాణం వదిలేసింది తోడేలు.

అవినాశ్ రిలాక్సింగా కూచుండిపోయాడు అక్కడి పచ్చిక మీద అతని గాయాల నుండి యింకా రక్తం స్రవిస్తూనే వుంది. రాజేష్ రక్తం తుడిచాడు. గాయాలు ప్రమాదకరమైనవేం కాదు.

"మీరిద్దరు ముందు నడుస్తున్నారు. ఇంతలో ఈ తోడేలు ఎక్కడి నుంచో నా మీద ఉరికింది. నేను మిమ్మల్ని పిలవటానికిగాని, నేను తప్పించుకోవటానికిగాని స్కోప్ లేకపోయింది. దాన్ని ఎదుర్కొన్నాను. ఇంతలో మీరు తిరిగి వెనక్కొచ్చారు" అన్నాడు అవినాశ్.

"ఈ తోడేళ్ళు చాలా ప్రమాదకరంగా పరిణమించాయి. ఇప్పటికి మూడు చచ్చాయి. ఇంకా మరెన్ని వున్నాయో యీ దీవిలో, ఏ క్షణంలో మీద పడతాయో....?" అన్నది అర్చన.

"ఇవి నిజానికి తోడేళ్ళు కాదు. ఆ ఆకారంలో వున్న భయంకర జంతువులు! వాటి కోరలు చూశావు కదూ, వాటికి చిక్కితే క్షణాలమీద మనల్ని చీల్చి తినేస్తాయి" అన్నాడు రాజేష్.

"నువ్వు బాగా అలసిపోయినట్టున్నావు, నడవగలవా?" అన్నాడు మళ్ళీ రాజేష్ అవినాశ్‌ని.

"నడవ గలను. గాయాలు బలమైనవి కావు. చర్మం చీరుకుపోయిందంతే!" అన్నాడు అవినాశ్ లేచి నించుంటూ.

ముగ్గురు మళ్ళీ ముందుకి కదిలారు.

"మనం తీరం నుంచి దీవిలోకి ప్రవేశించిన దారి పూర్తిగా మరిచిపోయాం. ఈ సారి మరో పక్కనుంచి బయటికి దారి కోసం ప్రయత్నించాలి!" అన్నాడు రాజేష్.

"అదిగో, ఆ పక్కనుంచి మనిషి వెళ్ళగల జాగా కనిపిస్తోంది" అన్నాడు అవినాశ్ అటు చూపిస్తూ.

ముగ్గురు అటు కదిలారు.

ఆ చెట్టు చూశావా రాజేష్, చూడటానికి మర్రిచెట్టు లాగా లేదుగాని, ఎంత పెద్ద ఊడలు వేసిందో? చెట్ల ఆకులు అరట ఆకుల్లా యెంత పొడవుగా వున్నాయో!" అన్నాడు

అవినాశ్.

ఆ చెట్టుకి అల్లంత దూరంలోనే ఆగిపోయారు ముగ్గురు. వాళ్ళ సంభ్రమానికి కారణం ఆ చెట్టుకు వేలాడుతున్నది ఊడలు కాదు—పొడవాటి కొండ చిలువలు!

ముగ్గురి వెన్నున భయం జరజర పాకింది.

"గాడ్! ఇన్ని కొండచిలువల్ని ఒక్కసారిగా ఆ భయంకర దీవిలో కూడా చూడలేదు!" అన్నది అర్చన గుండెల మీద చెయ్యి వేసుకుంటూ. ఆమెకు తనని అందుకోబోయిన కొండ చిలువ గుర్తొచ్చింది — నల్ల కోతులున్న దీవి లోనిది!

"అటు వెళ్ళటం ప్రమాదకరం! మనకి మిగిలిన ఒకే దారి యీ ఎడమచేతి వైపు వున్న పొదల దారి! పొదల మధ్యనించి దారి చేసుకుని బయట పడాలి" అన్నాడు రాజేష్

అందరి దృష్టి కొండ చిలువల మీద నుంచి పొదల వైపు మళ్ళింది.

నిశ్శబ్దంగా ఆ ఎడమ వైపు పొదల వైపుగా నడిచారు. చుట్టు ఎటు చూసినా పొడవాటి బళ్ళేలా వున్న ముళ్ళతో పొదలు! వాటి మధ్య నుంచి ఎలా నడవాలి?

పొదల మీదుగా ఓ చెట్టుకొమ్మ వాలివున్నది ఆ కొమ్మ ఆధారంతో ముళ్ళపొదల మీదుగా అవతల వైపుకు సురక్షితంగా చేరుకోగలమా అని ఆలోచిస్తున్నాడు రాజేష్.

అర్చన వంక చూపి, "కొమ్మ మీదుగా అవతలి వైపుకు దుమకగలవా?" అనడిగాడు.

ఆమె కొమ్మవైపు పొదలవైపు మార్చి మార్చి చూపింది. దూకగలనని తలాడించింది.

"అవినాశ్ ముందుగా కొమ్మ మీదుగా నేను పొదల

అవతలి వైపుకి ఉరుకుతాను. ఆ పక్క దిగటానికి అను కూలంగా వుంటే మీరు కూడా దిగొచ్చు" అన్నాడు రాజేష్.

కొమ్మ అందుకొన్నాడు. ముళ్ళపొదల మీదికి కాళ్ళు వాలకుండా చూసుకుని, అవతలి వైపుకి ఉరికాడు. అక్కడ నేలమీద ఒత్తుగా పచ్చిక వున్నది. కాళ్ళకు మెత్తగా తగిలింది. అంటే బాగా ఎత్తుగా పెరిగిందన్న మాట! నేల మీదికి ఉరకబోయే ముందు తలివంచి చూశాడు రాజేష్!

ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. పచ్చిక ఒత్తుగా పెరిగిన మాట నిజమే! కాని వాటి మధ్య ఎర్రటి పెద్దసైజు ఎండ్రకాయల ఆకారంలో వున్న పురుగులు కులకుల్లాడుతు పచ్చికలో అటు యిటు తిరుగుతున్నాయి. పదులు, వందలు కాదు— వేల సంఖ్యలో వున్నాయి.

అవి ఎండ్రకాయలు కాదు, ఎర్ర మండ్రగబ్బలని గుర్తు పట్టేసరికి రాజేష్ ఒళ్ళంతా చెమట్లతో తడిసిపోయింది. కిందికి ఉరకటం ఎంత ప్రమాదకరమో అర్థమై అలాగే కొమ్మని పట్టుకుని వేలాడుతూ ఉండిపోయాడు.

44

అవినాశ్ రాజేష్ కొమ్మని పట్టుకుని వేలాడుతూ వుండి పోవటం గమనించి, అవతలి పక్క ఏదో ప్రమాదం ఎదు రయి వుండొచ్చునని గ్రహించాడు.

"రాజేష్, ఏం జరిగింది?" అన్నాడు బిగ్గరగా.

రాజేష్ నించి సమాధానం రాలేదు. అవినాశ్ ఆలస్యం చెయ్యకుండా చెట్టుపైకి ఎగబాగాడు. రాజేష్ ఆధారంగా పట్టుకున్న కొమ్మవైపు పాకుతూ వెళ్ళాడు.

రాజేష్ పట్టు అప్పటికే సడలిపోతోంది. అయినా అలాగే వేలాడుతున్నాడు. కొమ్మపైకి రావాలని ప్రయత్ని

స్తున్నాడు.

పరిస్థితి గమనించిన అవినాశ్ వెంటనే చేయి అందించాడు రాజేష్‌కి. ఓ చేత్తో కొమ్మని, మరో చేత్తో అవినాశ్ చేతిని ఆసరాగా తీసుకొని కొమ్మమీదికి చేరాడు రాజేష్.

అవినాశ్ కింద పచ్చికలోకి చూస్తూ, "చాలా పెద్ద గండం గడిచింది. ఒక్కసారిగా అన్ని మంత్రదగబ్బలు చుట్టుముట్టి .. ఓహో, శరీరమంతా తూట్లు పొడిచి వుండేవి!" అన్నాడు.

రాజేష్ చెట్టుపై కొమ్మమీదికి ఎగబాకి చుట్టూ పరిశీలనగా చూశాడు. కనుచూపు మేరలో ఎక్కడా సముద్రతీరం కనిపించటం లేదు. ఈ దీవి మరీ పెద్దదిలా వుంది. ఏవైపు చూసినా చెట్లు, పుట్టలు, గుట్టలు!

"అదిగో ఆ వైపు చూడు, యిసుక మేట కనిపిస్తోంది. దాని అవతల బహుశా సముద్రం వుండి వుండొచ్చు!" అన్నాడు రాజేష్.

అవినాశ్ ఆ వైపు దృష్టి సారించాడు. "అలాగే అనిపిస్తోంది. చాలా ఎత్తయిన యిసక మేట! అందుకే ఆ మేటకి అవతలి ఏమున్నదీ కనిపించటం లేదు" అన్నాడు.

రాజేష్ మరోపక్కకి దృష్టి మరల్చి "అదిగో, కత్తెర పురుగుల నివాస స్థలం—కొండ గుహ! మనం కత్తెర పురుగుతో పోరాడిన స్థలం — దాని పక్కగా ఊబి వున్న గుంట కనిపించాయా?" అన్నాడు.

"ఎస్! కత్తెరపురుగులు పాకిన దారి స్పష్టంగా కనిపిస్తోంది—ముక్కలు తెగిన నేల, మొక్కలు. మరి మనం లోపలికి ప్రవేశించిన దారి కూడా కనిపించాలిగా, కనపడదేం?"

"మన కుడిపక్క మార్గం కనపడకుండా దట్టమైన చెట్లు

అడ్డు వస్తున్నాయి. అవతలి పక్క నుంచి మరో చెట్టెక్కి చూస్తే కుడిపక్క దీవి కూడా కనిపిస్తుంది...." అని రాజేష్ అంటుండగానే, బుల్లెట్ పేలిన శబ్దం వినిపించింది.

ఇద్దరు ఒకేసారి కిందికి చూశారు తుళ్ళిపడి అంతదాకా అర్చన విషయమే గుర్తులేదు.

అర్చన చేతిలోని పిస్తోలు పొగలు చిమ్ముతోంది. ఆమెకి అతి సమీపంలో ఏదో జంతువు నేలమీద గిలగిల కొట్టు కుంటోంది.

రాజేష్ ఒక్క ఉదుటున చెట్టుమీది నుండి కిందికి గెంతాడు. అతని వెంటనే అవినాశ్ కిందికి ఉరికాడు.

చూడటానికి అడవి దున్నలా వున్న ఆ జంతువు చివరి శ్వాస తీసుకొంది. దాని శరీరం నిండా పొదలు! చూడ టానికే అసహ్యం పుట్టించే ఆకారం.

"మీరు చెట్టుమీద వుండగా పొదల్లో అలికిడి అయింది. మీరు యిచ్చిన రివాల్వర్ నా దగ్గిరే వుందికదా! దాన్ని గురి చూపి పట్టుకున్నాను. ఈ జంతువు పొదల్లో నుంచి నా వైపు పరుగెత్తుకొచ్చింది. వెంటనే కాల్చేశాను" అన్నది అర్చన ఆయాసంతో మధ్య మధ్య ఆగుతూ.

రాజేష్ ఆమె వంక ప్రశంసగా చూశాడు.

"చాలా ధైర్యంగా వ్యవహరించావు. లేకుంటే యీ జంతువు యీ పాటికి నిన్ను పొట్టన బెట్టుకుని వుండేది" అన్నాడు.

"మనం చూసిన దీవులన్నిటి కన్న అతి ప్రమాదకర మైన దీవి యిది! ఏదో విధంగా తప్పించుకుని బయట పడకపోతే ప్రాణాలు దక్కేలా లేవు" అన్నాడు అవినాశ్. అతనికి వుండి వుండి గాయాలు బాగా నొప్పి పెడు తున్నాయి. మంటలేస్తోంది.

"ఇసక మేట కనిపించిన దిశ గుర్తుంది కదూ! అటు దారి చేసుకుని వెళ్దాం. అది సముద్ర తీర ప్రాంతమేనని నాకు గట్టిగా నమ్మకం కలుగుతోంది" అన్నాడు రాజేష్.

అవినాశ్ మనసులో ఆ మేట, పరిసరాలు చిత్రంగా ముద్రపడిపోయాయి, మనసు కాన్వాసుమీద. ఓసారి కళ్ళు మూసి తెరిచాడు.

"ఓ.కే. ఫాలో మీ! నేను తీసుకుపోతాను" అన్నాడు ముందుకు దారి తీస్తూ.

రాజేష్. అర్చన చేతినుంచి రివాల్వర్ అందుకున్నాడు. ఇక ఒకే ఒక్క గుండు మిగిలింది! అదీ అయిపోయాక..? ఇక ఎంతో కాలం తాము ఆ దీవిలో సురక్షితంగా వుండ గలగటం జరగని పనని అతనికి తెలుసు!

అవినాశ్ వేగంగా ముందుకి కదుల్తున్నాడు. ఓ వెదురు బొంగును విరిచాడు. దానితో పొదలని పక్కకి తొలగించి దారి చేస్తున్నాడు. అతని వెనుకనే అర్చన, రాజేష్ నడుస్తున్నారు.

అవినాశ్ తదేక దీక్షతో ముందుకి దారి చేసుకుంటూ నడుస్తున్నాడు. రాజేష్ చుట్టూ పరీక్షగా పరికించి చూస్తున్నాడు. ఏ క్షణంలో ప్రమాదం ఏ రూపాన విరుచుకు పడుతుందో ఊహించటానికి వీల్లేకుండా వుంది.

అవినాశ్ ముందుకి పోతున్నవాడల్లా చటుక్కున ఆగిపోయాడు. అక్కడ అంతా సువాసనలు వెతజల్లుతున్న మొగిలి పొదలు! అంటే క్రూర విషసర్పాలకి నిలయాలు!

"రాజేష్, బి కేర్‌ఫుల్! ఇక్కడ మొగిలి పొదలు చాలా జాస్తిగా వున్నాయి. విషసర్పాలు ప్రమాదం హెచ్చుగా వుంది" అన్నాడు అవినాశ్. అతని మాటలు పూర్తి కానే లేదు. ఎదురుగా మొగలి పొదలలో బిలబిల మంటూ నాగు

బాముఁలు గుంపులుగా కనిపించాయి.

అవినాశ్ వెనక్కి అడుగు వేశాడు.

"ఈ దారి చాలా ప్రమాదకరం! వెనక్కి పోదాం" అన్నాడు.

అర్చన, రాజేష్ పాముల వంక విస్తుపోయి చూశారు. అన్ని రకాల సర్పాల్ని ఒకచోట చూడటం అదే మొదటి సారి. తెలుపు, గోధుమవర్ణం, రక్తవర్ణం, యింకా అనేక రంగుల మిశ్రమాలతో వున్న క్రూర సర్పాలు. కులకుల్లాడుతూ వానపాముల్లాగా అటుయిటు తిరుగుతున్నాయి. మొగలి పొదల్లోంచి బయటకు వస్తున్నాయి, లోపలికి వెళుతున్నాయి.

ఏ మాత్రం చప్పుడు చెయ్యకుండా వెనుతిరిగారు ముగ్గురు. కొన్ని గజాలు వెనక్కి వచ్చేశాక, మరో దారిన ముందుకి కదిలాడు అవినాశ్.

రాజేష్ మనోపథంలో యిసుక మేట వేపిన దిశ మెదులోంది. అది దాదాపు సమీపించిన చివరి క్షణాల్లో యీ పాముల బెడద దాపురించింది.

కాని యింతలోనే అనుకోని మరో ప్రమాదం యెదురయింది.

45

ముందుగా నడుస్తున్న అవినాశ్ మీదికి ఒకేసారి రెండు ప్రక్కల నుండి దాడి చేసిన ఆ పురుగులు, అక్కడి కక్కడే నేలని తొలుచుకుంటూ పైకొచ్చాయి. చూడటానికి పురుగుల్లా వున్నా, వాటికి పొడవైన తొండాలున్నాయి. ఒకటి, రెండు కాదు - వందల సంఖ్యలో పుట్టుకొచ్చాయి.

అవినాశ్ చటుక్కున ఆగిపోయాడు.

వెనక్కి తిరిగి అర్చన, రాజేష్ వంక హెచ్చరికగా

అరిచాడు: "ఇదివరకు జింక రక్త మాంసాలు పీల్చేసిన తెల్ల పురుగుల్లాంటివి యిక్కడా వున్నాయి. వీటికి తొండాలుకూడా వున్నాయి. వెనక్కి పరుగెత్తండి" అన్నాడు.

అప్పటికే కొన్ని పురుగులు అతని కాలికి పట్టుకుని జలగల్లా రక్తం పీల్చెయ్యసాగాయి.

అవినాశ్ ఒక్క గంతువేశాడు పక్కకి. బలవంతాన వాటిని విడిపించుకున్నాడు. కాని అప్పటికే వందల సంఖ్యలో అవి చొచ్చుకుంటూ వచ్చేశాయి.

అవినాశ్ మరో గంతువేశాడు. కొన్ని పురుగులు అతని కాళ్ళకింద నలిగిపోయాయి. అర్చన, రాజేష్ అతనికి సాయం వచ్చారు. తొండం పురుగులకి దొరక్కుండా అతన్ని తప్పించి వేగంగా సురక్షిత ప్రదేశానికి లాక్కుపోయారు.

అప్పటికే అవినాశ్ కాళ్ళ గాయాల ద్వారా రక్తం స్రవిస్తోంది. ఆ ప్రదేశంలో బాగా నొప్పి, బాధ సలుపుపెట్టుతున్నాయి.

రాజేష్ బాధగా చూశాడు అవినాశ్ వంక.

"ఈసారి ముందు నేను నడుస్తాను. ప్రతిసారీ నువ్వే రిస్క్ తీసుకుంటున్నావు. బాగా గాయపడి పోతున్నావు" అన్నాడు.

"వెనక వుంటే మాత్రం రిస్క్ వుండదా? మనలో ఎవరికి బాధ కలిగినా ఒకటే కదా!" అన్నాడు అవినాశ్ నొప్పి మరిచి నవ్వుతూ.

రాజేష్ జాలిగా చూశాడు స్నేహితుడి వంక.

"మనమెంత ప్రయత్నించినాతీరం చేరలేక పోతున్నాం.

ఇక్కడ అడుగు తీసి అడుగు వెయ్యటమే బ్రహ్మప్రళ యంగా వుంది" అన్నాడు.

"ఇదిగో యీ తొండం పురుగులు మనల్ని ఆటంక పరిచాయి. వాటినుంచి తప్పించుకోగలుగుతామనుకోలేదు. ఈ పాటికి నేనూ యీ దీవిలోని అస్థిపంజరాలతో జమ కావలసి వుండేవాడ్ని" అన్నాడు అవినాశ్.

"జాగ్రత్తగా నడువు. అదిగో యిసక మేట యిక్కడికి కనిపిస్తోంది. ఓ పది నిమిషాల నడక!" అన్నాడు రాజేష్.

ముగ్గురు పక్క దారిన మళ్ళీ నడక సాగించారు.

అవినాశ్ వారిస్తున్నా వినక రాజేష్ ముందు నడుస్తున్నాడు. మధ్య అర్చన, వెనక అవినాశ్ నడుస్తున్నారు. ఇసక మేట దగ్గిరపడింది.

ఇంతలో అర్చన అరిచింది "రాజేష్!" అని.

రాజేష్ త్రుళ్ళిపడి చూసేలోపల రాజేష్‌మీద చెట్టుమీదినుంచి ఏదో ఆకారం గెంతింది. అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

రాజేష్ అనుకోని యీ అదురుకు తట్టుకోలేక కింద పడిపోయాడు. ఆ నల్లటి ఆకారం రాజేష్‌మీద కూచుని కంఠం పట్టుకోబోయింది.

అర్చన గుండె జల్లుమంది.

అవినాశ్ ఒక్క క్షణం వృధా చెయ్యలేదు. కిందపడ్డ రివాల్వర్‌ని తీసి ఆ నల్లటి ఆకారాన్ని గురిచూసి కాల్చేశాడు. గుర్రుమంటూ ఆక్రందనచేస్తూ నేల వాలిపోయింది ఆ ఆకారం. కొద్ది క్షణాలు గిలగిల కొట్టుకుని ప్రాణాలు వదిలింది.

అప్పుడు తేరిపార చూశా రా ఆకారాన్ని ముగ్గురూ!

అది నల్ల చిరుతపులి!

"అరె, యిలాంటి చిరుతపులిని యిదివరలో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో చూశాను. దానికన్న పరిమాణంలోను, ఆకారంలోను యిది చాలా రెట్లు భయంకరంగా వుంది" అన్నాడు రాజేష్.

అర్చన గుండె యింకా, వేగంగా కొట్టుకుంటూనే వుంది! నోటి తడారిపోయింది. అవినాశ్ వంక కృతజ్ఞతగా చూసింది.

అవినాశ్ అన్నాడు: "ముందుగా ప్రమాదాన్ని గుర్తించినది మిస్. అర్చనే. నువ్వూ, నేను కూడా పరధ్యానంగానే నడుస్తున్నాం. చాలా అదృష్టవంతులం! క్షణంలో ప్రమాదం తప్పిపోయింది."

"నీకు కృతజ్ఞతలు తెలుపుకోవటమంటే నన్ను నేనే పొగుడుకోవటం లాంటిది. అందుకే నీకు కృత్రిమమైన ఆ ఫార్మాలిటీ చెప్పటం లేదు" అన్నాడు రాజేష్, అవినాశ్ వంక ఆరాధనగా చూస్తూ.

అవినాశ్ కళ్ళతోనే రిసీవ్ చేసుకున్నాడు.

"ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా ఇక్కడినుండి బయటపడాలి! ఇక ప్రమాదాల నెదుర్కొనే ధైర్యంగాని, ఓపికగాని మనకు లేవు. కమాన్ మూవ్!" అన్నాడు రాజేష్.

రాజేష్‌లాంటి ధీరోదాత్తుడి నోట అలాంటి మాటలు వినవలసి వస్తుందనుకోలేదు అవినాశ్‌కు.

అదే అన్నాడు: "ఎంత మృత్యు ముఖంలో వున్నా చెక్కుచెదరకుండా వుండగల శక్తినిచ్చేది ఆత్మవిశ్వాసం, మనోదారుఢ్యం! అవి లోపిస్తే అనుక్షణం జీవితం నరకప్రాయమవుతుంది."

అర్చన ప్రశంసగా చూసింది అవినాశ్ వంక.

రాజేష్ తానన్న మాటల్లోని అనౌచిత్యాన్ని గ్రహించి సిగ్గుపడ్డాడు.

చిరుతపులి వంక మరోసారి చూశాడు. చచ్చాక ఇంకా భీకరంగా వుంది నల్లచిరుత!

"ఈ రివాల్వర్‌తో ఇంక పనయిపోయింది. ఇక గుళ్ళు లేనట్టే కదూ!" అన్నాడు అవినాశ్.

"కీపిట్ విత్ యు! దాని అవసరం లేదని ఏం చెప్ప గలం?" అన్నాడు రాజేష్.

అంతలో దూరంనుంచి 'భౌభౌ' అంటూ అరుస్తూ వస్తున్న గుంపును చూడగానే అందరి గుండెలూ అవిసి పోయాయి.

"కమాన్, అవినాశ్. చూడబోతే అవి వేటకుక్కల్లా వున్నాయి. వీటికి చిక్కితే ఖండ ఖండాలుగా చీల్చేస్తాయి మనల్ని. పరుగెత్తండి!" అన్నాడు రాజేష్, అవినాశ్ అర్చనలవంక చూసి.

ముగ్గురూ శక్తికొద్దీ ముందుకు పరుగులు పెట్టారు. వేటకుక్కలు వాళ్ళకి అతి సమీపంలోకి వచ్చేశాయి.

ముందు రాజేష్, వెనుక అవినాశ్, కొంచెం వెనకగా అర్చన— ఇసుకమేటవైపు పరుగు తీస్తున్నారు.

అర్చన బాగా వెనకపడిపోయింది. రాజేష్ ఆగి, ఆమె చెయ్యి అందుకుని పరుగులు పెట్టించాడు. అర్చన ఆయాసంతోను, టెన్షన్‌తోను పరుగెత్తలేక మధ్యలో ఆగి ఆగి, రాజేష్ తొందర పెట్టడంతో పరుగెత్తుతోంది.

వేటకుక్కలు మరింత దగ్గరగా వచ్చాయి. ఈసారి వాటి ఆకారాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇదివరలో చూసిన తోడేళ్ళుకన్న బలిష్టంగా భీకరంగా వున్నాయి.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 57 : మన్సూబాయ్ పటేల్‌కు ప్రామిసరీ నోటు వ్రాసి వెంకట్ రు. 6000/- లు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పుకు రామారావు హామీగా ఉన్నాడు.

మూడు సంవత్సరాలు గడిచి నోటుకు కాలదోషం పట్టింది.

పటేల్ డబ్బు చెల్లించమంటే వెంకట్ చెల్లించలేదు. దానితో పటేల్ రామారావు నడిగాడు.

ప్రామిసరీ నోటుకు కాలదోషం పట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత నరసింహారావుదనీ, అలా చేయకపోవటంవల్ల తన హామీ రద్దయిందనీ రామారా వన్నాడు.

న్యాయనిర్ణేతగా మీ తీర్పేమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-6-'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు ఆగస్టు '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 55 (తీర్పు)

నాగమణి చిల్లర తీసుకోనవసరం లేదు.

పదిహేను రూపాయలు మించిన చిల్లర చట్టరీత్యా చెల్లదు. కనుక పాపమ్మ కరెన్సీ ఇచ్చి ఉంగరం విడిపించుకోవలసిందే.

ఈ నెల న్యాయనిర్ణేత : శ్రీ డి. శివప్రసాద శర్మ, C/o. జి. సూర్య ప్రకాశరావు, రిటైర్డు కాన్‌స్టేబుల్, పుట్టవారి స్ట్రీట్, నాజర్ పేట, తెనాలి (గుంటూరు జిల్లా).

నాలుకలు బయటకు చాచుకుని పరుగులు పెట్టుకుని వస్తు న్నాయి. గోధుమరంగులో వున్న కోరపళ్ళు చీల్చి చెండాడ టానికి సిద్ధంగా చూస్తున్నాయి.

రాజేష్, అవినాశ్, అర్చన వెనక్కి చూడకుండా మేటవైపు పరుగెడుతూనే వున్నారు, వేటకుక్కలు తరుముతూనే వున్నాయి.

ఇసుకమేట సమీపించింది. ముగ్గురూ ఇసుకమేటపై కాళ్ళు మోపారో లేదో, ఒక్కసారిగా లోపలికి కూరుకుని పోయారు!

16

కాసేపటివరకు తామెక్కడున్నారో అర్థం కాలేదు రాజేష్, అవినాశ్, అర్చనలకు.

ఇసుకలో కూరుకుపోయిన తాము ఏదో చీకటి కోణం లాంటి గదిలో పడిపోయారు. ఎక్కడి నుంచో సన్నటి వెలుగు కిరణం లోనికి పడుతోంది.

ఆ గుడ్డి వెల్తుర్లో లోపల కళ్ళు చికిలించుకుని పరీక్షగా చూశారు ముగ్గురూ. కాసేపటికి చీకటికి అలవాటుపడ్డ కళ్ళకు లోపలి దృశ్యం అస్పష్టంగా కనిపించి, తర్వాత స్పష్టంగా కనిపించింది.

ముగ్గురికీ ఆశ్చర్యంతో నోటమాట రాలేదు.

ముందుగా రాజేష్ పెదవి విప్పాడు: "చూడగా ఇదేదో షిప్ తాలూకు గదుల్లా వున్నాయి. ఎప్పుడైనా షిప్ వచ్చి దీనికి గుద్దుకుని మునిగిపోయి వుండొచ్చునని నా అభి ప్రాయం!" అన్నాడు.

"తీరాన్ని చేరుకున్నాక వాళ్ళ నావ ఎందుకు మునిగి పోయింది? లంగరు వెయ్యటంలో విఫలమయ్యారా, లేక బరువెక్కువయిందా? చూడగా చాలా పెద్ద షిప్పులా

అపరాధ పరిశోధనపోటీ-179

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-6-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. తమిళుల దాహం తీర్చటానికి ఆంధ్ర రాష్ట్రం రూపొందించిన పథకం—? (తెలుగు గంగ, గోదావరి జల్లి.)

2. ఈ నగర వాసులకు కూడా యీ ఏడు మంచి నీటి సమస్య ఎదురైంది—? (మద్రాసు, హైద్రాబాద్.)

3. ఒకనాడు అసామాన్యులకు మిత్రుడు, నేడు సామాన్యులకు మిత్రుడు—? (టీ, సిగరెట్టు.)

4. ఈ రాష్ట్రమంటె కేంద్రానికి మొదటి నుంచి భయమె—? (పంజాబు, కాశ్మీరు.)

5. కొన్ని మతాల వారు తలమీద దీనిని ధరిస్తారు—? (తలపాగ, టోపి.)

వుంది!" అన్నాడు అవినాశ్.

"నా ఉద్దేశంలో ఇది సముద్రం మధ్యలోనే ఏవో కార ణాలవల్ల దెబ్బ తినివుంటుంది. ఆది తర్వాత తీరానికి కొట్టు కొచ్చి యీ దీవిలో చిక్కుకుంది!" అన్నాడు రాజేష్.

తక్కిన ఇద్దరూ తలలూపారు.

బయట వేటకుక్కలు భౌభౌ మంటున్న అరుపులు కొద్దిసేపు వినిపించాయి. తర్వాత అంతటా నిశ్శబ్దం!

కుక్కలు పోయినట్టుంది! ఇసుకలో కాలు మోపి వుండవు. లేకుంటే అవికూడా మనతోపాటే లోపలికొచ్చి పడుండేవి!" అన్నాడు రాజేష్ మళ్ళీ.

"నయం, యీ షిప్పులో పడుండకపోతే యీపాటికి వాటి కోరల మధ్య నలిగిపోయుండేవాళ్ళం! ఎదురుగా సముద్రం వున్నా, దాటుకుపోగల సాధనాల్లేవుగా! ఈ మేట మీదికి యథాలాపంగా కాలు మోపాం" అన్నాడు అవినాశ్.

"సరే, ముందు యీ షిప్పు నోసారి కలయతిరుగుదాం! ఏమైనా ఆధారాలు, వివరాలు దొరుకుతాయేమో...." అన్నాడు రాజేష్.

షిప్పుకు చాలా గదులున్నట్టున్నాయి. పైకి కూడా మెట్లున్నాయి. కిందికి తాడు నిచ్చెన ఏదో వేళ్ళాడుతోంది, గాని ఆ లెవెల్‌కు నీళ్ళు వచ్చేసినట్టు లోపల చెమ్మగా వుంది.

పక్కనే వున్న ఓ గదిలోకి వెళ్ళారు. అక్కడ పొడవు పాటి మేజా బల్ల వుంది. దాని మీద కొన్ని డబుల్ బార్ పిస్తోళ్ళు, కొన్ని కత్తులు వున్నాయి.

వాటిని చూస్తూనే రాజేష్ అన్నాడు: "ఇది యుద్ధనౌక. ఆయుధాలు బట్టి చాలా తేలిగ్గా చెప్పొచ్చును!"

''హోమ్ డెలివరీ''

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

బుల్లెట్స్ కూడా టేబిల్ మీద చాలా రౌండ్స్ వున్నాయి. రాజేష్ అవినాశ్ వాటిని పరీక్షగా చూశారు.

"ఇవి తుప్పు పట్టినట్టున్నాయి ఉప్పుగాలికి. బహుశా పని చెయ్యకపోవచ్చును!" అన్నాడు రాజేష్. అవినాశ్ యింకా పరిశీలిస్తున్నాడు.

"ప్రయోగించి చూద్దామా? ఇక్కడ కాదులే, పైకి తీసుకుపోయాక!" అన్నాడు అవినాశ్.

రాజేష్ మౌనంగా తలూపాడు.

ముగ్గురూ మరో గదిలోకి వెళ్ళారు. అర్చన సన్నగా అరవబోయి మానేసింది!

అక్కడ రెండు అస్థిపంజరాలున్నాయి!

రాజేష్ వాటిని చూసి, "ధైర్యం వహించు! మనకి యీ దీవి నిండా యివే దృశ్యాలు! చూపి చూపి మనసు మొద్దుబారిపోలేదూ? అన్నాడు అర్చన చెయ్యిపట్టి నొక్కుతూ.

ఆమె భయభయంగా తలూపింది.

"బహుశా ప్రమాదంలో నౌక చిక్కాక ఆహార పదార్థాలు దొరకకో, లేక నౌక ఏ రాతికో కొట్టుకున్న అదుటుకో నౌకలోని వాళ్ళు చనిపోయివుంటారు!" అన్నాడు రాజేష్.

"ఇది యుద్ధనౌకే అయివుంటే నావికాదళం చాలా హెచ్చుసంఖ్యలో వుండాలి కదా! బొత్తిగా రెండే అస్థి పంజరాలెందుకుంటాయి? యుద్ధనౌక కాదేమో!" అను మానం వెలిబుచ్చాడు అవినాశ్.

రాజేష్ వెంటనే మాట్లాడలేదు.

నౌకలో యింకా గదులుండేవేమో, చీకటి కారణంగా వుండటంవల్ల మరేం కనిపించటంలేదు,

అపరాధ పరిశోధన పోటీ-177

[ఫలితాలు]

ఏప్రెల్ '83 నెల "అపరాధ పరిశోధన పోటీ—177"కి సరియైన సమాధానాలు:

1. అస్సాం ఎన్నికలు.
2. సంగీతం.
3. మనోవ్యాధి.
4. పన్నులు.
5. దూరదర్శన్.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూలై '83 నెల నుంచి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి వి. రత్నమాల,
c/o వి. వెంకట్రామయ్య,
8-4-32, శ్రీకిషన్ కాలనీ,
వరంగల్ - 506 002.

(2) శ్రీ కె. రామారావు,
3-1-438/1, నింబోలి అడ్డ,
హైదరాబాదు - 500 027.

అవినాశ్ ఆగి వింటున్నాడు.

"ఏమిటది?" అడిగాడు రాజేష్.

"ఏదో శబ్దం వస్తోంది, అడుగు నుండి."

"అడుగున సముద్రపు నీరుంటుంది. దాని శబ్దం వినిపిస్తుండొచ్చు."

"నీటి గలగల శబ్దంకాదు. సరిగ్గా విను!"

ఈసారి ఆ శబ్దాలు మరింత స్పష్టంగా తమకి అతి సమీపంగా వినవచ్చాయి.

రాజేష్ చెవులు రిక్కించి విని, "అవును. ఇవి ఏవో జలచరాలు చేస్తున్న సవ్వడిలా వుంది" అన్నాడు.

అతని మాటలు పూర్తయ్యేలోపలే కొన్ని ఎండ్రకాయలు వాళ్ళ కాళ్ళను తాక్కుంటూ అటుయిటు పరుగులు పెట్టాయి. అందరూ కాళ్ళు వెనక్కి తీసుకున్నారు. కళ్ళు చికిలించి చూసి ఎండ్రకాయలే అని నిర్ధారణ చేసుకున్నారు.

"ఈ ఎండ్రకాయలు ఎక్కడినుంచి వస్తున్నాయో గమనించు!" అన్నాడు రాజేష్.

అవినాశ్ షిప్పులో చుట్టూ పరిశీలగా చూస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో షిప్పులో పెద్ద పెద్ద శబ్దాలయ్యాయి. ఏదో బలంగా తోకలతో కొట్టినట్టున్నాయి ఆ శబ్దాలు!

47

రాజేష్ అవినాశ్ ముఖాలు చూసుకున్నారు. ఆ వినిపించే శబ్దాలు యెలాంటి జలచరాలవో. ఏయే సమస్యలు తలెత్తుతాయోనని సందేహం తలెత్తింది.

"అవినాశ్, ఎందుకైనా మంచిది కొన్ని ఆయుధాల్ని మనక్కపక్కన పెట్టుకుంటే మంచిది, రక్షణకోసం! వేట

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 7-6-'83 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '83 నెల సంచికలో ప్రకటిస్తాము.

మార్చి '83 పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్ '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

విలయానికీ తార్కాణం!
విపరీతపు విజ్ఞానం!!

పంపినవారు: శ్రీ యన్. వి. గణేశ్వరరావు, కోవరేటివ్ ఇనస్పెక్టరు, సూసర్లపూడి వారి వీధి, కాకినాడ.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కసాయి క్రౌర్యం పెరిగింది!
విషాద గీతం మిగిలింది!!

పంపినవారు: శ్రీ బి. ఆర్. మూర్తి, బి. ఏ., బి. కాం., 20/34, నరసింహా నగర్, మచిలీపట్టణం - 2.

కుక్కల హడావిడి తగ్గిపోతే తీరానికి వెళ్ళిపోదాం. పైకి పోవటానికి ఆధారం వున్నట్టుందిగా!" అన్నాడు రాజేష్ తలెత్తి చెక్కమెట్ల వైపు చూస్తూ.

"అయితే, ఆ ఆయుధాలు పని చేస్తున్నాయో లేదో నివృత్తి చేసుకోవాలి కదా!"

"పోనీ కత్తులు, కటార్లవంటివైనా పక్కన పెట్టుకుందాం. నాకెందుకో యీ లోపల ఎక్కువసేపు గాలి లేకుండా వుండలేమనిపిస్తోంది. అదోకరకమైన దుర్వాసన వస్తున్నట్టుంది కూడా!"

"నిజమే! ఇప్పటికే మన ఊపిరితిత్తుల్లో చెడుగాలి చోటుచేసుకుంది. వీలైనంత త్వరగా పైకి వెళ్ళిపోవాలి!"

ఇద్దరు ఆయుధాలున్న గదిలోకి వెళ్ళారు. చెరో రెండు కత్తులు తీసుకున్నారు. రెండు తుపాకులు, రౌండ్సుకూడా తీసుకున్నారు—తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయోగించటానికి!

వాళ్ళు ఆ గదిలో నుంచి బయటకి వస్తుండగానే ఆపద ముంచుకొచ్చింది.

ఎక్కడి నుంచి ఊడిపడిందో ఓ పెద్ద సొరచేప లోపలి కొచ్చేసింది. దాని నోరు చాలా వికృతంగా తెరుచుకుని వుంది. అవలీలగా ఓ మనిషిని మింగెయగలిగినంత విశాలంగా నోరు తెరిచి అర్చన మీదికి వచ్చేసింది.

రాజేష్ ఆలస్యం చెయ్యలేదు. చేతనున్న రెండు కత్తుల్ని దాని నోటిలోకి దించేశాడు. సొరచేప బాధతో విలవిలలాడింది. అయినా చావలేదు. మరింత వేగంగా తోకతో షిప్పుని మోదుతూ మీదిమీది కొచ్చింది.

ఈసారి అవినాశ్ కత్తులతో దానిమీద పడి దొరికిన చోటల్లా పొడి చేశాడు. మహా పర్వతంలా కూలిపోయింది సొర చేప. నెత్తురు వెల్లువలై షిప్పు గదుల్లో కాలవలుగా

మే నెలాఖరులో విడుదల!

ఆంధ్ర పాఠక లోకాన్ని విశేషంగా ఆకర్షించిన
ప్రసిద్ధ నవలలు....!!

శ్యాంబాబు రచన

కైలాస నగరం

(అపరాధ పరిశోధన సీరియల్)

వసుంధర రచన

అమానుషం

('అడుగు ముందుకు వేస్తే చస్తావ్' అనే పేరుతో
అపరాధ పరిశోధనలో వచ్చిన సీరియల్)

కాపీలు తయారుగా వున్నవి:

రమణశ్రీ రచన

అతీంద్రియ శక్తులు

(అపరాధ పరిశోధన సీరియల్)

వెల: రు. 18-00

కాపీలు అన్ని పుస్తకాల షాపులలోను లభించును
లేదా, మాకు వ్రాయండి

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి ఎంటర్ ప్రైజెస్

గవర్నరు పేట * విజయవాడ - 2

ప్రవహించింది.

అయితే అప్పటికే షిప్పుకి రంధ్రం పడిపోయింది. సొరచేప తోకతో కొట్టిన అదురుకు పాతవై చీకిపోయిన షిప్పు చెక్కలు సళ్ళిచ్చి నీటిని ధారాళంగా లోపలకి రావటానికి అవకాశమిచ్చింది.

"అవినాశ్, తొందరగా మెట్లెక్కి పైకి వెళ్దాం. సముద్రపు నీరు మనల్ని ముంచేలా వుంది!" అన్నాడు రాజేష్.

అవినాశ్ చెక్క మెట్లవైపు పరుగెత్తాడు. రాజేష్ అర్చన చెయ్యి పట్టుకుని తనూ పరుగెత్తాడు. నీరు మహా ధృతంగా లోనికి వచ్చేస్తోంది. షిప్పంతా నిండిపోతోంది.

నీటితోబాటు రకరకాల చేపలు, జలచరాలు లోపలికి వచ్చేస్తున్నాయి. కాళ్ళకి ఒరుసుకుంటూ నీరు, కాళ్ళకి గిలిగింతలు పెడుతూ చేపలు—వాళ్ళని నిలిచిన చోట నిలవకుండా పరుగెత్తుతున్నాయి.

రంధ్రం బాగా పెద్దదైపోయింది. నీరు ఒకేసారి ఉప్పెనలా లోని కొచ్చేసింది. సరిగ్గా అదే సమయంలో మరో భారీ జలచరం లోనికి దూసుకొచ్చేసింది.

దాన్ని చూస్తూనే ముగ్గురి గుండెలు అదిరిపోయాయి.

అది తిమింగలం!

దాని వాతపడితే యిక బతికి బట్టకట్టడ మంటూ వుండదు. అది లోపలికి వస్తూనే షిప్పు గోడలకి మహాబలంగా తాకింది. నోరు తెరిచి చిన్నచిన్న చేపల్ని తింటోంది. దాని కోరపళ్ళను చూస్తుంటే వాళ్ళ శరీరాలు భయంతో గగుర్పొడిచాయి. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001

Blank Page

Regd.no:H/HD-48